
శతారుణ గీతాంజలి
రూ॥ 180/-
పేజీలు: 180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


పార్లమెంట్ సమావేశాలు వాయిదా

పురి రాజీనామా చేయాలి

భారత్– అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఉద్యమం ప్రారంభించాలి 05


సంపుటి 28, సంచిక: 233 | శనివారం | 14-02-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ హవా



- కాంగ్రెస్ 1537, బిఆర్ఎస్ 781, బిజెపి 335, సిపిఐ 17, స్వతంత్రులు, ఇతరులు 339 స్థానాల్లో గెలుపు
- కాంగ్రెస్ 66, బిఆర్ఎస్ 13 మున్సిపాలిటీలు దక్కనుండగా, 36 మున్సిపాలిటీల్లో హంగ్
- మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్‌నగర్ కార్పొరేషన్లు కాంగ్రెస్ దక్కించుకోనుండగా, కరీంనగర్, నిజామాబాద్‌లో హంగ్

కొత్తగూడెం మేయర్ రేసులో సిపిఐ



"మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం"

– సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక స్థానాలను దక్కించుకున్నది. ప్రధానప్రతిపక్ష బిఆర్‌ఎస్‌కు కేవలం 13 స్థానాలకే పరిమితమైంది. తామే ప్రత్యామ్నాయమని చెప్పుకున్న బిజెపికి ఈ ఎన్నికలు తీవ్ర నిరాశను మిగిల్చింది. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పలు పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీని (సిపిఐ)ని 'పుర ఓటర్లు' ఆదరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కలిపి మొత్తం 123 పురపాలికలలోని 2996 వార్డులలో తరువాయి 2లో



### కాంగ్రెస్ బలం మూడింతలు రెండింతలైన సిపిఐ స్థానాలు

చివరిసారిగా 2020లోజరిగిన మున్సిపల్ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ గెలిచిన స్థానాలు మూడింతలయ్యాయి. సిపిఐ తన బలాన్ని రెండింతలు పెంచుకుంది. బిజెపి దాదాపుగా అంతే సంఖ్యలో సీట్లు గెలుచుకొంది. బిఆర్ఎస్ సుమారు వెయ్యి సీట్లను కోల్పోయింది. ఆ ఎన్నికల్లో 124 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు కలిపి 3,112 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం కొన్ని కొత్త కార్పొరేషన్‌లు రావడం, వాటిలో కొన్ని మున్సిపాలిటీలు విలీనమవడంతో 124 (116 మున్సిపాలిటీలు – 7 కార్పొరేషన్‌లు)లోని మొత్తం 2,996 స్థానాలకు ఈసారి ఎన్నికలు జరిగాయి. రెండు ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు లభించిన స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి.

| పార్టీ | 2020 | 2026 |
|---|---|---|
| | గెలిచిన స్థానాలు | |
| కాంగ్రెస్ | 580 | 1537 |
| బిఆర్ఎస్ | 1767 | 781 |
| బిజెపి | 311 | 335 |
| సిపిఐ | 20 | 40 |
| సిపిఐ(ఎం) | 12 | 13 |
| ఎంఐఎం | 64 | 70 |

## కొత్తగూడెం కార్పొరేషన్‌లో

# సిపిఐ జయకేతనం

22 డివిజన్లలో విజయం

- ఇది ప్రజా విజయం : కూనంనేని
- మేయర్ పదవికి సిపిఐకి మద్దతిస్తాం : కెటిఆర్
- ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేశాం.. సిపిఐ మా మిత్రపక్షమే : మంత్రి పొంగులేటి






ప్రజాపక్షం/ ఖమ్మం


నల్ల నేలపై మరోమారు ఎర్ర జెండా రెపరెపలాడింది. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ తన సత్తా ఏమిటో మరోమారు చూపింది. సిపిఐ వైపే మేమున్నామంటూ 22 స్థానాల్లో సిపిఐని గెలిపించడంతో పాటు మరో రెండు స్థానాల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించారు. సిపిఐకి ఉన్న బలమైన పునాది శాసన సభ్యునిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సమస్యల కోసం పార్టీ చేస్తున్న పోరాటాలు వెరసి కార్పొరేషన్‌లో సిపిఐకి ఆధిక్యం తరువాయి 2లో




## అభివృద్ధి, సంక్షేమానికి

# ప్రజలు పెద్దపీట

బిఆర్ఎస్, బిజెపి కట్టు కథలను ప్రజలు నమ్మలేదు అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు




ప్రజాపక్షం/హైదరాబాద్

"రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో శుక్రవారం రాత్రి వరకు అందిన ఫలితాల మేరకు 83 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ అజేయంగా కైవసం చేసుకుంది. అభివృద్ధి, సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీట వేశారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని ఈ ఫలితాలతో తేటతెల్లమైంది" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రాష్ట్రంలోని బిఆర్ఎస్, బిజెపి నేతలు ప్రతిరోజు గాలి కబుర్లు చెబుతూ, కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పును ఇచ్చారని ఆయన అన్నారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగిందని, అత్యున్నత ప్రమాణాలతో పరిపాలన అందిస్తామని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులతో తరువాయి 2లో

## రెండు దశాబ్దాల తర్వాత..

# బంగ్లాదేశ్‌లో అధికారంలోకి బిఎన్‌పి



**ఢాకా :** సుమారు రెండు దశాబ్దాల తర్వాత బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో పెను మార్పు సంభవించింది. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) ఘన విజయం సాధించి, అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమైంది. 300 స్థానాల పార్లమెంట్‌లో బిఎన్‌పి కూటమి ఇప్పటికే 208 స్థానాలు సాధించినట్లు స్థానిక మీడియా నివేదించింది. మరిన్ని స్థానాల్లో ఆధిక్యం కొనసాగుతోందని సమాచారం. వివిధ కారణాలతో మూడు నియోజకవర్గాల్లో ఫలితాలను నిలిపివేశారు. కాగా, అధికారిక ప్రకటనను ఎన్నికల సంఘం ఇంకా విడుదల చేయాల్సి ఉంది. ఈ ఎన్నికలు రాజకీయ పరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2024 ఆగస్టులో విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలతో షేక్ హసీనా నేతృత్వంలోని 15 సంవత్సరాల పాలన కూలిపోయిన తర్వాత దేశం రాజకీయ శూన్యత, అస్థిరత, భద్రతా సమస్యలను ఎదుర్కొంది. ముఖ్యంగా మైనారిటీలపై దాడులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన 13వ పార్లమెంటరీ ఎన్నికలు దేశ ప్రజాస్వామ్య దిశను నిర్ణయించేవిగా మారాయి. బిఎన్‌పి అగ్రనేత తారిక్ రహమాన్ తదుపరి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నోబెల్ బహుమతి గ్రహీత తారిక్ రహమాన్ నేతృత్వంలోని అంతరిమ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఎన్నికల ముందు బిఎన్‌పి ప్రకటించినట్లుగా, పార్టీ విజయం సాధిస్తే తారిక్ రహ్మానే ప్రధానమంత్రిగా అవతరించనున్నారు. అలా జరిగితే, గత 35 సంవత్సరాల్లో బంగ్లాదేశ్‌కు తొలి పురుష ప్రధానమంత్రిగా ఆయన నిలుస్తారు. ఈ ఎన్నికల్లో జమాతే ఇస్లామీ 69 స్థానాల్లో విజయం సాధించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, మాజీ ప్రధానమంత్రి హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఉండడంతో, అది ఎన్నికల బరిలో లేదు. దీనితో పోటీని బిఎన్‌పి–జమాత్ మధ్య నేరుగా మార్చింది. 2001–2006 మధ్య బిఎన్‌పి అధికారంలో ఉన్నప్పుడు జమాత్ కీలక మిత్రపక్షంగా ఉండి, దాని ఇద్దరు నేతలు మంత్రులుగా పనిచేశారు. ఎన్నికల సంఘం ప్రకారం తరువాయి 2లో




### ప్రపంచ దేశాల స్పందన

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలపై అంతర్జాతీయ స్థాయిలో స్పందనలు వచ్చాయి. తారిక్ రహ్మాన్‌కు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజాస్వామ్య, ప్రగతిశీల, సమగ్ర బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతుగా ఉంటుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. హసీనా ప్రభుత్వ పతనం తర్వాత భారత్–బంగ్లాదేశ్ సంబంధాలు ఉద్రిక్తతను ఎదుర్కొన్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. బిఎన్‌పి నేతలు కూడా మోదీ తరువాయి 2లో

## మున్సిపాలిటీల్లో గెలిచిన సిపిఐ అభ్యర్థులు



దండి రంగారావు (28వ వార్డు) ఏదులాపురం | మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి (32వ వార్డు) ఏదులాపురం | దండి శ్రీజ (30వ వార్డు) ఏదులాపురం | కె.సత్యవతి (...వ వార్డు) ఏదులాపురం | నల్లమోతు శైలజ (15వ వార్డు) వైరా | జెల్ల ధనమ్మ (4వ వార్డు) చండూరు



బబ్బూరి శ్రీధర్ (12వ వార్డు) యాదగిరిగుట్ట | చెనగాని సైదులు (10వ వార్డు) హుజూర్‌నగర్ | రాయపూరి కాటన్‌రావు (2వ వార్డు) కోదాడ | బి. అజయ్ సారథి (33వ వార్డు) మహబూబాబాద్ | రేశపల్లి నవీన్ (18వ వార్డు) మహబూబాబాద్ | నర్ర సంధ్య (25వ వార్డు) మహబూబాబాద్



వేముల జ్యోతి (24వ వార్డు) భూపాలపల్లి | కౌడగాని సాంబయ్య (1వ వార్డు) క్యాతనపల్లి | మద్దెల శంకరయ్య (6వ వార్డు) క్యాతనపల్లి | మినుగు ముని (8వ వార్డు) క్యాతనపల్లి | మిట్టపల్లి సరిత శ్రీనివాస్ (22వ వార్డు) క్యాతనపల్లి

రామగుండం కార్పొరేషన్



మార్కాపురి సూర్య (41వ డివిజన్)

## కొత్తగూడెం కార్పొరేషన్‌లో గెలిచిన సిపిఐ అభ్యర్థులు



పడాల ఆకాంక్ష 11వ డివిజన్ | మంద నాగలక్ష్మి 12వ డివిజన్ | కూరపాటి సుధాకర్ 14వ డివిజన్ | మునిగడప పద్మ 16వ డివిజన్ | ఎర్రబెల్లి శంకర్ 17వ డివిజన్ | కంచర్ల హిమశ్రీ 18వ డివిజన్ | మూడ్ గణేష్ 20వ డివిజన్ | పొలమూరి ధనలక్ష్మి 24వ డివిజన్



మందల హరిత 27వ డివిజన్ | గుమ్మడెల్లి దర్గయ్య 30వ డివిజన్ | నూనావత్ శ్యామల 31వ డివిజన్ | నామా కీర్తి 35వ డివిజన్ | అడుసుమిల్లి సాయిబాబా 40వ డివిజన్ | వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44వ డివిజన్ | గుర్రం వెంకటేశ్వర్లు 47వ డివిజన్ | బోయిన విజయ్‌కుమార్ 49వ డివిజన్



దాసరి శ్రీనివాస్ 50వ డివిజన్ | బానోత్ కళావతి 52వ డివిజన్ | బండి నర్సింహారావు 53వ డివిజన్ | గడ్డం శాంతిప్రియ 56వ డివిజన్ | షాహీరా మహ్మద్ 57వ డివిజన్ | గొర్లె అన్నపూర్ణ 41వ డివిజన్

### సత్తా చాటిన సిపిఐ

17 కౌన్సిలర్‌లు, 23 కార్పొరేటర్‌లు గెలుపు మొత్తం 40 స్థానాలలో విజయం 9 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్‌లలో ప్రాతినిధ్యం 03

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
14-02-2026
www.prajapaksham.in




## మిన్నియాపోలిస్ ఘటనలో అధికారులను విచారించిన సెనేట్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన భారీ వలసదారుల పంపకాల విధానాన్ని అమలు చేస్తున్న అధికారులను సెనేట్ విచారించింది. మిన్నియాపోలిస్‌లో జనవరి 24న జరిగిన కాల్పుల్లో అలెక్స్ ప్రెట్టి మరణించిన ఘటనపై వీడియోను సెనేటర్ రాండ్ పాల్ ప్రదర్శిస్తూ, మధ్యమధ్యలో నిలుపుతూ, విశ్లేషించారు. అధికారులకు ప్రెట్టి ఎటువంటి ముప్పు కలిగించలేదని, వెనక్కి తగ్గే ప్రయత్నం చేస్తుండగానే పెప్పర్ స్ప్రే వాడి, ఆ తర్వత కాల్చి చంపారని ఆయన వాదించారు. ఈ ఘటనతో ప్రజలు వలస అమలు సంస్థలపై విశ్వాసం కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. ఈ విచారణకు ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తాత్కాలిక డైరెక్టర్ టాడ్ లయన్స్, కస్టమ్స్ అండ్ బార్డర్ ప్రొటెక్షన్ అధిపతి రాడ్నీ స్కాట్, అలాగే యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికారి జోసెఫ్ ఎడ్లో హాజరయ్యారు. స్కాట్ మాత్రం ప్రెట్టి అధికారుల ఆదేశాలను పాటించలేదని, ప్రతిఘటించాడని తెలిపారు. లయన్స్ తన విభాగం జవాబుదారీతనం పాటిస్తోందని, గత ఏడాదిలో అధిక బలప్రయోగంపై 37 దర్యాప్తులు ప్రారంభించామని చెప్పారు. ప్రెట్టి మరణంతో పాటు నిరసనల్లో పాల్గొన్న మరో అమెరికన్ పౌరురాలు రినీ గుడ్ మరణం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సరిహద్దు వ్యవహారాల ప్రతినిధి టామ్ హోమన్ మిన్నెసోటా ఆపరేషన్‌ను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఒక దశలో దాదాపు 3,000 మంది ఐసిఇ, సిబిపి అధికారులను అక్కడ మోహరించారు. ఇంకా ఒక వివాదాస్పద అంశంగా పరిపాలనా వారెంట్ల వినియోగం నిలిచింది. స్వతంత్ర న్యాయమూర్తి సంతకం లేకుండానే ఐసిఇ అధికారులు జారీ చేసే ఈ వారెంట్లతో ఇళ్లలోకి ప్రవేశించడం రాజ్యాంగ పరిరక్షణలకు విరుద్ధమని సెనేటర్ రిచర్డ్ బ్లూమెన్‌థాల్ అభిప్రాయపడ్డారు. అయితే మిన్నెసోటాలో ఉన్న న్యాయవ్యవస్థ ఆధారంగా ఇది చట్టబద్ధమేనని లయన్స్ వాదించారు. మొత్తంగా ఈ విచారణ వలస అమలు విధానాలపై తీవ్ర రాజకీయ విభేదాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఒకవైపు చట్ట అమలులో అధికారులకు ఎదురయ్యే ముప్పులను రిపబ్లికన్లు ప్రస్తావిస్తే, మరోవైపు అధిక బలప్రయోగం మరియు రాజ్యాంగ పరిరక్షణలపై డెమోక్రాట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



# మధ్యప్రాచ్యంలో మరో అమెరికా యుద్ధ నౌక

**వాషింగ్టన్:** మధ్యప్రాచ్య ప్రాంతం మరోసారి యుద్ధ వాతావరణం వైపు దూసుకెళ్తుందా అన్న ప్రశ్న అంతర్జాతీయ వేదికపై చర్చకు వస్తోంది. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక యుఎస్ఎస్ గెరాల్డ్ ఎఫ్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యానికి తరలించాలని ఆదేశించడం ఉద్రిక్తతలను పెంచుతున్నది. ఇప్పటికే యుఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌకతో పాటు మూడు మార్గదర్శక క్షిపణి విధ్వంసక నౌకలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఈ పరిణామంతో రెండు శక్తివంతమైన క్యారియర్ స్ట్రైక్ గ్రూపులు మధ్యప్రాచ్యంలో మోహరిస్తున్నారు. ఇది ఇరాన్‌పై ఒత్తిడి పెంచే వ్యూహాత్మక సంకేతంగా పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందానికి రావాలని కోరుతున్న విషయం తెలిసిందే. ఒకవేళ ఇరాన్ అందుకు నిరాకరిస్తే, సైనిక చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నది ట్రంప్ అభిప్రాయంగా కనిపిస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో అదనపు నౌకా బలగాల మోహరింపు కేవలం రక్షణాత్మక చర్యనా? లేక ముందస్తు హెచ్చరికనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా విమాన వాహక నౌకల వినియోగం శక్తి ప్రదర్శనకు ప్రతీక. రెండు క్యారియర్ బృందాలను ఒకేసారి ఒకే ప్రాంతంలో ఉంచడం అత్యవసర పరిస్థితిని సూచించే చర్యగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం అమెరికా జాతీయ భద్రతా వ్యూహానికి విరుద్ధమా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. గతంలో పశ్చిమ అర్ధగోళంపై ఎక్కువ దృష్టి పెట్టిన వ్యూహం ఇప్పుడు మధ్యప్రాచ్యంపై మళ్లీ కేంద్రీకృతమవుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవల వెనిజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను అరెస్టు చేసిన చర్యల అనంతరం అమెరికా సైనిక కదలికలు వేగం పెంచాయి. ఇప్పుడు ఇరాన్‌పై ఒత్తిడి పెంచడం ప్రాంతీయ సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తోంది. ఇరాన్‌తో అమెరికా సంబంధాలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్నాయి. అణు ఒప్పందంపై చర్చలు అనిశ్చితంగా కొనసాగుతున్నాయి. ఈ తరహా భారీ సైనిక సమీకరణలు దౌత్య చర్చలకు తోడ్పడతాయా లేక మరింత ప్రతిస్పందనాత్మక చర్యలకు దారి తీస్తాయా అన్నది ప్రశ్న. ఇరాన్ మిత్ర బలగాలు ప్రాంతవ్యాప్తంగా చురుకుగా ఉండటం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నది. చిన్న ఘర్షణ కూడా విస్తృత ప్రాంతీయ యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. కాగా, అమెరికా వైట్ హౌస్ అధికారిక వ్యాఖ్యానాన్ని వెంటనే విడుదల చేయకపోవడం కూడా ఊహాగానాలకు తావిస్తోంది. ఈ చర్య నిరోధక ధోరణిలో భాగమా? లేదా ప్రత్యక్ష సైనిక ఎంపికలకు ముందస్తు సన్నాహమా? అన్నది రాబోయే వారాల్లో స్పష్టమవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యం పూర్తి స్థాయి యుద్ధంలోకి ప్రవేశించిందని చెప్పడం అతిశయోక్తి అయినప్పటికీ, శాంతి, భద్రతపై తీవ్రమైన అనుమానాలు తలెత్తుతున్నాయి. సైనిక శక్తి ప్రదర్శనతో పాటు దౌత్య మార్గాలు సమాంతరంగా కొనసాగకపోతే పరిస్థితి మరింత సంక్లిష్టమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



## క్యూబాకు మెక్సికో సాయం

**హవానా:** అమెరికా విధించిన ఆంక్షలు ద్వీప దేశమైన క్యూబాలో ఇంధన సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో, మెక్సికో మానవతా సాయాన్ని అందించింది. పలు రకాల సరుకులతో నిండిన మెక్సికో నౌకాదళానికి చెందిన రెండు నౌకలు గురువారం హవానా తీరానికి చేరాయి. రెండు వారాల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, క్యూబాకు చమురు అమ్మే లేదా సరఫరా చేసే ఏ దేశానికైనా సుంకాలు విధిస్తామని హెచ్చరించిన తరువాత ఈ పరిణామం చోటుచేసుకుంది. దీనివల్ల క్యూబా ఇటీవల ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాల్సి వచ్చింది. మెక్సికో ప్రభుత్వం తెలిపిన ప్రకారం, ఒక నౌకలో సుమారు 536 టన్నుల ఆహార పదార్థాలు ఉన్నాయి. వీటిలో పాలు, బియ్యం, బీన్స్, సార్డిన్లు, మాంసాహార ఉత్పత్తులు, బిస్కెట్లు, టిన్‌లో నిల్వ చేసిన ట్యూనా చేప, వంటనూనెతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత సామగ్రి ఉన్నాయి. రెండో నౌకలో 277 టన్నులకు పైగా పాలు పొడి సరుకు ఉంది. 34 ఏళ్ల ఇంజనీర్ యోహాంద్రి ఎస్పినోసా తన కుమార్తెతో కలిసి నౌకల రాకను వీక్షిస్తూ చిత్రాలు తీశాడు. ఈ సహాయం ప్రస్తుత పరిస్థితుల్లో క్యూబా ప్రజలకు అత్యంత కీలకమని, తీవ్ర అవసరం, అనిశ్చితి నడుమ జీవిస్తున్నామని, ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందో తెలియదని అతను పేర్కొన్నాడు. కాగా, ట్రంప్ హెచ్చరికలను ఇంధన నిర్బంధంగా క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ బెర్మడెజ్ అభివర్ణించారు. ఇవి రవాణా, ఆసుపత్రులు, పాఠశాలలు, పర్యాటకం, ఆహార ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ద్వీపంలో విమానాలకు ఇంధనం సరిపడా అందుబాటులో లేదని క్యూబా వైమానిక అధికారులు హెచ్చరించారు. దీంతో కొన్ని విమాన సంస్థలు క్యూబాకు వెళ్లే విమానాలను నిలిపివేయగా, మరికొన్ని డొమినికన్ రిపబ్లిక్‌లో మధ్యంతర విరామాలు ప్రకటించాయి. ఇది ఇప్పటికే దెబ్బతిన్న పర్యాటక రంగానికి మరొక దెబ్బగా భావిస్తున్నారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బామ్, ఈ నౌకలు తిరిగి వచ్చిన వెంటనే మరింత సహాయాన్ని పంపిస్తామని తెలిపారు. అదనంగా 1,500 టన్నుల బీన్స్, పాలు పొడి పంపే ప్రణాళిక కొనసాగుతోందని వెల్లడించారు. చమురు సరఫరా పునరుద్ధరణకు దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయని, క్యూబా రోజువారీ అవసరాల కోసం చమురు మరియు దాని ఉత్పత్తులు అందుకునేలా శాంతియుత సంభాషణను ప్రోత్సహిస్తున్నామని ఆమె చెప్పారు. ఇదిలా ఉండగా, జనవరిలోనే మెక్సికో ప్రభుత్వ చమురు సంస్థ క్యూబాకు ముడి చమురు సరఫరాను నిలిపివేసింది. రష్యా చమురు సరఫరా చేస్తుందా అనే ప్రశ్నపై రష్యా ప్రతినిధి స్పందించేందుకు నిరాకరించారు. అమెరికా ఆంక్షల వల్ల 2024 మార్చి నుంచి 2025 ఫిబ్రవరి వరకు క్యూబాకు 7.5 బిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లిందని క్యూబా అధికారులు పేర్కొన్నారు.

## ప్రతిపక్ష నాయకుల విడుదలపై సమావేశం వాయిదా

**కారకస్:** వెనిజులా అధికార పార్టీ ఆధీనంలో ఉన్న పార్లమెంట్, రాజకీయ కారణాలతో నెలలుగానీ సంవత్సరాలుగానీ నిర్బంధంలో ఉన్న ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షకులలో వందలాది మందిని విడుదల చేసే అవకాశాలను చర్చించడానికి జరిగిన సమావేశం వాయిదా పడింది. ఈ ప్రతిపాదనను వెనిజులా ప్రభుత్వం స్వయంగా చేస్తున్నదా లేక అక్కడ రాజకీయ అస్థిరత్వాన్ని కొనసాగించడానికి అమెరికా ఒత్తిడి తెస్తున్నదా అనే ప్రశ్న తెరపైకి వస్తున్నది. దేశంలో రాజకీయ ఖైదీలు ఎవరూ లేరని చాలాకాలంగా నికొలస్ మదురో ప్రభుత్వం పేర్కొంటూ వచ్చింది. అయితే, మదురో వాదన తప్పని నిరూపించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు, తాజా ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి. రాజకీయ ఖైదీల విడుదలపై చర్చ పేరుతో జరిగిన సమావేశంలో, చట్టప్రతిపాదనలోని కొన్ని అంశాలను శాసనసభ్యులు ఆమోదించినప్పటికీ, కొన్ని వివాదాస్పద అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, చర్చను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా, నిర్బంధాన్ని తప్పించుకోవడానికి దేశం విడిచిన వ్యక్తులకు కూడా అమ్నెస్టీ వర్తించాలా లేదా అనే అంశం ఇంకా స్పష్టతకు రాలేదు. ఈ చర్చ వచ్చే వారం మళ్లీ ప్రారంభమయ్యే అవకాశముంది. జనవరి 3న కారాకాస్ నగరంలో జరిగిన దాడిలో అప్పటి అధ్యక్షుడు నికోలాస్ మదురోను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకున్న కొన్ని వారాల తర్వాత, తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్వెజ్ ఈ బిల్లును ప్రతిపాదించారు. బిల్లులోని తాజా ముసాయిదా ప్రకారం, 1999 నుంచి వెనిజులాలో రాజకీయ ఘర్షణలు జరిగిన నిర్దిష్ట కాలాల్లో జరిగిన నేరాలకు క్షమాభిక్ష మంజూరు చేయడం దీని ఉద్దేశంగా పేర్కొంది. ఇందులో 2024 అధ్యక్ష ఎన్నికల సందర్భంలో జరిగిన రాజకీయ ప్రేరిత హింసాత్మక ఘటనలు కూడా చేరుస్తారు.



## ఐఎస్ఎస్‌కు కొత్త వ్యోమగాముల బృందం

**వాషింగ్టన్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో వైద్య అత్యవసర పరిస్థితి కారణంగా ముందుగా భూమికి తిరిగి వచ్చిన వ్యోమగాముల స్థానంలో కొత్త బృందాన్ని స్పేస్ ఎక్స్ విజయవంతంగా ప్రయోగించింది.



అమెరికా అంతరిక్ష సంస్థ నాసా అభ్యర్థన మేరకు ఈ ప్రయోగాన్ని యుద్ధ ప్రాతిపదిక మీద చేపట్టారు. అమెరికా, ఫ్రాన్స్, రష్యాకు చెందిన నలుగురు వ్యోమగాములు ఎనిమిది నుంచి తొమ్మిది నెలల మిషన్ కోసం బయలుదేరారు. వారు శనివారం అంతరిక్ష కేంద్రానికి చేరుకుని, గత నెల వైద్య కారణాలతో భూమికి పంపిన సిబ్బంది స్థానాలను భర్తీ చేస్తారు. ఇది మానవ అంతరిక్ష ప్రయాణ చరిత్రలో అరుదైన ఘటనగా నిలిచింది. 65 సంవత్సరాల అంతరిక్ష చరిత్రలో మొదటిసారి వైద్య కారణాల వల్ల నాసా ఒక మిషన్‌ను మధ్యలోనే నిలిపివేసింది. అయితే, అనారోగ్యానికి గురైన వ్యోమగామి వివరాలను నాసా వెల్లడించలేదు. భూమికి తిరిగి వచ్చిన నలుగురు వ్యోమగాములను పసిఫిక్ సముద్రంలో శాన్ డియాగో సమీపంలో ల్యాండింగ్ అనంతరం నేరుగా ఆసుపత్రికి తరలించారు. కొత్త బృందంలో జెస్సికా మియర్, జాక్ హాతవే, ఫ్రాన్స్‌కు చెందిన సోఫీ అడెనోట్, రష్యాకు చెందిన ఆంద్రే ఫెద్యాయేవ్ ఉన్నారు. వీరిలో మియర్, ఫెద్యాయేవ్ రెండోసారి అంతరిక్ష ప్రయాణం చేస్తున్నారు.

# సిపిఐ జయకేతనం

(మొదటి పేజీ తరువాయి)

దక్కింది. ధనాహంకారం , అధికార అహంకారానికి కాలం చెల్లిందని ప్రజల మధ్య నిలిచే వారికే పట్టం కడతామని కొత్తగూడెం ప్రజలు తేల్చి చెప్పారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో సిపిఐ 22 స్థానాల్లో విజయం సాధించి అధికార పార్టీకి ధీటుగా నిలిచింది. అధికార కాంగ్రెస్ అండ బలాన్ని, బంధు బలాన్ని, ధన బలాన్ని ప్రదర్శించిన ఫలితం లేకపోయింది. గతంలో కొత్తగూడెం మున్సిపాలిటీని కైవసం చేసుకున్న బిఆర్ఎస్ ఈ దఫా మూడవ స్థానంతో సరిపెట్టుకుంది. ఎనిమిది వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. స్వతంత్ర అభ్యర్థులతో కలిపి 24 స్థానాల్లో విజయం సాధించిన సిపిఐ స్వల్ప తేడాతో మూడు డివిజన్లలో ఓటమి చెందింది. పొత్తుల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ సిపిఐకి సరైన స్థానాలు కేటాయించకపోవడంతో సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగింది. ఒంటరి పోరులో ముందు వరుసలో నిలిచింది. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు కార్పోరేషన్ ఎన్నికల్లో తమ ప్రభావం చూపగా, కొత్తగూడెంలో మాత్రం నిరంతర ప్రజాపోరాట వారధి సిపిఐ విజయకేతనం ఎగురవేసింది.

### ఇది ప్రజా విజయం : కూనంనేని

కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ సాధించిన విజయం ప్రజలు, కార్మికుల విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. 22 డివిజన్లలో విజయం సాధించామని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ హోరాహోరీగా సాగిన కార్పోరేషన్ ఎన్నికల ఫలితాల్లో సిపిఐకి అపూర్వ విజయాన్ని అందించారని కొత్తగూడెం కార్పోరేషన్ తొలి మేయర్ స్థానాన్ని సిపిఐ దక్కించుకుంటుందన్నారు. తమతో కలిసి వచ్చే వారిని కలుపుకు పోతామని మద్దతు విషయంలో పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రచారంలోనూ ఎక్కడ ఎవరిని విమర్శించకుండా ముందుకు సాగామని తమకు ప్రజలు అడుగడుగునా ఆదరాభిమానాలు చూపించారని కూనంనేని తెలిపారు. కార్పోరేషన్ ఎన్నికల ఫలితాలు బాధ్యతను మరింతగా పెంచాయని ప్రజల పక్షాన పనిచేసేందుకు సిపిఐ పునరంకితమవుతుందన్నారు. గడిచిన రెండేళ్లుగా సిపిఐ చేసిన అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ చేసిన కృషి ఈ విజయానికి కారణమని కూనంనేని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు ప్రసాద్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తగూడెంలో ఓడిపోలేదు... సిపిఐ మా మిత్రపక్షం : పొంగులేటి

"కొత్తగూడెం కార్పోరేషన్‌లో కాంగ్రెస్ ఓడిపోలేదు. సిపిఐ మా మిత్రపక్షం. ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేశామని, కాంగ్రెస్, సిపిఐకి ఇద్దరికీ సమానమైన సీట్లు వచ్చాయి. మనసులో ఉన్నది చెప్పుకునే స్వేచ్ఛ కలిగిన ఏకైక పార్టీ కాంగ్రెస్'' అని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలు, జూబ్లిహిల్స్ ఫలితాలు, గ్రామపంచాయతీ ఎన్నికలు, ప్రతిదీ రెఫరెండం అన్నారని, కానీ, అన్నింట్లో ఓటమి పాలయ్యారని మంత్రి అన్నారు. ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ రెఫరెండం అని బిఆర్ఎస్ వారి కార్యకర్తలను, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ఎది ఏమైనా ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందని, సిఎం నాయకత్వంలో బాధ్యతాయుతంగా మాటలతో కాకుండా చేతలతో తూచా తప్పకుండా పాలన కొనసాగిస్తామన్నారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలపడిందని, సుమారు 68 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారన్నారు. రెండేళ్ల ప్రజాపాలనను పోల్చుకుంటే ప్రజల నుంచి పూర్తి ఆశీర్వాదం దక్కిందన్నారు.

### కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐకి మద్దతు : కెటిఆర్

కొత్తగూడెం కార్పొరేషన్‌లో తాము సిపిఐకి మద్దతు ఇస్తామని కెటిఆర్ ప్రకటించారు. సింగరేణి సంస్థలో జరుగుతున్న దోపిడీని, సింగరేణి కేంద్రంగా కొత్తగూడెంలో కాంగ్రెస్ ,బిజెపిని ఎండగట్టాలనే ఉద్దేశంతోనే తాము సిపిఐకి మద్దతునిస్తున్నామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో రూ 6వేల కోట్ల కుంభకోణం జరిగినట్టు వెలుగులోనికి తీసుకొచ్చామని, ఆ తర్వాత తమతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కలిసివచ్చిందని, చెన్నూరు నియోజకవర్గంలో, క్యాతనపల్లి మున్సిపాలిటీలో తమతో పాటు కలిసి ప్రచారంలో పాల్గొన్నదని, తద్వారా మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వివరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ సాంబశివరావుతో తాను మాట్లాడానని, కొత్తగూడెంలో తాము సిపిఐకి మద్దతు ఇస్తున్నట్టు బహిరంగంగానే చెప్పామన్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, సింగరేణిలో జరుగుతున్న దుర్మార్గాలు,అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే డెఫినెట్ గా తాము కలిసి వస్తామన్నారు. కొత్తగూడెం, చెన్నూరులో సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉన్నదని, 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిదని కెటిఆర్ వివరించారు.

## ప్రజలు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

కలిసి డిప్యూటీ సిఎం మాట్లాడారు. ఎన్నికల్లో ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉంది కాంగ్రెస్ స్థానాలు మరిన్ని పెరుగుతాయని చెప్పారు. స్వతంత్రులు, ఇతర పార్టీల వారు మాతో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఉన్నారని, చివరకు మొత్తంగా 116 మున్సిపాలిటీలకుగాను 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమ అవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించిందని, మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడిందన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయమని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సిఎం సూచించారు. ప్రసారమాధ్యమాల్లో కనిపించాలని, ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని, ప్రతిపక్షాలు కట్టు కథలు అల్లడం, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని డిప్యూటీ సిఎం సూచించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని ప్రజాస్వామ్యవాదిగా తాను బలంగా కోరుకుంటానని డిప్యూటీ సిఎం తెలిపారు.

## ప్రపంచ దేశాల స్పందన

(మొదటి పేజీ తరువాయి)

అభినందనలను స్వాగతిస్తూ, కొత్త ప్రభుత్వంలో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం కూడా ప్రజలకు, బిఎన్‌పికి అభినందనలు తెలియజేసి, పరస్పర అభివృద్ధి, భద్రతా లక్ష్యాల సాధనలో కలిసి పనిచేయాలని తెలిపింది. బంగ్లాదేశ్‌లో సజావుగా సాధారణ ఎన్నికలు నిర్వహించినందుకు అభినందనలు తెలుపుతూ, చైనా శుక్రవారం ఢాకాతో కలిసి వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది. బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు స్థిరంగా, సజావుగా జరిగాయని, బిఎన్‌పి స్పష్టమైన మెజారిటీ సాధించిందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియన్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ తన అంతర్గత రాజకీయ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడాన్ని చైనా మద్దతు ఇస్తుందని, అలాగే చైనా–బంగ్లాదేశ్ వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఢాకాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

## కాంగ్రెస్ విజయంతో ప్రభుత్వ బాధ్యత మరింత పెంచింది

### ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితం: సిఎం

### మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై సిఎంకు ప్రియాంక అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా సిఎం ఒక ట్వీట్ చేశారు. 'రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితం. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనం. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితం' అని సిఎం తెలిపారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షే మం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని సిఎం పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంక గాంధీ అభినందించారు. ఢిల్లీలో శుక్రవారం ప్రియాంక గాంధీతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆమె ప్రత్యేక్యంగా అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నందున కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం కట్టబెట్టారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీకి సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

# కాంగ్రెస్ హవా

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం రాత్రి వరకు 2979 వార్డుల ఫలితాలను మాత్రమే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఇందులో కాంగ్రెస్‌కు 1537 వార్డులు, బిఆర్ఎస్‌కు 781 వార్డులు, బిజెపి 335 వార్డులు, ఇతరులు, ఇండిపెండెంట్లు, రిజిస్టర్ రాజకీ య పార్టీలు 339 వార్డులను గెలుచుకున్నట్టు వెల్లడించింది.

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు అత్యధికంగా 64 మున్సిపాలిటీలను దక్కించుకోనుంది. బిఆర్ఎస్ 13, మున్సిపాలిటీలు దక్కనున్నాయి. అయితే సుమారు 38 మున్సిపాలిటీలలో ఏ రాజకీయ పార్టీకి పూర్తి స్థాయి మెజారిటీ దక్కకపోవడంతో హంగ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లలో మంచిర్యాల, రామగుండం, నల్లగొండ,మహబూబ్‌నగర్ కార్పొరేషన్లను కాంగ్రెస్ దక్కించుకోనుంది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో ఏ రాజకీయ పార్టీకి మెజార్టీ రాలేదు. బిజెపికి ఎక్కువ స్థానాలు దక్కాయి. దీంతో ఈ రెండు కార్పొరేష్లలో హంగ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అలాగే కొత్తగూడెం కార్పొరేషన్‌లో కూడా సిపిఐ, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీ చేయగా, సిపిఐకి 22, కాంగ్రెస్‌కు 22 స్థానాలు వచ్చాయి. బిఆర్ఎస్‌కు 8, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిపికి బిఆర్ఎస్ మద్దతునిస్తున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రకటించారు. స్వతంత్రులు కూడా సిపిఐ వైపే ఉండడంతో ఈ కార్పొరేషన్ సిపిఐకి దక్కే అవకాశాలు ఉన్నాయి.

### కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే పోటీ

ఎన్నికలలో పట్టణ ప్రజలు అధికార కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. మెజార్టీ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ మధ్య పోటీ ఉన్నట్టుగా కనిపించింది. పట్టణ ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపుతారని ఆ పార్టీ నేతలు వేసుకున్న అంచనాలు తలక్రిందులయ్యాయి. 123 పురపాలికలలోని 2996 2,569 వార్డులలో బిజెపి కేవలం 332 వార్డులకే పరిమితమైంది. రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి పోటీ చేసినప్పటికీ కనీసం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి సమీప పోటీని కూడా ఇవ్వలేకపోయింది. సుమారు 38 మున్సిపాలిటీల్లో రెబల్స్, స్వతంత్రులు కీలకంగా మారనున్నారు. దీంతో అధికర, ప్రధానప్రతిపక్ష పార్టీలు స్వతంత్రులను తమ వైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు ప్రధాన రాజకీయ పార్టీలు కూడా గెలుపొందిన తమ అభ్యర్థులను కాపాడుకునేందుకు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు.

### 16న మేయర్, చైర్ పర్సన్ల ఎన్నిక

రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ ఉదయం ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్ల ఎన్నిక జరగనుంది. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక ముగిసే వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నిక ధృవపత్రాన్ని స్వయంగా విజేతలకే అందచేయాలని, నిఘా, తనిఖీ బృందాలను మరింత అప్రమత్తం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ముగ్గురికి మించి గుంపుగా ఉండరాదని స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా, హంగ్ ఏర్పడే మున్సిపాలిటీలలో స్వతంత్ర అభ్యర్థులకు డిమాండ్‌పెరిగింది. దీంతో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. హంగ్ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మార్గదర్శకాలను పాటించాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## అధికారంలోకి బిఎన్‌పి

(మొదటి పేజీ తరువాయి)

ఓటింగ్ శాతం 59.44గా నమోదైంది. ఓట్ల లెక్కింపులో ఎలాంటి అక్రమాలు లేవని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎఎంఎం నాసుర్ ఉద్దీన్ గత ఎన్నికలలో కూడా పోలింగ్ శాతం పై చర్చలు జరిగాయని, ఈసారి కూడా అనుమానాలు వ్యక్తం చేయడం అవసరం లేదని పేర్కొన్నారు. ఫలితాల ప్రకటనలో స్వల్ప ఆలస్యాలు సహజమని వివరించారు. అయితే జమాత్, దాని మిత్రపక్షాలు ఫలితాల ప్రకటనలో అసాధారణ ఆలస్యాలు, తారుమార్లు జరిగాయని ఆరోపించాయి. ముఖ్యంగా ఢాకాలోని కొన్ని నియోజకవర్గాల్లో అధికార యంత్రాంగం ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నాయి. జమాత్ సహాయ కార్యదర్శి జనరల్ అహ్సనుల్ మహ్బూబ్ జుబైర్ ఎన్నికల అధికారి కార్యాలయంలో మాట్లాడుతూ, తమ నేతలు పోటీ చేసిన స్థానాల్లో ఫలితాలు ఆలస్యంగా ప్రకటించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అవసరమైతే కఠిన ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు

### గాంధీ భవన్‌లో సంబరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయ సాధించడంతో హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంతో సంబరాలు జరుపుకున్నారు. ఫలితాల ధోరణి వెలువడిన వెంటనే కార్యకర్తలు గాంధీ భవన్‌కు చేరుకుని జెండాలు ఊపుతూ, నినాదాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి, విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. నినాదాలతో గాంధీ భవన్ మారుమోగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నాయకత్వంపై పార్టీ శ్రేణులు ప్రశంసలు కురిపించాయి. టిపిసిసి అధ్యక్షుడి కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పలువురు టిపిసిసి నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయ నాయకత్వం అందించిన మార్గదర్శకత్వం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, టిపిసిసి ఫిషరీస్ సెల్ నాయకులు మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**హర్షం వ్యక్త పరిచిన కాంగ్రెస్ నేతలు**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టడం పట్ల పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు హర్షం వెలిబుచ్చారు. పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రతిబింబింప చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్న బియ్యం పంపిణీ ఈ ఎన్నికల్లో గేమ్ చెంజర్ గా మారిందని ఆయన చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం హర్షనీయమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి అభిప్రాయపడ్డారు. ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పటిష్ట వ్యూహం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో భారీ విజయం సాధ్యం అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల అందించిన దీవెనలు మరువలేమని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మరింత బాధ్యతలు పెంచాయని, నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని చిన్నారెడ్డి తెలిపారు.ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు కలసి దిగజారి శిఖండి రాజకీయాలకు పాల్పడినా ప్రజలు తెలివిగా బుద్ధి చెప్పారని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అభిప్రాయపడ్డారు. కెసిఆర్, హరీష్ రావు, కెటిఆర్ సొంత నియోజక వర్గాల్లో తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అనుకూల ఫలితాలు శుభపరిణామం

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐకి అనుకూల ఫలితాలు రావడం శుభ పరిణామమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నరసింహ అన్నారు. భవిష్యత్తులో ప్రజలతో మరింత మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ మరింత ఉద్యమిస్తుందన్నారు. కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో సిపిఐకి సహకరించిన ప్రజలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలలో సిపిఐకి అనుకూల ఫలితాలు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముందు శుక్రవారం సిపిఐ నాయకులు బాణాసంచాలు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి,డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ప్రముఖ న్యాయవాది కడారు ప్రభాకర్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, శంశుద్దీన్, మహమ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, చెట్టుకింది శ్రీనివాస్,ఇమ్రాన్, బాలకృష్ణ, కళ్యాణ్, అనిల్,కార్యాలయ సిబ్బంది గోవింద్, శ్రీరాములు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు సిపిఐపైన మరింత బాధ్యతను పెంచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి నల్లగొండ , ఖమ్మంతో పాటు క్యాతనపల్లి, మహబూబాబాద్, లాంటి అనేక ప్రాంతాలలో సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న పోరాటాలను చూసి ప్రజలు ఓట్లు వేశారని, ఇది చాలా గొప్ప విషయమని ఆయన అన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులకు కార్యకర్తలను అభినందించారు.

# అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు కృతజ్ఞతలు

### ఇది ప్రజా విజయం
### రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసుకోవడం పట్ల రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీదే కాదు, ఇది ప్రజల విజయం, తెలంగాణ ప్రభుత్వ పథకాల విజయం అని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసం, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలపై ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రజాపాలనకు అఖండ మద్దతు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీని ఆదరించారని మంత్రి అన్నారు. ముఖ్యంగా పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారదర్శక పాలన, అవినీతి రహిత వ్యవస్థ, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన వంటి అంశాలు ఈ విజయానికి ప్రధాన కారణాలని వివరించారు. కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లందరికీ మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పని చేయాలని, ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు పట్టం కట్టారని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గం సమిష్టి కృషి ఫలితమే ఈ ఘన విజయం సాధ్యమైందని అన్నారు. పారదర్శక పాలన, వేగవంతమైన అభివృద్ధి, ప్రజలకు దగ్గరగా ఉన్న ప్రభుత్వం అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే ధోరణి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వల్లే పట్టణ ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారని అన్నారు. పురప్రజలు అందించిన ఆశీర్వాదాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ, వచ్చే మూడు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి, మరింత సంక్షేమం అందించే దిశగా కట్టుబడి పనిచేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యమని, ప్రతి పట్టణం అభివృద్ధి దిశగా దూసుకెళ్లేలా కృషి చేస్తామని తెలిపారు.

# ప్రజా పాలనకు ప్రజలు పట్టం

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నమ్మకం, విశ్వాసం ఉన్నప్పుడు అది ఆదరణగా మారుతుందని ప్రజలు మరోసారి నిరూపించారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అభిమానాన్ని వమ్ము కానివ్వకుండా మరింత బాధ్యతతో, మరింత కట్టుబాటుతో పనిచేస్తామని తెలిపారు.ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ సిఎం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు వంటి కీలక రంగాల్లో సాధికారత లక్ష్యంగా గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అవిశ్రాంతంగా పనిచేస్తోందని, ఈ గెలుపు ఆ కృషికి లభించిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. నిష్కల్మశ నాయకత్వం, పారదర్శక పరిపాలన, సమష్టి కృషే ఈ విజయానికి పునాది అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రిగా నా బాధ్యతలతో పాటు మంత్రివర్గం మొత్తం కలిసికట్టుగా అభివృద్ధి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లిందని ఆయన వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారని, ప్రజలు అభివృద్ధికి మద్దతు ఇచ్చారని, రాష్ట్రం మొత్తం వ్యక్తమైన ఈ ఆదరణ రానున్న మార్పునకు సంకేతమని డిప్యూటీ సిఎం తెలిపారు.

# కార్మికవర్గానికి, కార్మిక సంఘాలకు అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాపితంగా కార్మికులు, కర్షకులు, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రజానీకం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని జరిగిన సార్వత్రిక సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు పాల్గొని, జాతీయ సమ్మె సంపూర్ణంగా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అభినందనలు తెలిపారు. గతంలో కనీవినీ ఎరగని రీతిలో కార్మికులు దిక్కులు పిక్కటిల్లెల నినాదాలు చేస్తూ, భారీ ప్రదర్శనలు, సభలు సమావేశాలు జరిపి, కార్మికులకు బలవంతంగా చట్టబద్ధతలేని నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయటం ఆపి, రద్దు చేయాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను సంపూర్ణంగా వెనకకు తీసుకోవాలని చేసిన నినాదాలు ఢిల్లీలో ఉన్న మోదీకి ఉలిక్కి పడేలా ఈ సమ్మె జరిగిందని ఆయన తెలిపారు. ఈ పోరాటం భవిష్యత్తు పోరాటాలకు నాంది అని, భవిష్యత్తులో మరింత ఉధృతం చేసి నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేసే వరకు పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు, సభలు సమావేశాలు జరిపి, నిరవధిక సమ్మెకు పూనుకొంటామని బాల్‌రాజ్ హెచ్చరించారు.



# బిజెపిని నిరోధించే శక్తి ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్‌కే

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అధికార కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయంగా, ఆ పార్టీని గద్దె దించేందుకు, రాష్ట్రంలో బిజెపిని నిరోధించే శక్తి ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్‌కే ఉన్నదని మున్సిపల్ ఎన్నికల ఫలితాల స్పష్టం చేస్తున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం, స్థానిక నాయకుల మనోభావాలు, స్థానిక పరిస్థితులను ప్రజలు బేరీజు వేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలలో నిర్ణయం తీసుకుంటారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ హంగ్ వచ్చిన ప్రాంతాల్లో ఏం వైఖరి అవలంభించాలనే విషయమై కెసిఆర్‌తో మాట్లాడి, స్థానిక నాయకత్వ మనోభావాలు కూడా పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటామని అన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ లోకల్ బాడీస్ (స్థానిక సంస్థల ఎన్నికలు) అనేది ప్రభుత్వానికి వన్ సైడ్‌గా అంటే అద్భుతమైన పరిపాలన అని, అధికార పార్టీ 80 నుంచి 90 శాతం గెలిస్తేనే గెలిచినట్టు అని, లేకపోతే అదేం గెలుపు అని అన్నారు. పరిపాలనపైన అంత నమ్మకం ఉంటే పార్టీ ఫిరాయించిన 10 మంది ఎంఎల్‌ఎలతో రాజీనామా చేసి ఉప ఎన్నికలకు రావాలని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం

### టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఘన విజయం అందజేసి 'ప్రజా పాలన' ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పురపాలక ఎన్నికల్లో 90కు పైగా మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు, 1300 లకు పైగా వార్డులు, 154కు పైగా డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ మద్దతును స్పష్టంగా వెల్లడించారని అన్నారు. వరుస విజయాలతో కాంగ్రెస్ పార్టీపై రాష్ట్ర అభివృద్ధి బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పారదర్శక పాలన అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు విశ్వాసంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. సామాన్యుల సంక్షేమం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# బిజెపి ఓటు బ్యాంకు 13 శాతం నుంచి 20 శాతానికి పెరిగింది

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో 350కు పైగా వార్డుల్లో బిజెపి విజయం సాధించిందని, దాదాపు 6 మున్సిపాలిటీల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడంతో పాటు బిజెపి ఓటు షేర్ 13 శాతం నుంచి 20 శాతానికి పెరిగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా నిజామాబాద్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్లను బిజెపి కైవసం చేసుకోవడం హర్షనీయమని అన్నారు. గతంలో ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో కూడా బిజెపి ఖాతా తెరిచిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధారణంగా ఫలితాలు అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి, కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ రాలేదనీ, కాంగ్రెస్ చెప్పుకునేంత గొప్ప విజయమేమీ కాదని ఎద్దేవా చేశారు. భారతీయ జనతా పార్టీ ఎదుగుతున్న పార్టీ అని, బిఆర్ఎస్ దిగజారుతున్న పార్టీ అని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతం రావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి, పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు, పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, బిజెపి నాయకులు రామకృష్ణ, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

# రెండేళ్ల ప్రజా పాలనకు ప్రజల ఆమోద ముద్ర

### మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రెండేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనకు ప్రజల ఆమోదముద్ర అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ గెలుపు మాత్రమే కాదని, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ఉన్న తిరుగులేని విశ్వాసానికి నిదర్శనమని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తమ స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీయడమే ఎజెండాగా పెట్టుకున్న శక్తులకు ఈ ప్రజా తీర్పు ఓ చెంప దెబ్బ అని వాఖ్యానించారు. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూనే, మరోవైపు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల చెంతకు చేర్చాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పానికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. ఈ గెలుపు ప్రభుత్వంపై బాధ్యతను మరింత పెంచిందని, ఈ స్ఫూర్తితో తెలంగాణను అన్ని రంగాల్లోనూ ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసి తీరుతామన్నారు. అబద్ధపు ప్రచారాలను నమ్మకుండా, అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలకు మంత్రి శ్రీధర్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.

# సత్తా చాటిన సిపిఐ

### 17 కౌన్సిలర్‌లు, 23 కార్పొరేటర్‌లు గెలుపు
### మొత్తం 40 స్థానాలలో విజయం
### 9 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్‌లలో ప్రాతినిధ్యం
### కొత్తగూడెం మేయర్ స్థానానికి చేరువలో సిపిఐ

ప్రజాపక్షం/హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటింది. తన బలాన్ని మున్సిపాలిటీలలో రెట్టింపునకు పెంచుకుంది. గత ఎన్నికల్లో 20 స్థానాలలో గెలుపొందిన సిపిఐ ఈ సారి 40 చోట్ల విజయదుందుభి మోగించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 17 కౌన్సిలర్‌లు, 23 కార్పొరేటర్‌ల స్థానాలలో సిపిఐ గెలుపొందింది. ఏకంగా 22 డివిజన్‌లో అద్భుత విజయం సాధించి కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ స్థానానికి చేరువవడంతో కమ్యూనిస్టు పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్‌లో 22 డివిజన్‌లు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్‌లో ఒక డివిజన్‌లో సిపిఐ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీలో నాలుగు (ఒకరు ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన సిపిఐ అభ్యర్థి), వైరాలో ఒకటి, మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో నాలుగు, నల్లగొండ జిల్లా చండూరులో ఒకటి, యాద్రాద్రి భువనగిరిలోని యాదగిరిగుట్టలో ఒకటి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఒకటి, కోదాడలో ఒకటి(ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న సిపిఐ అభ్యర్థి), భూపాలపల్లిలో ఒకటి, మహబూబాబాద్‌లో మూడు స్థానాలలో సిపిఐ నెగ్గింది. మొత్తమ్మీద 9 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్‌లు సహా తొమ్మిది జిల్లాల్లో సిపిఐకి ప్రాతినిధ్యం దక్కింది.

**కొత్తగూడెం కార్పొరేషన్‌లో సిపిఐ విజేతలు**

01. పడాల ఆకాంక్ష 11 డివిజన్
02. మండ నాగలక్ష్మి 12 డివిజన్
03. కూరపాటి సుధాకర్ 14 డివిజన్
04. మునిగడప పద్మ 16 డివిజన్
05. ఎర్రబెల్లి శంకర్ 17 డివిజన్
06. కంచర్ల హిమశ్రీ 18 డివిజన్
07. మూడ్ గణేష్ 20 డివిజన్
08. పాలమూరి ధనలక్ష్మి 24 డివిజన్
09. మందల హరిత 27 డివిజన్
10. గుమ్మడెల్లి దర్గయ్య 30 డివిజన్
11.నూనావత్ శ్యామల 31 డివిజన్
12. నామా కీర్తి 35 డివిజన్
13. అడుసుమిల్లి సాయిబాబా 40 డివిజన్
14. వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44 డివిజన్
15. గుర్రం వెంకటేశ్వర్లు 47 డివిజన్
16. బోయిన విజయ్ కుమార్ 49 డివిజన్
17. దాసరి శ్రీనివాస్ 50 డివిజన్
18. బానోత్ కళావతి 52 డివిజన్
19. బండి నర్సింహారావు 53 డివిజన్
20. గడ్డం శాంతి ప్రియ 56 డివిజన్
21. షాహీరా మహ్మద్ 57వ డివిజన్
22. గొర్లె అన్నపూర్ణ 41 డివిజన్

**రామగుండం కార్పొరేషన్‌లో సిపిఐ విజేత**

23. మార్కాపురి సూర్య 41వ డివిజన్

**మున్సిపాలిటీల్లో సిపిఐ విజేతలు**

- దండి రంగారావు(28) – ఏదులాపురం
- దండి శ్రీజ – ఏదులాపురం
- ఎం.శ్రీనాథ్‌రెడ్డి – ఏదులాపురం
- కె.సత్యవతి – ఏదులాపురం
- నల్లమోతు శైలజ (15) – వైరా
- మిట్టపల్లి సరిత శ్రీనివాస్ – క్యాతనపల్లి
- కొడగాని సాంబయ్య – క్యాతనపల్లి
- మద్దెల శంకరయ్య – క్యాతనపల్లి
- మినుగు మణి – క్యాతనపల్లి
- జెల్ల ధనమ్మ – చండూరు
- బబ్బూరి శ్రీధర్ – యాదగిరిగుట్ట
- చెనగాని సైదులు – హుజూర్‌నగర్
- రాయపూరి కాటన్‌రావు – కోదాడ
- బి.అజయ్‌సారథి – మహబూబాబాద్
- రేశపల్లి నవీన్ – మహబూబాబాద్
- నర్ర సంధ్య – మహబూబాబాద్
- వేముల జ్యోతి – భూపాలపల్లి

# రామగుండం కార్పొరేషన్‌లో సిపిఐ అభ్యర్థి సూర్య విజయం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 41వ డివిజన్ సిపిఐ అభ్యర్థి మార్కపురి సూర్య ఘన విజయాన్ని సాధించారు. శుక్రవారం ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థిపై 119 ఓట్ల అధిక్యంతో సూర్య గెలుపొందారు. సూర్యకు 1,043 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 924 ఓట్లు వచ్చాయి. కాగా, సూర్య కార్పొరేటర్‌గా గెలుపొందడం పట్ల రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని సిపిఐ పార్టీ, ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు, ఆయన మద్ధతుదారులు, 41వ డివిజన్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లో సూర్య గెలుపు పట్ల ప్రజలు సంబరాలు జరిపారు.

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
**చీఫ్ ఇంజనీర్ కార్యాలయం**
hmda Growing Global
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT. నెం. HMDA/DEV/CE/49/2025-26 తేదీ: 13.02.2026
'రంగారెడ్డి జిల్లా కుర్మిద్ద క్లస్టర్‌ను ఎకో-టూరిజం డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడం' అనే పని కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఆహ్వానించడమైనది, బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ: 02.03.2026 మధ్యాహ్నం 03:00 గంటల వరకు. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in ని సందర్శించండి
సం/- చీఫ్ ఇంజనీర్, HMDA
DIPR R.O. No. : 15366-PP/CL/ADVT/1/2025-26, Date: 13-02-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్**
NIT No. 39/EE/GHMC/CIR-48/2025-26 తేదీ: 13.02.2026.
టెండర్ నోటీసు ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)
టెండర్లను నం. 39/EE/GHMC/CIR-48/2025-26 (ఐటెమ్ నం. 01) ద్వారా పిలువడమైనది. తేదీ:13.02.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (01) పని కోసం అంచనా వేసిన రూ.15.85 లక్షలతో బిడ్ల అమ్మకం జరుగుతుంది. 16.02.2026న మధ్యాహ్నం 2.00 గంటల నుండి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల అమ్మకం తెరిచి ఉంటుంది. బిడ్ల సమర్పణకు చివరి తేదీ: 23.02.2026 మధ్యాహ్నం 2.00 గంటలకు మరియు బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, SLP జోన్: GHMC
DIPR R.O. No. : 15338-PP/CL/ADVT/1/2025-26, Date: 13-02-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, జీడిమెట్ల సర్కిల్-55**
NIT No. 31/DB/EE/Jeedimetla Circle/GHMC/2025-26 తేదీ: 13.02.2026
పని పేరు: డెస్క్‌టాప్‌ల సేకరణ, అంచనా విలువ: రూ.3.51 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 16.02.2026న మ.1.00గం.లకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 18.02.2026న మ.1.00గం.ల వరకు, టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు, మొబైల్ నంబర్: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 97014143063. హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్ సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జీడిమెట్ల సర్కిల్-55, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15346-PP/CL/ADVT/1/2025-26, Date: 13-02-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 10/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26 తేదీ: 12.02.2026
పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, తార్నాక, డివిజన్-43, వార్డ్-172, బౌద్ధ నగర్‌లో జనవరి 2026 నుండి డిసెంబర్ 2026 వరకు తుఫాను నీటి కాలువలు / నాలాల వార్షిక పూడిక తొలగింపు. (2026 సంవత్సరానికి) (2వ రీకాల్), అంచనా విలువ / ఇసివి: రూ.17.80 లక్షలు, బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 13.02.2026న ఉ.11.00గం.ల నుండి 18.02.2026న ఉ.11.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15313-PP/CL/ADVT/1/2025-26, Date: 13-02-2026

**సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), హెడ్‌క్వార్టర్స్ సర్కిల్,**
**ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004.**
CTN.No..17/T1/DEE/SEHQC/కాంపౌండ్ వాల్/MCR HRD/2025-26, తేదీ:13-02-2026

| | | |
|---|---|---|
| 1) | పని పేరు: - | హైదరాబాద్‌లోని డాక్టర్ MCRHRDIT క్యాంపస్‌లోని VVIP గెస్ట్ హౌస్ కోసం అప్రోచ్ రాంప్ మరియు వెస్ట్ సైడ్ రోడ్ కోసం ఫ్లోరింగ్‌తో పాటు వైర్, కంటైనర్లు, వాచ్ టవర్లు, గేట్లు, ఫర్నిచర్ మరియు భద్రతా నిబంధనలతో కూడిన కాన్సర్టినా కాంపౌండ్ వాల్‌ను అందించడం. ECV: రూ. 9,08,49,601/- (సుమారు) |
| 2) | టెండర్ల స్వీకరణ చివరి తేదీ మరియు సమయం: - | 04-03-2026 నుండి 3.30 P.M వరకు |
| 3) | టెండర్ల ప్రారంభ తేదీ: సాంకేతిక బిడ్: ధర బిడ్: | 04-03-2026 @ 4.00 P.M<br>06-03-2026 @ 2.00 P.M |
| 4) | పేరు మరియు చిరునామా:- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B) | శ్రీ ఐ నరసింగరావు, M.E, సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B), హెడ్‌క్వార్టర్స్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్. ఫోన్: 040-23232762 ఇమెయిల్: serb hqr@yahoo.co.in |

మరిన్ని వివరాలను 18-02-2026 @ 3.00 P.M నుండి https://tender.telangana.gov.in/ లోని 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), హెడ్ క్వార్టర్స్ సర్కిల్, హైదరాబాద్.
DIPR R.O. No. : 15361-PP/CL/ADVT/1/2025-26, Date: 13-02-2026



## సచ్చిదానంద సరస్వతి శివైక్యం పట్ల మంత్రి కొండా సురేఖ సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుని తపోవనం పీఠాధీశ్వరులు, తాండవ కాశీ క్షేత్రం ఆశ్రమ నిర్వాహకులు శ్రీ శ్రీ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం చెందడం తీవ్ర విచారకరమని ఆయన భౌతిక దేహానికి మంత్రి కొండా సురేఖ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.
సనాతన ధర్మ పరిరక్షణ, వేద సంస్కృతి ప్రచారం, ఆధ్యాత్మిక చైతన్య వికాసం కోసం స్వామీజీ జీవితాంతం అహర్నిశలు కృషి చేశారని, ఆయన పరమపదించడం ఆధ్యాత్మిక రంగానికి, భక్తలోకానికి తీరని లోటని అని తెలిపారు.ఈ దుఃఖ సమయంలో వారి శిష్యులకు, భక్తులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

## డాక్టర్ నమ్రతను అరెస్ట్ చేసిన ఇడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. సరోగసీ ముసుగులో భారీగా ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని తేలడంతో డాక్టర్ నమ్రతను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి)అధికారులు అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజులుగా ఆమె ఆర్థిక లావాదేవీలపై నిఘా పెట్టిన అధికారులు కీలక ఆధారాలు సేకరించిన అనంతరం ఆమెను అరెస్టు చేశారు. నాంపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఈ నెల 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలా ఉంటే ఈ కేసు విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సంతానం లేని దంపతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, సరోగసీ పేరిట ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే, అసలైన వైద్య ప్రక్రియలు చేయకుండా, పేద మహిళల నుంచి శిశువులను తక్కువ ధరకు కొనుగోలు చేసి వారిని దంపతులకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో నకిలీ డిఎన్ఎ రిపోర్టులు, ఫోర్జరీ పత్రాలను సృష్టించి కోట్లాది రూపాయల మేర అక్రమంగా ఆర్జించినట్లు ఈడీ అభియోగాలు నమోదు చేసింది. గతేడాది రాజస్థాన్కు చెందిన ఓ దంపతులు తమకు అప్పగించిన శిశువుపై అనుమానంతో డిఎన్ఎ పరీక్ష చేయించడంతో ఈ రాకెట్ గుట్టురట్టయింది. కాగా అక్రమ మార్గాల్లో సంపాదించిన దాదాపు రూ. 25 కోట్ల నిధులను విదేశాల్లో పెట్టుబడులుగా మళ్లించినట్లు ఇడి అనుమానిస్తోంది. ఈ కుంభకోణంలో డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్ కృష్ణతో పాటు ఇప్పటికే పలువురు నిందితులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ భేష్

ఎపి ఎన్నికల కమిషనర్ నీలం సహాని



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహాని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు. హైదరాబాద్‌లోని మసాబ్‌ట్యాంక్ వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (టిజిఎస్ఇసి) కార్యాలయం నుంచి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ధోరణులను వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని మున్సిపల్ ఎన్నికల పోలింగ్, లెక్కింపు ప్రక్రియకు చేపట్టిన విస్తృత ఏర్పాట్లపై వివరించారు. భద్రతా ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు విధానం, పారదర్శకత కోసం చేపట్టిన చర్యలను వెబ్‌కాస్టింగ్ ద్వారా వివరంగా చూపించారు.ఈ కార్యక్రమంలో అదనపు డిజిపి మహేష్ భగవత్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్నన్, రేరా చైర్మన్ డా. ఎన్. సత్యనారాయణ, రిటైర్డ్ జిఎస్ఇసి కార్యదర్శి లింగ్యా నాయక్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన సాంకేతిక,భద్రతా చర్యలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రశంసించినట్లు అధికారులు తెలిపారు.

## సాధారణ ఫిర్యాదుదారిగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన డిసిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖైరతాబాద్ జోన్ డిసిపి కోగంటి శిల్పవల్లి సాధారణ ఫిర్యాదుదారిగా మారి చేసిన ఆకస్మిక తనిఖీతో పోలీస్ సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖైరతాబాద్ డిసిపి శిల్పవల్లి తన అధికార వాహనాన్ని దూరంగా నిలిపి సివిల్ డ్రెస్సులో స్టేషన్‌కు చేరుకున్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన సాధారణ మహిళలా రిసెప్షన్ వద్ద కూర్చొని సిబ్బంది పనితీరు, ప్రజలతో వ్యవహార శైలి, స్పందన తీరు వంటి అంశాలను గంటన్నరపాటు గమనించారు. ఆమెను స్టేషన్ సిబ్బంది ఎవరూ గుర్తించకపోవడం గమనార్హం.తరువాత తన అసలు గుర్తింపును డిసిపి వెల్లడించడంతో వెంటనే స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఎసిపిలను పిలిపించి ప్రజల పట్ల మరింత మర్యాదగా, వేగంగా స్పందించాలని సూచించినట్లు తెలిసింది. స్టేషన్‌లో ఉన్న లోపాలపై కూడా ఆమె పలు సూచనలు చేసినట్లు సమాచారం. డిసిపి ఆకస్మిక తనిఖీతో స్టేషన్ సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా హడలెత్తిపోయినట్లు తెలుస్తోంది. ప్రజలకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ రహస్య తనిఖీ చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.
ఈ ఘటనతో పోలీస్ స్టేషన్లలో ప్రజలతో వ్యవహార శైలిపై మరింత బాధ్యత అవసరమనే సందేశం వెళ్లిందని అధికారులు భావిస్తున్నారు.

# పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే పట్టం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. వరుసగా వచ్చిన అన్ని ఎన్నికల్లోనూ హస్తం హవా పెరుగుతూ వస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి మధ్యలో వచ్చిన ఉప ఎన్నికలు, ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలు, తాజాగా పురపాలక, నగర పాలక ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని ఓటర్లు కాంగ్రెస్‌కు బ్రహ్మ రథం పట్టారు. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడగా, ఇందులో 88 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యత సాధించింది. ప్రతిపక్ష పార్టీలు ఆశించిన స్థాయిలో కనిపించలేదు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఓటర్లు ప్రజా ప్రభుత్వం పాలనకు మొగ్గు చూపారు. 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే 4 చోట్ల కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్నిప్రదర్శించింది. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులే ఎక్కువ డివిజన్లను సాధించారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కూడా మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ 22 సీట్లు గెలుచుకోగా, ఈ కార్పొరేషన్‌లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేసిన సిపిఐ 22 సీట్లతో ఘన విజయం సాధించింది. మిగతా పార్టీలు, ఇండిపెండెంట్లు కలిసి మిగతా స్థానాలు గెలుచుకున్నారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బిజెపి ఆధిక్యంలోకి వచ్చింది. స్వల్ప తేడాతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. ఇటీవల డిసెంబర్‌లో స్థానిక సంస్థల (పంచాయతీలు) ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలోనూ కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధించింది. అంటే రాష్ట్రంలో పల్లెలైనా, పట్టణాలైనా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే జై కొట్టారు. తమ అద్భుతమైన తీర్పుతో ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు, రోజూ మాట్లాడే అబద్ధాలకు చెంప పెట్టులాంటి తీర్పునిచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మున్సిపాలిటీలలో ఇప్పటివరకు వచ్చిన ఫలితాల ప్రకారం 116 మున్సిపాలిటీల్లో 83 కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 16 మున్సిపాలిటీలలో బిఆర్ఎస్, 2 చోట్ల బిజెపి (ఆదిలాబాద్, నారాయణపేట), 2 చోట్ల ఇతర పార్టీలు (భైంసా–ఎంఐఎం, వడ్డేపల్లి–ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్) ఆధిక్యతలో ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, ఖమ్మంలలో ఎన్నికలు జరగలేదు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన దాదాపు 81 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏకంగా 68 నియోజకవర్గాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారు.
రాష్ట్రంలో ఇటీవల 12,702 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, రెబెల్స్ కలిసి 8335 గ్రామ పంచాయతీలు గెలుచుకున్నారు. దాదాపు 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ పార్టీ సాధించింది. అప్పటితో పోలిస్తే మున్సిపల్ ఫలితాల్లో కాంగ్రెస్ గ్రాఫ్ మరింత పెరిగిందని, మున్సిపాలిటీల ఫలితాలను పరిశీలిస్తే చూస్తే ఏకంగా 71.55 శాతం ఫలితాలను ప్రజా ప్రభుత్వం సాధించిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలు జరిగాయి. ఈ రెండు ఉప ఎన్నికలలో అదే తీరుగా ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు. కొద్ది కాలం కింద 94 శాసనసభ నియోజక వర్గాల పరిధిలో పంచాయతీ ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ 87 చోట్ల విజయం సాధించింది. తాజాగా 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మున్సిపాలిటీ ఎన్నికలు జరిగితే 68 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మెజారిటీ సాధించింది. బిఆర్ఎస్, బిజెపి, ఇతర పార్టీలన్నీ కలిసి 13 నియోజకవర్గాల్లో కొంత ప్రభావం చూపించాయి. ఈ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏ పని చేసినా అవినీతి ఆరోపణలు అంటూ వ్యాఖ్యానించిన పార్టీలను పట్టణ ప్రాంత ప్రజలు వారిని ఏమాత్రం విశ్వసించలేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ప్రజా ప్రభుత్వం వైపే నిలిచి కాంగ్రెస్ సర్కారు విశ్వసనీయతను నొక్కి చెప్పారు. ఆఖరికి ఇటీవల జరిగిన సమ్మక్క, సారక్క జాతరను రూ.250 కోట్లతో ప్రగతి పనులు చేపడితే కూడా అందులోనూ అవినీతి అంటూ ప్రతిపక్ష పార్టీలు అనవసర ప్రచారం చేసినా వారి మాటలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదంటున్నారు.
ఇక బిఆర్ఎస్ నేతలు ఈ మున్సిపల్ ఎన్నికలు రెఫరెండం అంటూ వ్యాఖ్యానించారని, అయితే, ఇప్పుడు మున్సిపల్ ప్రజలు, నిన్న పంచాయతీ గ్రామాల ప్రజలు, మొన్న పార్లమెంటులో, ఉప న్నికలలోనూ, అవతలి మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రజా ప్రభుత్వం వైపే అందరూ నిలవడం రేవంత్ సర్కారు విశ్వసనీయతను సర్వత్రా గుర్తించాల్సిన విషయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం చేయడం, ప్రతి పట్టణాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని ప్రకటించడం కాంగ్రెస్ ఓటు బ్యాంకును మరింత పెంచిందని చెప్పవచ్చు.
తెలంగాణ రైజింగ్ కింద ప్రజా ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధికి రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు దాదాపు 17 వేల కోట్లు ఖర్చు చేస్తూ ప్రగతి చేపడుతున్న నేపథ్యంలో అర్బన్ ప్రాంత ప్రజలు కాంగ్రెస్ వైపు పెద్ద ఎత్తున నిలిచారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. 'ఈ రెండేండ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు గ్రామీణ ప్రాంత ప్రజలు, పట్టణ ప్రజానీకం హస్తం పార్టీకి అండగా నిలిచారు. మొత్తంగా రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పెరుగుతున్నది' అని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.
తెలంగాణ రైజింగ్ విజన్ లో భాగంగా ప్రతి పట్టణానికి ఒక మాస్టర్ ప్లాన్ ప్రకటించడం, తానే మున్సిపల్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న సిఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేయడం, 30 లక్షల మంది పేదలకి రేషన్ కార్డులు, నిరుపేదలందరికీ సన్న బియ్యం, పట్టణాల్లో ప్రగతి పనులకు రూ. 17 వేల కోట్లు ఖర్చు చేయడం, ప్రభుత్వ సంక్షేమ సంస్థల్లో చదువుతున్న 7.5 లక్షల మంది విద్యార్థులకు 40 శాతం కాస్మొటిక్ ఛార్జీల పెంపు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ఆర్‌టిసిలో ప్రతి మహిళకు ఉచిత రవాణా, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, పేదవాడికి సొంతింటి కల నేరవేర్చేందుకు ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల పెంపు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు వంటి ప్రగతి పనులను మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రజలు సంపూర్ణంగా ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించారని చెప్పవచ్చు.

## ధర్మపురిలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

మంత్రి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు, ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ లో 15 వార్డులకు గాను15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలిపొందారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఇంతటి ఘన విజయం అందించిన నా ధర్మపురి ప్రజలకు రుణపడి ఉన్నానని పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారం ఉందని విర్రవీగితే ప్రజలు కర్రు కాల్చి వాతపెడతారని అడ్లూరి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పెద్దలు కొందరు అధికారం ఉందని అహంకారంతో వ్యవరిస్తే ధర్మపురి ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని మంత్రి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు ధర్మపురిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ ధర్మపురి అభివృద్ధికి కృషి చేస్తున్నానని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. బల్దియాలోని 15 వార్డులకు గాను 15 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు జయకేతనం ఎగురవేసి క్లీన్ స్వీప్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఓట్ల లెక్కింపు జరపగా 3 రౌండ్ల లెక్కింపులో ఐదేసి వార్డుల చొప్పున లెక్కించిన అధికారులు ఫలితాలను వెల్లడించారు. లెక్కింపు ప్రారంభం నుండి చివరి వరకూ పోటీ అనేది లేకుండా కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం అందుకున్నారు. గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థుల్లో అయ్యోరి వేణుగోపాల్, సంగనబట్ల దినేష్,ఇందారపు రామయ్య, కొమురెల్లి పవన్ కుమార్,వేముల నాగలక్ష్మి, ముదుసుల ప్రశాంత్, వాంకుడొతు విజయ్ బాబు, జింజిరికాని సువర్ణ, వీరవేణి నాగలక్ష్మి, సంగి ఆనంద్, జక్కు పద్మ, చుక్క సంధ్య, చీపిరిశెట్టి రాజేష్,వేముల రమాదేవి, వొజ్జల లక్ష్మణ్ లు ఉన్నారు. విజయం సాధించిన అభ్యర్థులు మంత్రి అడ్లూరి సూచనతో శిభిరంకు తరలివెళ్లారు.

## నయా దోపిడీ..

ఫోన్ పే చేస్తారు..
సక్సెస్ వస్తుంది..
కానీ డబ్బులు జమ కావు..!




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగదు లావాదేవీల్లో ఇటీవల కాలంలో ఏదో ఒక చోట ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సైబర్ ఉచ్చులో పడవద్దని ప్రభుత్వం, పోలీస్ శాఖ అప్రమత్తం చేస్తున్నా, ప్రజలు మోసగాళ్ల మాయలో పడుతూనే ఉన్నారు. తాజాగా రాష్ట్రంలో నయా దోపిడీ షురూ అయ్యింది. డిజిటల్ పేమెంట్ పేరుతో నేరగాళ్ళు అడ్డంగా దోచుకుంటున్నారు. ఇద్దరు వ్యాపారులను ఫోన్ పేలో నగదు బదిలీ పేరుతో ఘూరానా మోసగాళ్ళు లక్ష రూపాయలకు టోకరా వేశారు. హైదరాబాద్‌లోని ఓ మినీ సూపర్ మార్కెట్ దగ్గరకు కారులో వచ్చిని ఇద్దరు వ్యక్తులు వంట సామాగ్రి కొనుగోలు పేరుతో మోసానికి పాల్పడ్డారు. కొత్తగా తాము హోటల్ పెట్టామని హోల్‌సేల్‌లో వంట నూనె కావాలని నమ్మబలికారు. 25 వేల రూపాయలకు వంట నూనె కొనుగోలు చేశారు. క్యాష్ లేదని ఫోన్ పే చేస్తామని చెప్పారు. అయితే తమ ఫోన్‌లో స్కానర్ పనిచేయడం లేదని, ఫోన్‌పే నెంబర్ చెప్పాలని కోరారు. షాపు యజమానురాలు ఇచ్చిన హోల్ సేల్ వ్యాపారి ఫోన్ నెంబర్‌కు 25 వేల రూపాయలు ఫోన్ పే చేశారు. ఫోన్ పే సక్సెస్‌ఫుల్ అని రావడంతో ఫోన్‌లోని రిసిప్ట్ చూపించారు. వ్యాపారంలో నిమగ్నమైన దుకాణంలోని వ్యక్తులు డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయిందా లేదా అని హోల్ సేల్ వ్యాపారిని సంప్రదించలేదు. తీరా మరుసటి రోజు హోల్‌సేల్ వ్యాపారి సూపర్‌మార్కెట్ దగ్గరకు వచ్చి వంట నూనె తాలూకా డబ్బులు ఇవ్వమని చెప్పడంతో తాము మోసపోయామని దుకాణదారులు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ కిరాణా షాపు యజమానిని ఇదే విధంగా మోసం చేసి 21 వేల రూపాయలతో ఉడాయించారు. ఇదే విధంగా ఓ వ్యాపారిని మోసగాళ్ళు మోసం చేశారు. కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఫోన్ ద్వారా నగదు బదిలీ చేస్తాం, క్యాష్ కావాలంటూ నగదు లావాదేవీల వ్యాపారం చేసే వ్యాపారిని అడిగి ఫోన్‌పేలో 70 వేలు నగదు బదిలీ చేశారు. ఫోన్ పేలో నగదు ట్రాన్స్‌ఫర్ సక్సెస్ అయినట్టు రావడంతో తన ఎకౌంట్‌ను వ్యాపారి చెక్ చేసుకున్నాడు. 70 వేలు క్రెడిట్ అయినట్టు చూపించడంతో నగదు ఇచ్చేశాడు. అరగంట తర్వాత ఆ ఇద్దరు ఫోన్ చేసి రాంగ్ ఎకౌంట్‌కు నగదు బదిలీ అయిందని చెప్పారని, అలా చెప్పిన కొద్దిసేపటికే తన ఎకౌంట్ ఫ్రీజ్ అయిపోయిందని, ఇలా ఎందుకు అయిందో అర్థంకాక చివరకు తాను మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశానని, మోసపోయిన బాధితుడు తెలిపారు. కారులో దర్జాగా తిరుగుతూ ఫోన్ పే నగదు లావాదేవీల పేరుతో వ్యాపారులను మోసం చేస్తున్న ముఠా వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మోసపోయిన పలువురు వ్యాపారులు చెప్పిన ఆనవాళ్ళ మేరకు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. నగదు లావాదేవీల విషయంలో వ్యాపారులు, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు కోరుతున్నారు.

## 23న ఢిల్లీలో ఒసిల ధర్నాకు ఏర్పాట్లు పూర్తి

వేలాదిగా తరలిరావాలని పోలాడి పిలుపు



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** ఒసిల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల 23న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ఒసిల మహాధర్నాకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఒసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు తెలిపారు. ఒసి జెఎసి ఆధ్వర్యాన జాతీయస్థాయిలో జరిగే ఈ మహాధర్నాకు రాష్ట్రంలోని ఒసిలు వేలాదిగా తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లలేమితో ఒకవైపు సంక్షేమ పథకాలు అందక, మరోవైపు రాజకీయ పదవులు పొందక వెనుకబడిపోతున్నారన్నారు. జనరల్ స్థానాల్లో సైతం ఒసిలకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వకపోవడంతో రాజకీయంగా ఎదగటంలేదన్నారు. హన్మకొండ జిల్లా పరకాల మున్సిపాల్టీలో 16 డివిజన్లు జనరల్ క్యాటగిరీకి రిజర్వు కాగా, 12 చోట్ల ఒసిలు పోటీ చేయలేకపోయారన్నారు. జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేసి, పటిష్టంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నేతృత్వంలో ఏర్పడే ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీకి తమ మద్దతు ఎలప్పుడూ ఉంటుందని రామారావు స్పష్టంచేశారు.

## బిసిల ఉసురు తగిలే మాధవరెడ్డి ఓటమి

బిసి ద్రోహిని ఓడించిన కేశవాపూర్ ప్రజలకు అభినందనలు: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలలో మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేశవాపూర్ వార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన బిసి రిజర్వేషన్ల వ్యతిరేకి బుట్టంగారి మాధవరెడ్డి, బిసిల ఉసురుతగిలి ఓటమి పాలయ్యారని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో అన్నారు. నోటికాడ ముద్దను గుంజుకుని, బిసిలు తినే కంచంలో మన్ను పోసిన బిసి ద్రోహి మాధవరెడ్డిని ఓటు ఆయుధంతో ఓడించాలని తాము ఇచ్చిన పిలుపును గౌరవించి కేశవపూర్ ప్రజలందరూ ఒక్కటై తగిన శాస్తి చేశారని, ఇందుకు తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసి ప్రజల తరపున కేశవాపూర్ ప్రజలకు అభినందనలు తెలియజేశారు. బిసి రిజర్వేషన్ల వ్యతిరేకిని చేరదీసి గులాబీ కండువ కప్పి, బీ ఫామ్ చేతిలో పెట్టిన బిఆర్ఎస్ పార్టీ, మాధవరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించిన చామకూర మల్లారెడ్డి తక్షణమే బిసి సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసి సమాజం ముందు బిఆర్ఎస్‌ను, మల్లారెడ్డిని దోషి గా నిలబెడతామన్నారు. న్యాయమైన, ధర్మమైన బిసి రిజర్వేషన్ల పెంపును భవిష్యత్తులో దయచేసి ఎవరు అడ్డుకోవద్దని, ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే మెజార్టీగా ఉన్న బిసిలు కచ్చితంగా వాళ్లని బిసి ద్రోహులుగా ప్రకటించి మాధవ రెడ్డినీ ఏ విధంగా ఓడించామో అదే విధంగా రిజర్వేషన్ వ్యతిరేకుల కూడా రాజకీయంగా భూస్థాపితం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**ప్రజాపక్షం/హసన్ పర్తి :** బాల్యవివాహాలుచట్టరీత్యా నేరమని తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్ అన్నారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలో తహసీల్దార్ పూజారి కిరణ్ కుమార్ శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్‌జిఒ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహనకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే మాతృ మరణాలతోపాటు శిశు మరణాలు సంభవిస్తాయని, బాలికల పు ట్టిన తేదీలను మార్చి వివాహాలు చేస్తే సమాచారం అందించాలని గ్రామాల్లో నూతనంగా ఎంపికైన సర్పంచులు బాల్యవివాహాలు జరగకుండా చూసుకో వాలని, బాల్య వివాహలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమలో ఎంపిడిఒ సుమనవాణి, ఎం పి ఒ కర్ణాకర్ రెడ్డి, ఎంఇఅ శ్రీనివాస్,ఎస్ ఐ పి .గోవర్ధన్, షేర్ ఎన్ జి ఒ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ టి.శిరీష, జమున, జ్ఞానేశ్వరి, జగన్,చామంతి, గాయత్రి పాల్గొన్నారు.

## పులి సంచారం పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ సౌజన్య



**ప్రజాపక్షం/బెజ్జంకి:** కోహెడ మండల శివారు ప్రాంతాల్లో పులి ఉన్నట్లు అధికారులు గుర్తించారని అంతే కాకుండా మండల శివారు గ్రామాల ప్రాంతాల్లోకి పులి (పెద్దపులి) సంచరించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం ఎస్ఐ బి.సౌజన్య తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రేగుపలల్లి, గుండారం, నర్సింహులపల్లి, పోతారం, గుగ్గిళ్ళ, తిమ్మాయిపల్లి, గాగిళ్లాపూర్ సమీప గ్రామాలైన ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం లేకున్నా గుట్టల ప్రాంతాలకు అడవులకు పొదలకు ఒంటరిగా వెళ్ళకూడదని, చిన్న పిల్లను, పశువులను బయట వదిలివేయరాదని ఏవైనా అనుమానస్పద కదలికలు గమనించిన వెంటనే తక్షనమే పోలీసులకు లేదా అటవి శాఖ అధికారులకు సమాచారం అందించాని తెలిపారు.

## పురి రాజీనామా చేయాలి




పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ఎంపిలు నిరసన

**న్యూఢిల్లీ:** అమెరికాలో విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి బయటకు రావడంపై కాంగ్రెస్ మండిపడింది. ఆయన తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. శుక్రవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ఎంపిలు నిరసన తెలిపారు. పార్లమెంట్ భవనం వెలుపల అనేక మంది కాంగ్రెస్ ఎంపిలు బారులు తీరి పురిపై నినాదాలు చేస్తూ, ఆయన సమాధానం చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. పూరి, జెఫ్రీ ఎప్‌స్టీన్ చిత్రాలతో కూడిన పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తనపై అనుమానం వ్యక్తం చేసినందుకు పూరి బుధవారం రాహుల్‌పై తీవ్రంగా విమర్శలు చేశారు. తాను 'కొన్ని సందర్భాలలో ఎప్‌స్టీన్‌ను కలిశానని, కానీ అమెరికన్ లైంగిక నేరస్థుడు పాల్పడిన నేరాలతో సంబంధం లేదని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి

**బెంగళూరు :** పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ఏడుగురు మృతిచెందిన ఘటన బెంగళూరు సమీపంలోని హోస్కోట్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం హోస్కోట్ నుంచి దేవనహళ్లి వెళ్తున్న ఎస్‌యువి కారు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టింది. ఎం.సత్యవర గ్రామం దగ్గర హోస్కోట్–దబాస్‌పేట్ హైవేపై ప్రమాదం జరిగిందని, ప్రమాదంలో ఎస్‌యువి కారులోని ఆరుగురితోపాటు బైక్ పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు బెంగళూరులోని కొతనూర్ కు చెందిన వారిగా గుర్తించామన్నారు. మృతదేహాలు పోస్ట్ మార్టం కోసం హోస్కోట్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పార్లమెంట్ సమావేశాలు వాయిదా

మళ్లీ మార్చి 9న ప్రారంభం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి భాగం శుక్రవారంతో ముగిసింది. మూడు వారాల విరామం తర్వాత మళ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 9న ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 1వ తేదీన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం బడ్జెట్‌పై రాజ్యసభ, లోక్‌సభలో వాడీవేడీగా చర్చలు జరిగాయి. భారత్ – యుఎస్ ట్రేడ్ డీల్, ప్రచురితం కాని ఆర్మీ మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించడం వంటి విషయాలు సభలను కుదిపేశాయి. ఈ బడ్జెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి సమావేశమవుతాయి. మూడు వారాల విరామం తర్వాత స్టాండింగ్ కమిటీలు కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చిన వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు కేటాయింపులను పరిశీలించడానికి వీలు కల్పిస్తుంది. కాగా, శుక్రవారం ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు కేంద్ర మంత్రి హర్దీప్ పూరి రాజీనామా చేయాలని నినాదాలు చేయడంతో సభ గంటసేపు వాయిదా పడింది. భారత్–అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కూడా ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. జనవరి 28న ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో బడ్జెట్ సమావేశాల తొలి భాగం ప్రారంభమైంది. 2020 నాటి భారత్–చైనా సంఘర్షణకు సంబంధించి నరవణే జ్ఞాపకాల పుస్తకంలోని అంశాలను ఉటంకించడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీనికి స్పీకర్ నిరాకరించిన తర్వాత ఫిబ్రవరి 2 మధ్యాహ్నం నుండి లోక్‌సభలో నాటకీయ దృశ్యాలు కనిపించాయి. పదే పదే వాయిదా పడింది. ఆ తరువాత రోజుల్లో కూడా సభలో గర్జన నిరసనలు, నాటకీయ దృశ్యాలు కనిపించాయి. విపక్ష సభ్యులు అధికారుల బల్లలపైకి ఎక్కడం, స్పీకర్‌పై చిరిగిన కాగితాలను విసిరేయడం వంటి వికృత ప్రవర్తనకు సంబంధించి ఏడుగురు కాంగ్రెస్, ఒక సిపిఐ(ఐఎం) సభ్యుడిని బడ్జెట్ సెషన్‌లోని మిగిలిన భాగం వరకు సభ నుండి సస్పెండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సమాధానం ఇవ్వాల్సిన సమయంలో లోక్‌సభకు హాజరు కావద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభ్యర్థించారు. దీంతో ప్రధాని లోక్‌సభలో సమాధానం ఇవ్వకుండా రాజ్యసభలో సమాధానమిచ్చారు. స్పీకర్ చర్యపై తీవ్రంగా మండిపడిన ప్రతిపక్ష ఎంపిలు బిర్లాను స్పీకర్‌గా తొలగించే తీర్మానాన్ని ప్రతిపాదించాలని ప్రతిపక్షం నోటీసును కూడా సమర్పించింది. నైతిక కారణాల రీత్యా బిర్లా తన తొలగింపుకు సంబంధించిన సమస్య పరిష్కారమయ్యే వరకు సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహించకూడదని నిర్ణయించుకున్నారు. మార్చి 9 నుండి ప్రారంభమయ్యే సెషన్ యొక్క రెండవ భాగంలో బిర్లాను స్పీకర్ పదవి నుండి తొలగించాలని కోరుతూ తీర్మానం సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ పై చర్చకు ముందు సభలో మాట్లాడాలని రాహుల్‌గాంధీ పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో తరచుగా వాయిదాలు పడ్డాయి. తర్వాత, కేంద్ర బడ్జెట్ పై చర్చలో పాల్గొన్న గాంధీ, అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తున్నప్పుడు భారతదేశ ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించా రు. ఎల్‌ఓపి చేసిన ఆరోపణలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొడుతూ, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) వద్ద దేశాన్ని అమ్మివేసింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఇక బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2న ముగుస్తాయి. రాజ్యసభ శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే గంటపాటు జీరో అవర్ చేపట్టారు.

భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై

## ఉద్యమం ప్రారంభించాలి

- రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని కాపాడుకోవాలి
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు
- రైతు సంఘాల నాయకులతో భేటీ



**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకించడం, రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని కాపాడటానికి దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని లోక్‌సభలో ప్రతిపక్షత నేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. శుక్రవారం పార్లమెంటు భవనం ఆవరణలో దేశవ్యాప్తంగా ఉన్న రైతు సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై వ్యతిరేకతను వ్యక్తం చేశారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, గింజల రైతుల జీవనోపాధి పట్ల తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారని కాంగ్రెస్ తెలిపింది. ఈ వాణిజ్య ఒప్పందం వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరిచిందని, త్వరలోనే అనేక ఇతర పంటలు కూడా దేశంలోకి వస్తాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించడానికి, రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని కాపాడటానికి పెద్ద ఎత్తున జాతీయ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం గురించి వ్యవసాయ నాయకులు, రాహుల్ గాంధీ చర్చించారని కాంగ్రెస్ తెలిపింది. రాహుల్‌ను కలిసిన వ్యవసాయ నాయకులలో ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ చీఫ్ సుఖ్‌పాల్ ఎస్ ఖైరా, హర్యానాలోని భారతీయే కిసాన్ మజ్దోర్ యూనియన్‌కు చెందిన అశోక్ బల్హారా, బికెయు క్రాంతికారికి చెందిన బల్దేవ్ ఎస్ జిరా, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఫ్రంట్‌కు చెందిన ఆర్. నందకుమార్, బికెయు షహీద్ భగత్ సింగ్‌కు చెందిన అమర్‌జిత్ ఎస్ మోహ్రీ, కిసాన్ మజ్దూర్ మోర్చా ఇండియాకు చెందిన గురమ్‌నీత్ ఎస్ మంగత్, జెకె జమీదారా ఫోరమ్‌కు చెందిన హమీద్ మాలిక్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వం తనపై కేసులు లేదా హక్కుల ఉల్లంఘన తీర్మానం దాఖలు చేయవచ్చు కానీ తాను రైతుల పక్షాన నిలబడతానని రాహుల్‌గాంధీ గురువారం స్పష్టం చేసిన మరుసటి రోజున ఈ సమావేశం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతు వ్యతిరేకి అని, భారతదేశం–అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ద్వారా దేశాన్ని అమ్మేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఎక్స్‌లో ఒక వీడియో ప్రకటనను చేశారు. అందులో భారతత్–అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు.

## 'సేవాతీర్థ్' ప్రారంభించిన ప్రధాని మోదీ

స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా కొత్త భవనంలోకి పిఎంఒ



**న్యూఢిల్లీ:** దేశ పరిపాలన కార్యక్రమాలకు కేంద్రంగా మారనున్న 'సేవాతీర్థ్' భవన సముదాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీంతో పాటు పలు కీలక మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కర్తవ్య భవన్ 1, 2లను ప్రధాని మోదీ అధికారికంగా ప్రారంభించారు. ఈ సముదాయంలో పిఎంఒ కార్యాలయం సహా క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం పనిచేయనున్నాయి. సేవాతీర్థ భవనంపై పౌరులందరూ దేవుడితో సమానమనే అర్థ వచ్చేలా నాగరికో దేవభవ వాఖ్యాన్ని చెక్కారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహల్ లాల్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మహిళలు, యువత కోసం తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేశారు. ముఖ్యంగా లక్‌పతి దీదీ పథకంలో లబ్ధిదారుల సంఖ్యను ఆరు కోట్లకు పెంచడమే లక్ష్యంగా పిఎం రహత్ పథకంపై సంతకం చేశారు. దీంతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయల నిధిని రూ. 2లక్షల కోట్లకు పెంచే ఫైల్‌పై కూడా సంతకం చేశారు. కాగా, ఇప్పటి వరకూ కీలక నిర్ణయాలకు వేదికగా ఉన్న సౌత్‌బ్లాక్ నుంచి ప్రధాని కార్యాలయం సేవాతీర్థ్‌కు మారింది. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇతర కార్యాలయాలను ఇక్కడికి మార్చారు. కాగా, స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా పిఎంఒ కార్యాలయం కొత్త భవనంలోకి మారడం విశేషం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రూ.100 ప్రత్యేక నాణెన్ని ప్రధానమంత్రి మోదీ విడుదల చేశారు. 2014లో ప్రధాని మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వలసవాద చిహ్నాలను తొలగింపునకు చర్యలు తీసుకుంటుందని అధికారులు వెల్లడించారు.

**వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్ల తొలగింపు**

ఇప్పటికే ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పిఎంఒ) సేవాతీర్థ్‌గా మార్చింది. అటు రాజ్‌భవన్ పేరుతో కొనసాగుతోన్న గవర్నర్ల అధికారిక నివాసాలను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం ప్రభుత్వం సూచించింది. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల గవర్నర్లు తమ బంగ్లాలను లోక్‌భవన్‌గా మార్చారు. వలసవాదానికి చిహ్నాలుగా ఉన్న పేర్లను తొలగించి ప్రజాస్వామ్య పంథాలో పేర్లను పెడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. అంతకుముందు రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు విస్తరించిన రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మార్చింది. మొదటగా బ్రిటిష్ పాలనలో రాజ్‌పథ్‌ను కింగ్స్‌వే అని పిలిచేవారు. రేస్ కోర్స్ రోడ్‌ను కూడా లోక్‌కల్యాణ్ మార్గ్‌గా మార్చారు. అయితే, వలసవాద ఆలోచన తీరును ప్రతిబింబించే గుర్తులను చెరిపివేయాల్సిన అవసరం ఉందని ప్రధాని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

## సమ్మె సమర్థనీయమే

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

**తిరువనంతపురం:** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన అఖిల భారత సమ్మె సందర్భంగా వ్యాపార వర్గాల ఆందోళనల మధ్య రాష్ట్రంలో సమ్మెలు కొనసాగుతాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో శుక్రవారం జరిగిన చర్చల సందర్భంగా ఒక వ్యాపారవేత్త కేరళలో దేశవ్యాప్తంగా స్తంభించిపోతున్న సమ్మె గురించి లేవనెత్తిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా, సిఎం సమాధానమిచ్చారు. గురువారం నాటి సమ్మె ఇంకా కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలు అన్ని కార్మికులపై ప్రతికూల పభావితం చూపుతాయన్నారు. అందుకే అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, అలాంటి సమ్మెలో కేరళ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు. కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ తరహాలో రాష్ట్రంలోని ఇతర మూడు విమానాశ్రయాలను కార్బన్ న్యూట్రల్‌గా మార్చాలని మరో వ్యాపారవేత్త చేసిన సూచనను కూడా పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. విమానాశ్రయ రంగంలో సిఐఎల్ దేశంలో మొట్టమొదటి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య నమూనా అని, ఇది పెద్ద విజయాన్ని సాధించిందని విజయన్ అన్నారు. 'ఇప్పుడు అన్ని పెట్టుబడిదారులు తమ డబ్బును డివిడెండ్ల ద్వారా తిరిగి పొందుతున్నారు. అది కొనసాగుతోంది. మేము మీ సూచనను కూడా పరిగణనలోకి తీసుకుంటాము' అని ఆయన అన్నారు. ముందుగా తీవ్ర పేదరిక నిర్మూలన, దేశంలో వ్యాపార సౌలభ్య సూచికలలో కేరళ అగ్రస్థానంలో ఉండటంతో గత దశాబ్దంలో తన ప్రభుత్వం పూర్తి చేసిన అనేక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను పేర్కొన్నారు.

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు

## బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు



**న్యూఢిల్లీ :** బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టిని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్‌లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండి పోయేలా హత్య జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు. 'రణ్‌వీర్ సింగ్.. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లెయింట్ చేసినట్టున్నావు. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు.. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు..? వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైమ్ ఉంది. హత్యలు మొదలయ్యేలోపే మేలుకో' అంటూ దుండగుడు తన ఆడియో సందేశంలో బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని అన్నాడు.

## ఎవరైనా డబ్బు ఇస్తే తీసుకోండి...

ఓటు మాత్రం మాకే వేయండి: టివికె చీఫ్ విజయ్



**సేలం:** టివికె పార్టీ అధినేత విజయ్ మరోసారి అధికార పార్టీ డిఎంకెపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సేలంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలోని టివికె పార్టీనే ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డిఎంకె ప్రభుత్వం పూర్తిగా అదుపు తప్పిందని ఆరోపించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విజయ్ మండిపడ్డారు. డిజిపి నియామకం కూడా సరిగా చేయలేని పరిస్థితి ఉందని విమర్శించారు.

**ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న స్టాలిన్!**

ఐదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రజలను మీ కలలు చెప్పండని అడగడం ఏమిటని డిఎంకెపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సానిటరీ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది సహా అనేక వర్గాలు నిరసనలు చేస్తున్నప్పుడు ప్రభుత్వం ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎలా చెబుతుందని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టివికె పార్టీ 100 శాతం స్వచ్ఛమైన శక్తి అని, అధికారంలోకి వచ్చి మంచి పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. అధికార యంత్రాంగం సహకారంతో పారదర్శక పాలన అందిస్తానని స్పష్టం చేశారు. 'మాకు దోచుకునే అనుభవం లేదు' అంటూ ప్రత్యర్థుల విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. డిఎంకె, ఎఐఎడిఎంకె లాంటి పార్టీలు మిత్రపక్షాలపై ఆధారపడుతున్నాయని, కానీ టివికె ప్రజల బలం మీదే ముందుకు సాగుతుందని తెలిపారు. తాము ఎవరిపైనా వ్యక్తిగత విద్వేషం పెట్టుకోమని, ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ఓటర్లను ఉద్దేశించి మాట్లాడిన విజయ్, 'ఎవరైనా డబ్బు ఇస్తే తీసుకోండి, అది మీదే, కానీ ఓటు మాత్రం టివికె గుర్తు విజిల్‌కే వేయండి' అంటూ పిలుపునిచ్చారు. ఇకపై తమిళనాడులో డబ్బుకు ఓట్లు కొనడం జరగదని ధీమా వ్యక్తం చేశారు. 'ఫ్యాన్స్, ప్రజల కోసం రాజకీయాల్లోకి రావడం తప్పేనా?' అని ప్రశ్నించిన ఆయన, తనపై వచ్చే విమర్శలను తిప్పికొట్టారు. తమిళనాడు తన తల్లి భూమి, ఎనిమిది కోట్ల ప్రజలు తన కుటుంబమని భావోద్వేగంగా పేర్కొన్నారు. సేలం సభతో టివికె శక్తి ప్రజలకు తెలిసిందని, త్వరలోనే అధికార మార్పు ఖాయమని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

**విజయ్ ర్యాలీలో వ్యక్తి మృతి**

సినీ నటుడు, టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ చేపట్టిన ర్యాలీలో మరోసారి విషాదం నెలకొంది. సెలంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఓ యువకుడు మరణించాడు. ర్యాలీకి వచ్చిన సూరజ్ అనే యువకుడు విజయ్ మాట్లాడుతున్న క్రమంలో స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో వెంటనే స్పందించిన కార్యకర్తలు అతడిని హుటాహుటిన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకువెళ్లి పరీక్షించగా అతడు గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహారాష్ట్రకు చెందిన సూరజ్ ఉపాధి నిమిత్తం అతడు కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా సేలానికి వచ్చాడు. కొంత కాలంగా అతడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు వివరించారు.

## ఏనుగుల దాడి, ఆరుగురు మృతి

**రాంచీ:** జార్ఖండ్ లో అడవి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. అడవి ఏనుగుల దాడిలో ఆరుగురు మృతిచెందారు. శుక్రవారం హజారీబాగ్ జిల్లాలో ఏనుగుల దాడిలో ఆరుగురు మృతిచెందారని, మృతుల్లో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారున్నారని అటవీశాఖ అధికారులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఏనుగుల గుంపు పలువురిపై దాడి చేసిందని, గురువారం రాత్రి చుర్చు బ్లాక్ గోండ్వర్ గ్రామంలోకి ప్రవేశించి ఆరుగురిని తొక్కి చంపాయని తెలిపారు. ఏనుగుల దాడిలో ఓ చిన్నారికి తీవగాయాలయ్యాయని, చికిత్స కోసం హజారీబాగ్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

అర్హులైన 1.31 కోట్ల మంది మహిళా లబ్ధిదారులకు

## ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున జమ

తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ప్రకటన

ఈ చర్య ఓటమి భయంతోనే అని ప్రతిపక్షాలు ఎద్దేవా



**చెన్నై :** తమ ప్రభుత్వం ప్రభుత్వ మహిళా హక్కు పథకం కింద రూ.1.31 కోట్ల మంది మహిళా లబ్ధిదారులకు ఒక్కో మహిళకు రూ.5,000 చొప్పున డిపాజిట్ చేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం ప్రకటించారు. కాగా ప్రతిపక్ష పార్టీలు ఆయన చర్యను 'ఓటమి భయం'గా అభివర్ణించాయి. అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తన ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) పార్టీకి ఓటేసి అధికారంలోకి తీసుకువస్తే నెలవారీ గ్రాంటును రెట్టింపుచేసి రూ. 2,000కు పెంచుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కలైంజర్ మహిళా అర్హత పథకం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.5,000 నేరుగా జమ అయ్యాయని పేర్కొంటూ 'ఈ రోజు ఉదయం మీకు రూ.5,000 మీరు అందుకోబోతున్నారు. రాబోయే ఎన్నికలను ప్రస్తావిస్తూ ఈ పథకాన్ని స్తంభింపజేయడానికి (స్వార్థ ప్రయోజనాల ద్వారా) జరుగుతున్న ప్రయత్నాన్ని దృష్టిలో ఉంచుకుని నేను ఈ మొత్తాన్ని అందించాలని నిర్ణయించుకున్నాను' అని ఆయన నొక్కిచెప్పారు. అయితే మహిళలకు ఆ మొత్తాన్ని అందకుండా నిరోధించే చర్యను ఎదుర్కోడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఫిబ్రవరి నుంచి ఆ మొత్తాన్ని మూడు నెలల పాటు అందించాలని, దానికి తోడు వేసవిలో వారి ఖర్చులను తీర్చడానికి రూ.2,000 ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నానని సిఎం స్టాలిన్ చెప్పారు. ఆయన ఈ మెస్సేజ్‌కు సంబంధించి ఒక వీడియోను తన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఇంకా, ఈ ఏడాది డిఎంకె అధికారంలోకి వచ్చిన అనంతరం నెలవారీ రూ.1,000అర్హతను రూ.2,000కు పెరుగుతుందని స్టాలిన్ తన వీడియో మెస్సేజ్‌లో తెలిపారు. మీ పిల్లల విద్యావసరాలకు. అవసరమైనటువంటి మందులు, ఇతర నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని వివేకంతో ఉపయోగించుకోవాలని నేను సోదరీమణులకు విజ్ఞప్తి చేస్తున్నాను అని డిఎంకె పార్టీ అధ్యక్షుడుగా కూడా ఉన్నటువంటి స్టాలిన్ చెప్పారు. తన పార్టీ తప్పనిసరిగా అధికారంలోకి వస్తుందన్న ధీమాను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యక్తం చేశారు. '2021లో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు (గతంలో ఎఐడిఎంకె పాలన వదిలిపెట్టిన మహమ్మారి, ఆర్థిక సంక్షోభం సహా) ప్రభుత్వం అనేకు సవాళ్లను ఎదుర్కొన్నదని స్టాలిన్ చెప్పారు. మీ జీవనోపాధిని కాపాడటానికి మేం రూ.4,000 తిరిగి చెల్లించాం. ఆ సవాళ్లను అధిగమించిన తర్వాత అనేక పథకాలను అమలు చేశాం' అని స్టాలిన్ తన వీడియో సందేశంలో తెలిపారు. ఇది సాధ్యం కాదనే విమర్శలు ఉన్నప్పటికీ ప్రభుత్వం సెప్టెంబర్ 2023 నుండి రూ.1,000 కలైంజర్ మహిళా అర్హత పథకాన్ని విజయవంతంగా అమలుచేసింది. ప్రారంభంలో 1.13 కోట్లమంది మహిళలకు, అనంతరం నేడు 1.31కోట్లమంది లబ్ధిదారులతో కుటుంబ రేషన్ కార్డులతో కూడిన అనేక మంది రేషన్‌కార్డు హోల్డర్లుగా ఉన్న మహిళా పెద్దలను చేర్చడానికి విస్తరించింది. ఈ చొరవను వారి హక్కుల మొత్తాన్ని సమాజానికి మహిళలు చేసిన సహకారాన్ని గుర్తిస్తుంది అని ముఖ్యమంత్రి స్టాలిన్ వివరించారు. ఈ మొత్తాన్ని మహిళలు తమ రోజువారీ గృహ ఖర్చులు, వైద్య ఖర్చులు, పిల్లల కుటుంబ విద్య ఖర్చులను తీర్చడానికి వీలు కల్పించిందన్నారు. ఈ పథకాన్ని ప్రజాదరణ పొందిన రాష్ట్రాలు కూడా అమలు చేయడం ప్రారంభించాయన్నారు. దీనిపై స్పందించిన శాసనసభలో ప్రతిపక్షనాయకుడు ఎడప్పడి కె.పళనిస్వామి ఈ ప్రకటన ముఖ్యమంత్రి ఓటమి భయాన్ని ప్రతిబింబిస్తుందని విమర్శించారు.

## రాహుల్‌పై తీర్మానాన్ని ప్రవేశపెట్టం

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రిపై అసభ్యకరమైన పదజాలం ఉపయోగించినందుకు లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడు రాహుల్ గాంధీపై తీర్మానం తీసుకురావాలనే ప్రణాళికను ప్రభుత్వం పక్కన పెట్టిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ అంశంపై గురువారం బిజెపి ఎంపి దూబే రాహుల్‌పై 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. అయితే శుక్రవారం రిజిజు మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని హౌస్ ప్రివిలేజ్ కమిటీ, ఎథిక్స్ కమిటీకి పంపాలా లేదా నేరుగా లోక్‌సభకు తీసుకురావాలా అనే దానిపై స్పీకర్‌తో సంప్రదిస్తామని చెప్పారు. ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఒక ప్రైవేట్ సభ్యుడు ఇప్పటికే ఈ తీర్మానం కోసం నోటీసు సమర్పించినందున, ప్రభుత్వం తన సొంత తీర్మానాన్ని ప్రవేశపెట్టకుండా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బిజెపి ఎంపి నిషికాంత్ దూబే గురువారం పిటిఐతో మాట్లాడుతూ, రాహుల్‌గాంధీపై 'సబ్‌స్టాంటివ్ మోషన్' ప్రారంభించాలని నోటీసు ఇచ్చానని, ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.

## నీరు 'రాజకీయ సరిహద్దులను గుర్తించదు'

కర్ణాటక సిఎం సిద్ధరామయ్య

'డ్యామ్ సేఫ్టీ-2026' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో కీలక ప్రసంగం



**బెంగళూరు:**నీరు 'రాజకీయ సరిహద్దులను గుర్తించదు' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. నీటి పాలనలో సహకా సమాఖ్యవాదాన్ని అవసరాన్ని ఇది నొక్కిచెబుతుందని ఆయన నొక్కిచెప్పారు. ఆయన శుక్రవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో జరుగనున్న డ్యామ్ సేఫ్టీ2026 రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. అనంతరం సిద్ధరామయ్య ప్రసంగిస్తూ ఆనకట్టల (డ్యామ్స్) అత్యవసర , క్రమబద్ధమైన భద్రతా మూల్యాంకనం, ఆధునికీకరణ, ఆనకట్టల ప్రమాద సమాచార ఆపరేషన్ అవసరాన్ని నొక్కిచెబుతూ వాటిలో దాదాపు 70శాతం 25సంవత్సరాల కంటే పాతవేనన్నారు. డ్యామ్ భద్రత అనేది ఒక శాఖ బాధ్యత కాదని, సమన్వయంతో కూడిన సంస్థాగత చర్య అవసరమయేయ ఉమ్మడి జాతీయ బాధ్యత అన్నారు. భారతదేశంలో 6,628 నిర్దేశిత ఆనకట్టలు ఉన్నాయన్నారు. ఇది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆనకట్ట యాజమాన్య దేశంగా నిలిచిందని, 231 నిర్దేశిత ఆనకట్టలతో కర్ణాటక దేశంలో ఆరవ స్థానంలో ఉందని చెప్పారు. 'ఆనకట్టలు సమష్టి ఆకాంక్షలకు ప్రతిరూపాలు' అని అభివర్ణించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వాటిని 'ఆధునిక భారతదేశ దేవాలయాలు'అని పిలిచారని గుర్తుచేశారు. వ్యవసాయ శ్రేయస్సు, పారిశ్రామిక పురోగతిలో డ్యామ్‌ల పాత్రను నెహ్రూ నొక్కిచెప్పారని సిద్ధరామయ్య తెలియజేశారు. ఆనకట్టలు డిజిటల్‌గా నిర్వహించబడుతున్నందున సైబర్ భద్రత, సాంకేతిక విధ్వంసం నుంచి రక్షణ, జాతీయ మౌలిక సదుపాయాల సైబర్ భద్రత ప్రధాన అంశాలుగా పరిగణించాలని సిద్ధరామయ్య సూచించారు. ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మా ట్లాడుతూ అత్యంత కీలక సమయంలో ఈ సదస్సు జరుగుతోందన్నారు. ఆనకట్ట భద్రత జాతీయ ప్రాధాన్యతగా మారిందని, 2012లో ప్రపంచబ్యాంక్ సహాయంతో భారత ప్రభుత్వం ప్రారంభించిన ఆనకట్ట పునరావాసం, అభివృద్ధి కార్యక్రమానికి కేంద్రరాష్ట్ర భాగస్వామ్యం బలమైన ఉదాహరణ అని తెలియజేశారు. కేంద్ర జల్‌శక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి, ప్రపంచ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ జోహన్నెస్ జుట్ ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

# బంగ్లాదేశీయులకు జేజేలు

భారత్ ఈశాన్య పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో క్లిష్ట సమయంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ దేశ ఓటర్లు తమ ప్రజాస్వామిక సాంప్రదాయాలను పరిరక్షించుకుంటూ ఎంతో విజ్ఞతతో 'బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి)' కి ఘనవిజయం చేకూర్చినందున వారు అభినందనలకు పాత్రులు. మత చాందసవాదంవైపు దేశ గమనాన్ని మార్చటానికి మితవాద, మతతత్వ శక్తులు చేసిన ప్రయత్నాన్ని ఓటర్లు తిరస్కరించటం స్వాగతించదగింది. పార్లమెంటులోని 300 స్థానాలకుగాను 299కి జరిగిన ఎన్నికల్లో బిఎన్‌పికి 201 స్థానాల్లో విజయం చేకూర్చారు. పాకిస్థానీ అనుకూల మతతత్వ పార్టీ జమాత్–ఎ–ఇస్లామీ నాయకత్వంలోని 11పార్టీల అలయెన్స్‌ను 76 స్థానాలకు పరిమితం చేశారు. ప్రధానమైన పాలకపార్టీగా ఉండిన అవామీలీగ్‌ను తాత్కాలిక యూనుస్ ప్రభుత్వం నిషేధించినందున బిఎన్‌పి–జమాత్ కూటముల మధ్యనే ద్విముఖ పోటీ జరిగింది. 2024 ఆగస్టులో షేక్ హసీనా వాజెద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున తిరుగుబాటు ఆందోళన నిర్వహించిన జన్–జడ్ యువ నాయకత్వం నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి) పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసినప్పటికీ, వారు దారీతెన్నులేని స్థితిలో జమాత్‌తో పొత్తుపెట్టుకుని 30సీట్లకు పోటీ చేశారు. గెలిచిన దాఖలాలు కనిపించలేదు. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువత హతాశులై ఉంటారు. మాట ప్రకారం ఎన్నికలు నిర్వహించిన తాత్కాలిక ప్రభుత్వ నేత(ముఖ్య సలహాదారు) నోబెల్ బహుమతి గ్రహీత ముహమ్మద్ యూనుస్ కూడా అభినందనలకు పాత్రుడు. జాగు లేకుండా వారంరోజులలోపే ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వానికి అధికారం బదిలీ చేస్తారని భావించబడుతున్నది.

బిఎన్‌పి అగ్ర నాయకుడు తారిఖ్ రెహ్మాన్ ప్రధానమంత్రిగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు. 35 సంవత్సరాల తదుపరి కానున్న పురుష ప్రధానమంత్రి ఈయనే. బేగంల (షేక్ హసీనా–అవామీ లీగ్), ఖలీదా జియా – బిఎన్‌పి) పాలనాశకం ముగిసింది. బిఎన్‌పి వ్యవస్థాపకులు, దేశ పూర్వాధ్యక్షుడు జియా ఉర్ రెహ్మాన్ (1981లో హత్యకు గురైనాడు), మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా (ఇటీవల మరణించారు) కుమారుడే ఈ తారిఖ్ రెహ్మాన్. హసీనా ప్రభుత్వం నుంచి వేధింపులు, జైలు శిక్షలు తప్పించుకునేందుకై అతడు 2008 సెప్టెంబర్‌లో లండన్ వెళ్లిపోయి, ప్రవాస జీవితం నుంచి కొద్దినెలల క్రితమే స్వదేశం తిరిగివచ్చారు. తల్లి మరణంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేబట్టారు. సంక్షోభ పరిస్థితిలో ఉన్న దేశ ప్రజలు ఆయన పార్టీకి పట్టం గట్టారు. దేశం నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అరాచకం వంటి తీవ్రమైన పరిస్థితులతో సవాళ్లు విసురుతున్నది. మరోవైపు చైనా, అమెరికా, భారత్‌లతో చాకచక్యంగా వ్యవహరిస్తూ తమ దేశ ఆర్థిక వ్యవస్థను సరైన మార్గంలో పెట్టాల్సి ఉంది. పరిపాలనా అనుభవం లేని రెహ్మాన్‌కు ఇది పరీక్షా సమయం. అయితే జీవితమే పాఠాలు నేర్పుతుందన్నట్లు అనుభవమే నడిపిస్తుంది. కావలసింది ప్రజాస్వామ్య బద్ధమైన లౌకిక దృక్పథం. అందుకుగాను తీవ్రవాద భావాలను అదుపు చేయాలి. దేశ సాంప్రదాయాలను ఆకళింపు చేసుకుని ప్రతీకార కాంక్షను దరిచేరనీయకూడదు. మతం, భాష, జాతీయతలతో నిమిత్తం లేకుండా లౌకిక వ్యవస్థను పరిరక్షించాలి. ప్రజాస్వామిక దేశాలు దాన్నే అభిలషిస్తాయి. బిఎన్‌పి లోగడ అధికారంలో ఉన్న కాలంలో (2001–2006) జమాత్ ఆ పార్టీకి కీలకమైన భాగస్వామిగా ఉండింది. బిఎన్‌పి భారత్‌ను సంశయాత్మకంగా చూస్తుండేది. మనదేశం ఆదినుండీ అవామీ లీగ్‌కు అండగా ఉండటమే అందుకు ముఖ్య కారణం. 2004 విద్యార్థి తిరుగుబాటు తర్వాత షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందటాన్ని బంగ్లా మతవాద శక్తులు భారత్ వ్యతిరేక మనోభావాలు రెచ్చగొట్టటానికి ఉపయోగించుకున్నారు. ఇప్పుడు అదే జమాతే ఇస్లామీ ప్రధాన ప్రతిపక్షంగా ఉండి భారత్ వ్యతిరేక వాదాలతో బిఎన్‌పికి అడ్డుకట్టవేసే ప్రయత్నాలు చేస్తుంది. అయితే ఇంత పెద్ద పొరుగు ప్రజాస్వామ్య దేశాన్ని బంగ్లా ప్రభుత్వం దూరం పెట్టజాలదు. అందువల్ల రెండు దేశాల వైపునుంచీ సుహృద్భావ సంబంధాల అభివృద్ధికి సున్నితంగా కృషి జరగాలి.

ప్రధాని నరేంద్రమోదీ తారిఖ్ రెహ్మాన్‌కు ముందుగా అభినందనల సందేశం పంపుతూ ప్రజాస్వామిక, ప్రగతిశీల, సమ్మిళిత బంగ్లాదేశ్‌కు అండగా నిలబడటాన్ని భారత్ కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. అందుకు బదులుగా, కొత్త ప్రభుత్వం కింద రెండు దేశాల మధ్య సంబంధాలు పటిష్టమవుతాయని బిఎన్‌పి ఆశాభావం వ్యక్తం చేసింది. రెండు ప్రజాస్వామిక దేశాలు సుహృద్భావ చర్చల ద్వారా స్నేహ, సహకార సంబంధాలను వృద్ధి చేసుకుంటూ మంచి ఇరుగుపొరుగు దేశాలుగా మెలగటమే ఉభయులకూ ప్రయోజనదాయకం. ●



## క్రమంగా తగ్గుతున్నాయి

**పంట వ్యర్థాలను తగులబెట్టే సంఘటనలు క్రమంగా తగ్గుతున్నాయి. ఢిల్లీ ఎన్‌సిఆర్ ప్రాంతంలో కేవలం పంట వ్యర్థాలను తగులబెట్టడం మాత్రమే కాలుష్యానికి కారణం కాదు. కాలుష్యానికి పారిశ్రామిక యూనిట్లు, వాహనాలు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. పంటలను ఆశించే కీటకాల నాశనం, పోషకాలు, సేంద్రియ కార్బన్ కోల్పోవడం, నేల సారవంతం క్షీణించడం వీటిలో ఉన్నాయి. అందుకే ప్రభుత్వం క్రాప్ రెసిడ్యూ మేనేజ్‌మెంట్ (సిఆర్‌ఎం) పథకం ప్రవేశపెట్టింది. అత్యంత నాణ్యతతో కూడిన విత్తనాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తోంది.**

- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



## పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయా !

ప్రపంచవ్యాప్తంగా ఒక శాతం శిశువులు, మొత్తంగా మిలియన్ల కొద్ది పిల్లలు, ఇండియాలో కనీసం 2 లక్షల శిశువులు 'పుట్టుకతోనే గుండె లోపాల'తో జన్మించడంతో వారి నిండు నూరేళ్ల జీవితం ప్రశ్నార్థకంగా మారడం, ఆ రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు నరకయాతనను అనుభవించడం చూస్తున్నాం. జన్మతః గుండె లోపాలతో పుట్టిన పిల్లల్లో 20 శాతం వరకు తీవ్రమైన హృదయ అనారోగ్యాలతో జీవిస్తూ, అకాలమరణాల బారిన కూడా పడడం జరుగుతున్నది. పుట్టుకతో గుండె లోపాలతో జన్మించిన పిల్లలకు గుండె పనితీరులో ఇబ్బందులు, రక్త ప్రసరణ లోపాలు, శారీర అభివృద్ధి మందగించడం, దీర్ఘకాలిక గుండె అనారోగ్యాలు, స్ట్రోక్స్, గుండె ఫెయిల్యూర్ లాంటి అనారోగ్యాలు కలుగుతున్నాయి.

**అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం:**

పుట్టుకతో వచ్చే గుండె లోపాల గూర్చి పూర్తి అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 14 ఫిబ్రవరిన అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం (ఇంటర్నేషనల్ కాన్‌జెనిటల్ హార్ట్ డిఫెక్ట్స్ అవేర్‌నెస్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాతీయ పుట్టుకతో వచ్చే గుండె లోపాల అవగాహన దినం ఇతివృత్తంగా గుండె బలోపేతం : ప్రారంభ దశలో గుర్తింపు, సకాలంలో వైద్యం, జీవితకాల చేయూత అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. పుట్టుకతో వచ్చే గుండె లోపాలు రావడానికి కారణాలుగా జన్యుపరమైన అంశాలు, పర్యావరణ కాలుష్యానికి దీర్ఘకాలం గురికావడం, తల్లి అనారోగ్యం లేదా పోషకాహార లోపాలు, గర్భవతులు ప్రత్యేక ఔషధాలను వాడడంతో శిశువుపై దాని ప్రతికూల ప్రభావం పడడం లాంటివి గుర్తించారు.

పుట్టుకతో వచ్చే గుండె లోపాలను నివారించడానికి ఆస్కారం తక్కువగా ఉన్నందున తొలి దశలోనే గుర్తించి, తగు వైద్య సూచనలు పాటించడంతో వారి జీవితకాలం పొడిగించబడడంతో పాటు ఆరోగ్యంగా గడిపే సదవకాశం ఉంటుంది. ఇలాంటి ప్రమాదక లోపాల పట్ల లోతైన పరిశోధనలు, తరుచుగా వైద్య సలహాలు, తొలి దశలో గుర్తించడం, సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోవడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగులతో పాటు వారి కుటుంబాలను ఆదుకోవడం, వ్యాప్తిని తగ్గించడం లాంటివి పాటించడం ఉత్తమం అని నిపుణులు సూచిస్తున్నారు.

***(14 ఫిబ్రవరి అంతర్జాతీయ పుట్టుకతోనే వచ్చే గుండె లోపాల అవగాహన దినం సందర్భంగా)***

# 'వందే మాతరం'తో రాజకీయం!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్తకొత్త అంశాలను, వివాదాలను తెరపైకి తీసుకురావడం ఆనవాయితీగా మారింది. 'వందే మాతరం' గీతాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దురదృష్టకరం. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం ముందు జాతీయ గానం వందే మాతరంలోని ఆరు చరణాలనూ తప్పనిసరిగా ఆలపించాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది. లౌకికవాదులు ఇందులోని ఆంతర్యాన్ని ప్రశ్నిస్తుంటే, మైనారిటీలు తమ మనోభావాలపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడిగా భావిస్తున్నారు. ప్రముఖ ముస్లిం సంస్థ 'జమైత్ ఉల్మా–ఇ–హింద్' ప్రకారం, ఈ నిర్ణయం ఏకపక్ష, అన్యాయమైన చర్య. ఇది రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి. ముస్లింలు ఎవరికైనా వందే మాతరం పాడటం లేదా వినిపించడాన్ని విరోధించరు. అయితే ఆ గీతంలోని కొన్ని చరణాలు భూమిని దేవతగా చిత్రీకరించే భావజాలాన్ని ప్రతిబింబిస్తాయని, ఏకదైవ సిద్ధాంతాన్ని అనుసరించే మతాల మౌలిక నమ్మకాలతో ఇది విరుద్ధమని వారు వాదిస్తున్నారు. ఒకే దేవుడిని ఆరాధించే వ్యక్తిని ఈ గీతాన్ని పాడమని బలవంత పరచడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆ సంస్థ వాదన. ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలలు, కళాశాలలు సహా అన్ని అధికారిక వేదికలలో ఆరు చరణాలను తప్పనిసరిగా పాడాలని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశం మైనారిటీల రాజ్యాంగ హక్కులను పరిమితం చేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. దేశభక్తి పేరుతో ఈ గీతాన్ని పౌరులపై రుద్దడం సరైన విధానం కాదని, ఇది రాజకీయ లక్ష్యాల సాధనకు సంబంధించిన చర్యగా భావించవచ్చన్నది ఆ సంస్థ సూచన. దేశప్రేమ నినాదాల్లో కాకుండా వ్యక్తిత్వం, త్యాగం, నైతిక విలువల్లో ప్రతిఫలించాలి అని కూడా అభిప్రాయ పడింది. ముస్లింలు సహా, మైనారిటీల కోణంలో చూస్తే, ఇటువంటి నిర్ణయాలు దేశంలోని శాంతి, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను బలహీనపరచే ప్రమాదం ఉంది. రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వ నిర్ణయాలు సమన్వితంగా, సమగ్రంగా ఉండాలి. ఇదిలావుంటే, ఈ వివాదానికి కారణమైన కేంద్ర ఆదేశం ప్రకారం, వందే మాతరం గీతాన్ని జాతీయ గీతం జనగణమనతో కలిపి ఆలపించే సందర్భాల్లో ముందుగా వందే మాతరం పాడాలి. జనవరి 28 తేదీన జారీ చేసినట్టు పేర్కొంటు న్న మార్గదర్శకాలలో, సుమారు 3 నిమిషాలు 10 సెకన్ల వ్యవధి కలిగిన ఆరు చరణాలను అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్రపతి రాక, జాతీయ పతాక ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లో పాడాలి. జాతీయ గీతం లేదా జాతీయ గానం ఆలపించే సమయంలో సభలో ఉన్నవారు అప్రమత్త స్థితిలో నిలబడాలి. అయితే వార్తాచిత్రం లేదా డాక్యుమెంటరీలో భాగంగా జాతీయ గానం వినిపించినప్పుడు ప్రేక్షకు లు నిలబడాల్సిన అవసరం లేదని, అలా చేయడం ప్రదర్శనకు అంతరాయం కలిగించే అవకాశం ఉందని వివరణ కూడా అందులో ఉంది. పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు జాతీయ గానం వినిపించడం ద్వారా ప్రారంభించాలని కూడా ఆదేశించారు. వందే మాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ నిర్ణయం దేశంలో మత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులు, దేశభక్తి భావనల మధ్య సమతుల్యతపై విస్తృతమైన చర్చకు దారితీసింది. ఇలావుంటే, నరేంద్ర మోదీ పాలనా విధానాలకు, కేంద్రం ఏ దిశగా దేశాన్ని తీసుకొని వెళుతున్నదనడానికి ఈ ఉత్తర్వు తాజా ఉదాహరణ. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు ఇచ్చేవారు ఇది జాతీ య గర్వానికి, నాగరికతా పరంపర కొనసాగింపుకు ఇది నిదర్శనమని అంటున్నారు. విమర్శకులు మాత్రం, అత్యవసరమైన నిర్మాణాత్మక సమస్యలను పక్కనబెట్టి ప్రదర్శనాత్మక చర్యలకే ప్రాధాన్యం ఇచ్చే ధోరణికి ఇది మరో నిదర్శనంగా చూస్తున్నారు. ఈ వివాదం ప్రభుత్వ రాజకీయ విధానాల విస్తృత నమూనాను ప్రతిబింబిస్తున్నది. నినాదాలు, దృశ్యమాన చర్యలపై అధిక ఆధారం వంటి భావోద్వేగాలకు గురిచేసే ప్రతీకలతో కేంద్రం ఆటలాడుతున్నది. ఇలాంటి నిర్ణయాలు సమాజ విచ్ఛిన్నానికీ, అవాంఛనీయమైన జాతి, మత విద్వేషాలకు కారణమవుతాయి. రాజ్యాంగాన్ని అనుసరించి, ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వాలు అనుసరించే విధానాలు ఏ ఒక్క వర్గానికో పరిమితం కాకూడదు. స్వాతంత్ర్య పోరాటం నుంచి రాజ్యాంగ రూపకల్పన వరకూ, ప్రతీకాత్మక చర్యలు సామూహిక చైతన్యాన్ని సమీకరించడాని కి కూడా ఇదే కారణం. అయితే, పాలకులు అనుసరించే విధానాలు లేదా తెరపైకి తెస్తున్న ప్రతీకలు దేశాన్ని ఐక్యంగా ఉంచకుండా, వివిధ ప్రాంతాలు, వర్గాలుగా చీలిపోయే ప్రమాదాన్ని సృష్టిస్తే పరిస్థితి ఏమిటనేది ప్రశ్న. ఇప్పుడు ఆ ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. దేశ భక్తి వ్యక్తీకరణకూ, వందే మాతరం పఠనానికి ముడిపెట్టి, కేంద్రం వినోదం చూస్తున్నది. వందే మాతరం గీతాన్ని పఠించకపోతే దేశ ద్రోహి అని ముద్ర వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు స్పష్టమవుతున్నది. ఇలాంటి చర్యలు రాజ్యాంగంలో నిక్షిప్తమైన సమ్మిళితతత్వాన్ని, విశాల స్ఫూర్తిని సంకుచితం చేసే ప్రమాదం ఉందన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఈ ఆదేశాన్ని, ఇటీవలి కాలంలో ప్రభుత్వం చేపడుతున్న అనేక ప్రదర్శనాత్మక చర్యల శ్రేణికి కొనసాగింపుగానే చూడాలి. కొవిడ్ మహమ్మారి ఉధృతంగా ఉన్నప్పుడు, ముందువరుసలో పనిచేసే సిబ్బందికి సంఘీభావంగా ప్రజలను తాళాలు మోగించమని పిలిచారు. ఆ చర్య దృశ్యపరంగా ఐక్యతను, తాత్కాలిక ఉత్సాహాన్ని సృష్టించింది గానీ, సంక్రమణ గమనాన్ని మార్చలేకపోయింది. ప్రజారోగ్య మౌలిక సదుపాయాల్లోని లోపాలను భర్తీ చేయలేకపోయింది. దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించే పరిపాలన సామర్థ్యాన్ని అది చూపించినా, ప్రతీకాత్మక ఐక్యతను విధాన సిద్ధతతో సమానంగా చూడటం సరైందా అన్న ప్రశ్నలను కూడా లేవనెత్తింది.

అదే విధంగా, దీర్ఘకాలంగా కొనసాగుతున్న పథకాల పేర్ల మార్పు కూడా ఈ పాలన రాజకీయ పదజాలంలో పునరావృత లక్షణంగా మారింది. దేశంలోని ముఖ్యమైన సామాజిక భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) అధికారిక సమాచారంలో మార్పులు.. 'విబి జి రామ్ జి' వంటి ప్రతిపాదనలు. వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ కొత్త బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మాట్లాడిన తీరు, భావోద్వేగాన్ని రెచ్చగొట్టేదిగానూ, తద్వారా ప్రజలను ఆకట్టుకునేందుకు జరిగిన ప్రయత్నంగానూ స్పష్టమవుతుంది. వివరమైన ఆర్థిక నిర్మాణం, అమలు సూచికలకన్నా, గుర్తింపు, గర్వం, మార్పు దృష్టికోణమే కేంద్రంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వానికి ఈ విధానం కొత్తకాదు.. ఇది ఒక నిరంతర ప్రవాహం. ఈ తరహా నినాదాలు.. నమూనాలు.. నిర్ణయాలు ఇప్పటి వరకూ ఎన్నో వచ్చాయి. వస్తునే ఉన్నాయి. ప్రజల మనోభావాలతో ఆటలాడుతూ, ఒక వర్గాన్ని దోషిగా నిలబట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేయని ప్రయ త్నం లేదు. అనుసరించని మార్గం లేదు. చివరికి 'వందే మాతరం' సైతం మోదీ సర్కారుకు ఒక ఆయుధంగా మారింది. ఉత్తర్వులను అనుసరించి ఈ గీతాన్ని ఆలపించకపోతే, దేశ ద్రోహిగా నిర్ధారించి, శిక్షించి హింసించే మార్గం సుగమమైందన్న ప్రతిపక్ష పార్టీల ఆందోళనను ఇక్కడ ప్రస్తావించుకోవాలి. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి వ్యాఖ్యలు రాజకీయ వాదనలో స్థిరాంశాలయ్యాయి. ఇవి వ్యూహాత్మక ప్రయోజనం కోసం ఎంపిక చేసుకున్న పదాలన్నది స్పష్టం. సంక్లిష్ట విధాన లక్ష్యాలను సులభంగా గుర్తుంచుకునే రూపాల్లో కి మార్చి, భాషా–ప్రాంతీయ సరిహద్దులను దాటిస్తాయి. ఇలాంటి రాజకీయ బ్రాండింగ్ భారత్‌కే ప్రత్యేకం కాదు. కానీ ఉపాధి, ఆరోగ్యం, విద్య, గ్రామీణ ఆదాయాల్లో కొలిచే మెరుగుదలలు లేకపోతే, ఈ నినాదాల సారంపై సందేహం పెరుగుతుంది. పేర్లు.. విధానాలు.. నమూనాలనేవి పరస్పర వైరుధ్యాలు కావన్నది ప్రభుత్వాన్ని సమర్థించే వారి వాదన. స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుద్ధ్య విస్తరణ, ప్రత్యక్ష లబ్ధి బదిలీలు, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి చర్యలను వారు ఉదాహరణలుగా చూపుతారు. ఈ దృష్టిలో, శక్తివంతమైన ప్రతీక లు రాజకీయ మూలధనాన్ని సృష్టించి సంస్కరణలకు మార్గం వేస్తాయి. జాతి యావత్తు గర్వించేలా విస్తృత ప్రయోజనాల కోసం ప్రజలను ఉత్తేజ పరిచే నినాదాలు.. స్ఫూర్తిదాయకంగా నిలిచే వివిధ ప్రతీకలే దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాయన్న మాటలు మభ్యపెట్టడానికి తప్ప వాస్తవంగా లక్ష్యాలను చేర్చలేవు. 'వందే మాతరం' పఠనం దేశభక్తి ఆచారాన్ని పెంపొందించవచ్చు గానీ, నిర్మాణాత్మక నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, పెరుగుతున్న అసమానతలను పరిష్కరించదు. గ్రామీణ ఉపాధి పథకాల న్యాయబద్ధత హామీ జీతాలు, సకాలంలో నిధుల విడుదలపై ఆధారపడి ఉంటుందే తప్ప, వాక్యాల మార్పుపై కాదు. కేటాయింపులు డిమాండ్‌కు తక్కువగా ఉన్నప్పుడు లేదా చెల్లింపులు ఆలస్యమైనప్పుడు, పేరు మార్పు లబ్ధిదారులకు ఉపశమనమివ్వదు. ఇక్కడ సంస్థాగత సమతుల్యంపై కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. భావోద్వేగ సమీకరణపై ఆధారపడిన పాలన అధికార కేంద్రీకరణకు, విధానాల ఏకపక్ష నిర్ణయాలకు దారి తీస్తుంది. ప్రతీకాత్మక చర్యలతో బలపడే నిర్ణాయక నాయకత్వ ప్రతిఛాయ రాజకీయ కథనాలను పుష్టిపరుస్తుంది. అయితే బలమైన ప్రజాస్వామ్యానికి విధాన పారదర్శకత, పార్లమెంటరీ పర్యవేక్షణ, ఆధారాలపై ఆధారపడిన ప్రణాళిక కూడా అంతే అవసరం. ఆ దిశగా చర్యలు తీసుకోకుండా, ప్రజలను ఏమార్చడానికి ప్రతీకాత్మక ప్రకటనలు చేయడం ఒక దుర్మార్గ సంస్కృతికి నిదర్శనం. భావోద్వేగాలు తీవ్రమైనప్పుడు, సమస్యల గురించి ప్రజలు మరచిపోతారన్నది ప్రభుత్వ అభిప్రాయం కావచ్చు. ప్రతిపక్ష నేతల అభిప్రాయాల ప్రకారం, ప్రతీకాత్మక ప్రకటనలు పతాక శీర్షికలను ఆక్రమించినప్పుడు, కీలక అంశాలపై ప్రజల దృష్టి ఉండదు. ఈ పరిస్థితి ఎన్నికల ప్రయోజనాన్ని చేకూర్చవచ్చు. కొన్ని సందర్భాల్లో భావోద్రేకాలతో ప్రజలు ఓట్లువేసే అవకాశాలు లేకపోలేదు. మరో విధంగా చెప్పాలంటే, పార్టీ పనితీరుకంటే, జాతీయత, దేశభక్తి వంటి పడికట్టు పదాలే అధిక ప్రభావం చూపుతాయి. విభిన్నత కలిగిన సమాజంలో, పంచుకున్న వారసత్వానికి పిలుపులు సమీకరణ శక్తిగా పనిచేస్తాయి. ఈ క్రమంలో వందే మాతరం పఠన ఆదేశం, దేశ విధుల్లో సాంస్కృతిక గుర్తులను నాటాలన్న వ్యూహంలో భాగంగా కనిపిస్తుంది. ఇది సామాజిక ఐక్యతను బలపరుస్తుందా? లేక ధ్రువీకరణను పెంచుతుందా? అన్నది వారివారి అవగాహనపై ఆధారపడి ఉంటుంది. కొందరికి దేశభక్తి గీతాలు సామూహిక స్మృతిని, గర్వాన్ని రేకెత్తిస్తాయి. మరి కొందరికి అది బలవంతంగానూ, స్వచ్ఛందతను క్షీణింపచేసే ఆదేశంగానూ కనిపిస్తుంది. రాజ్యాంగ సున్నితత్వాన్ని ప్రజ్వలింప చేస్తుంది. ఆర్థిక పరిపాలనలో ప్రదర్శన... నిర్మాణాల మధ్య ఉన్న ఉద్రిక్తత స్పష్టంగా కనిపిస్తుంది. అలాంటి సమయాల్లో భావోద్వేగ ఉద్దేశిత ప్రకటనలు వేగవంతమైన ఫలితాలపై అంచనాలను పెంచుతాయి. అమలు అసమానంగా ఉన్నప్పుడు ప్రజా నమ్మకం దెబ్బతింటుంది. ప్రకటించిన ఆకాంక్ష–పరిపాలనా సామర్థ్యం మధ్య ఏర్పడే అఘాతం బలహీన వర్గాలను ప్రభావితం చేసే రంగాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. సామాజిక సంక్షేమ పథకాలకు సూక్ష్మ లక్ష్య నిర్ధారణ, పారదర్శక కొనుగో లు, నిరంతర నిధులు అత్యవసరం. ప్రతీకాత్మక పునఃవ్యాఖ్యానం మీడియా దృష్టిని ఆకర్షించవచ్చుగానీ, అధికార యంత్రాంగంలోని అడ్డంకులను తొలగించదు. తప్పనిసరి పఠనంపై చర్చ, నాయకత్వ స్వరూపం, పాలనను కొలిచే ప్రమాణాలపై లోతైన ప్రశ్నలను ప్రతిబింబిస్తుంది. ఆకర్షణీయ రాజకీయాలు ఎప్పుడూ అసమానతలను పెంచే విధానాలు, నిర్ణయాలు, ప్రకటనలు, నినాదాలపై ఆధారపడతాయి. కానీ, వీటివల్ల సమస్యలు తీరవు. ప్రజల జీవితాలు బాగుపడవు.

సమర్థవంతమైన పాలనకు బలమైన సంస్థల నిర్మాణం, క్రమం తప్పని సంస్కరణల అమలు అత్యవసరం. కేవలం మాటలు ఒకవైపు... నిర్మాణాత్మక చర్యలు మరోవైపు ఉంటాయి. ఆకర్షణీయమైన మాటలు.. భావోద్వేగాలను రెచ్చగొట్టే నినాదాలు, ప్రసంగాలు, వందే మాతరం పఠనం వంటి నిర్ణయాలు తాత్కాలికంగా పైచేయి సాధించవచ్చు. ప్రజల దృష్టిని ఆకట్టుకోవచ్చు. కానీ, వాటి డొల్లతనం ఎంతోకాలం దాగదు. ఎన్నికల్లో ఓట్లు సంపాదించడానికి జిమ్మిక్కులు చేయడంలో బిజెపిని మించిన పార్టీ లేదు. కానీ, క్రమంగా ప్రజలు వాస్తవాన్ని తెలుసుకుంటున్నారు. ఈ విషయం, వివిధ స్థాయిల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపికి తగ్గుతున్న ఓట్ల శాతం స్పష్టం చేస్తునే ఉంది. ఎన్నికల తీర్పులు ఎప్పటికైనా ఆర్థిక పనితీరు, సంక్షేమ అమలు, నిజాయితీ భావనలపై కూడా ఆధారపడి ఉంటాయన్న వాస్తవాన్ని కేంద్రంలోని బిజెపి సర్కారు ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది. ప్రతీకాత్మక చర్యలు భావోద్వేగాలను రేకెత్తించవచ్చేమో గానీ, దీర్ఘకాల రాజకీయ న్యాయ బద్ధత చివరికి ప్రజల జీవన అనుభవాలపైనే ఆధారపడి ఉంటుంది. ఉపాధి, ఆరోగ్యం, విద్యకు ప్రాప్యత మాత్రమే ప్రజల తీర్పును అత్యంత లోతుగా ఆకర్షిస్తాయి. అది అనివార్యం. ఇదే చరిత్ర చెప్పిన పాఠం.

## లేఖ

# బడి గంటను మింగేస్తున్న రియల్ ఎస్టేట్!



నేటి ఆధునిక భారతదేశంలో అభివృద్ధి అనే పదానికి అర్థం పూర్తిగా మారిపోయింది. ఆకాశహర్మ్యాలు, మెరిసే తారు రోడ్లు, రంగు రంగుల వెంచర్లు ఉంటేనే అభివృద్ధి అని పాలకులు భ్రమ పడుతున్నారు. కానీ ఈ కాంక్రీట్ వనాల మధ్య జాతి భవిష్యత్తును నిర్మించే 'అక్షరం' మాత్రం అనాథగా మారుతోంది. ఒకవైపు దేశం ప్రపంచ స్థాయికి వెళ్తుందని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు, మరోవైపు సామాన్యుడికి అందాల్సిన కనీస విద్యా హక్కును కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. గల్లీకి ఒక గుడి, వెంచర్‌కు ఒక పార్కు వెలుస్తున్నాయి కానీ, వందలాది కుటుంబాలు నివసించే చోట ఒక ప్రభుత్వ బడి జాడ లేకపోవడం ఈ ప్రజాస్వామ్య వ్యవస్థకే పట్టిన గ్రహణం. ప్రభుత్వాలకు ఆధ్యాత్మికత మీద ఉన్న శ్రద్ధ అక్షరం మీద లేకపోవడం ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. ఆధ్యాత్మికత అనేది మనిషి అంతర్గత శాంతి కోసం ఉండాలి, కానీ అది విద్యా హక్కును మింగేసే స్థాయికి చేరకూడదు. నేడు వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గుళ్ళు, గోపురాల నిర్మాణానికి, వాటి పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్న పాలకులు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పట్టించుకోవడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ ఒక పాఠశాలను నిర్మిస్తే అది తరతరాల అజ్ఞానాన్ని రూపుమాపి, దేశాభివృద్ధికి బలమైన బాటలు వేస్తుంది. గోపురాలు ఎత్తుగా పెరుగుతున్నా, పేదవాడి చదువు పాతాళానికి పడిపోతోంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారం నేడు ఒక మాఫియాలా విస్తరిస్తోంది. అపార్ట్‌మెంట్లు, భారీ వెంచర్లు వెలుస్తున్నప్పుడు ప్రభుత్వం సులభంగా లేఅవుట్ అనుమతు లు ఇస్తోంది. ఆ నిబంధనల ప్రకారం ఓపెన్ స్పేస్‌లో పార్కులు ఉండాలి, సామాజిక భవనాలు ఉండాలి. కానీ, ఎక్కడైనా ఒక ప్రభుత్వ పాఠశాల కోసం స్థలాన్ని కేటాయించాలనే నిబంధనను ప్రభుత్వం గట్టిగా అమలు చేయడం లేదు. జనాభా లెక్కల ప్రకారం ప్రతి రెండు వేల మందికి ఒక ప్రభుత్వ పాఠశాల ఉండాలనే చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది. వందల ఎకరాల్లో వెంచర్లు వేస్తున్న వారు పార్కులు, గుళ్ళు కట్టి, చదువుకునే శక్తిలేని పేదలను పూర్తిగా విస్మరిస్తున్నారు. దీనివల్ల మధ్యతరగతి మరియు పేద ప్రజలు తమ రక్తాన్ని అమ్ముకొని కార్పొరేట్ స్కూళ్లలో లక్షలాది రూపాయల ఫీజులు కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కు కావడం వల్లే సామాన్యుడికి ప్రభుత్వ విద్య అందని ద్రాక్షలా మారుతోంది.

ప్రభుత్వ పాఠశాలలు లేనిచోట సహజంగానే ప్రైవేట్ విద్యాసంస్థలు రాజ్యమేలుతాయి. ఇది ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న వ్యవస్థీకృత కుట్రగా భావించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ పెట్టుబడిదారులకు ఎర్రటి కార్పెట్ పరుస్తోంది. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలలో ప్రభుత్వ బడులు నిర్మించకపోవడం, ఉన్న బడుల్లో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడం వల్ల విద్యార్థులు ప్రైవేట్ జైళ్లలోకి నెట్టబడుతున్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాల్సిన బాధ్యతను పాలకులు పూర్తిగా విస్మరించారు.

పాలకులకు ప్రశ్నించే గొంతుకల కంటే, మూఢనమ్మకాల్లో మునిగిపోయే అంధులే కావాలని ప్రస్తుత రాజకీయ పోకడలు స్పష్టం చేస్తున్నాయి. విద్యపై పెట్టే పెట్టుబడిని వృధాగా భావించడం పాలకుల అవివేకానికి నిదర్శనం. పార్కులో ఆడుకోవడానికి స్థలం ఉంది, గుడిలో మొక్కుకోవడానికి స్థలం ఉంది, కానీ చదువుకోవడానికి మాత్రం ప్రభుత్వ బడి లేదు. ఇది ప్రభుత్వ వైఫల్యమా లేక ప్రైవేట్ శక్తుల విజయమా అనే అయోమయంనెలకొంది. ఒకవైపు డిజిటల్ విప్లవం గురించి, టెక్నాలజీ గురించి మాట్లాడుతుంటే, మరోవైపు పేద పిల్లవాడు బడికి దూరమవుతున్నాడన్న నిజాన్ని మనం ఎలా అంగీకరించాలి? ఈ అయోమయ స్థితి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో దేశంలో అక్షరాస్యత గ్రాఫ్ పడిపోవడమే కాకుండా, సమాజం విజ్ఞాన రహితంగా మారే ప్రమాదం ఉంది. మేధస్సు లేని జనాభా దేశాని కి ఆస్తి కాదు, భారంగా మారుతుంది.

అక్షరం ఆగిపోతే దేశం ఆగిపోతుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి, గుళ్ళు గోపురాల కంటే ముందు బడులను, ఉపాధ్యాయ నియామకాలను అత్యవసర ప్రాధాన్యతగా తీసుకోవాలి. వెంచర్ అనుమతులలో పాఠశాల స్థలాన్ని తప్పనిసరి చేయాలి. ఇప్పటికైనా పాలకులు తమ ప్రాధాన్యతలను మార్చుకోకపోతే, అక్షరాస్యతలో వెనుకబడిన దేశంగా భారతదేశం చరిత్రలో మిగిలిపోతుంది. రాబోయే తరాలు తమ చదువును తాకట్టు పెట్టిన పాలకులను ఎన్నటికీ క్షమించవు.

# ప్రేమకు పట్టాభిషేకం

ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా పాశ్చా త్య దేశాల్లో ప్రారంభమైన వాలంటైన్స్ వారోత్సవాలు ప్రతి ఏట ఫిబ్రవరి 07 నుంచి 14 వరకు నిర్వహించడంతో పాటు చివరి రోజు 14 ఫిబ్రవరిన వాలంటైన్స్ దినం లేదా ప్రేమికుల దినంగా కూడా పాటించ డం నేటి డిజిటల్ యువతకు అలవాటుగా మారింది. ప్రేమ, ఆప్యాయతలే అమూల్య ఇంధనాలుగా ప్రపంచ మానవాళి శాంతియుతంగా గడుపుతున్నది. శిశువుకు తొలి ప్రేమను పరిచయం చేస్తుం ది అమ్మ. చిరునవ్వుల శిశువు నాన్న ఆప్యాయతను రుచి చూస్తుంది. అమ్మనాన్నలతో ప్రారంభమైన ప్రేమానురాగాలు, అనంత ఆప్యాయతలు క్రమంగా కుటుంబ సభ్యులు, బంధువు లు, స్నేహితుల వరకు విస్తరించి జీవితాన్ని సుసంపన్నం చేస్తుంది.ప్రేమ నిండిన హృదయాల్లో ద్వేషానికి తావు లేదు. ప్రేమానురాగాల రుచి చూడలేని అభాగ్యుల జీవితాలు గాఢాంధకారంలోనే ముగుస్తాయి.

రోమన్ కాథలిక్ చర్చ్‌కు చెందిన సెయింట్ వాలంటైన్ చొరవతో యువ ప్రేమికులను ఏకంచేయడం, ప్రేమకు పట్టాభిషేకం చేయడాన్ని తన ప్రాణాలను సహితం అర్పించడం జరిగింది. ఈ రోజు న యువ జంట ఒకరినొకరు మనసు విప్పి తమ ప్రేమానురాగాలను, అప్యాయతలనుధైర్యంగా వ్యక్తం చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తారు. రోమన్ యువ సైనికులు పెళ్లిళ్లు చేసుకోవడాన్ని నిషేధించారు నాటి రోమన్ చక్రవర్తి క్లాడియస్2. చక్రవర్తి విధించిన వివాహ నిషేధాజ్ఞలను బేఖాతరు చేస్తూ ప్రేమకు పట్టం కట్టడానికి పూనుకొన్న సేయింట్ వాలంటైన్ ఆ యువ జంటలను ఏకం చేస్తూ పెళ్లి పీటల వరకు తీసుకురావడం జరిగింది. తన నిషేధాజ్ఞలకు విరుద్ధంగా యువ సైనికులకు వివాహాలు చేసి న సెయింట్ వాలంటీన్‌కు క్రీ. శ. 14 ఫిబ్రవరి 269న మరణ శిక్ష విధించడంతో సెయింట్ వాలంటీన్ అమరత్వం పొందా రు. తన ప్రాణాలకు తెగించి ప్రేమికులను ఏకం చేయడానికి కృషి చేసిన సెయింట్ వాలంటీన్ వర్ధంతి 14 ఫిబ్రవరి రోజున వాలంటీన్స్ లేదా ప్రేమికుల దినం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

**ప్రేమ మూడుముళ్ల బంధంగా మారాలి:**

తల్లిదండ్రులు కుదిర్చిన అరేంజ్‌డ్ మ్యారేజీలు కాని ప్రేమ వివాహాలు కాని ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే యువ ప్రేమికుల జంట వివాహా బంధంతో ఏకం కావాలని, తమ వైవాహిక జీవితాన్ని కడదాక ఆసాంతం ఆస్వాదించాలని, ఆదర్శ జంటగా ఆనంద హరివిల్లుల కుటుంబ జీవనం గడపాలని కోరుకుందాం.

***(14 ఫిబ్రవరి వాలంటైన్స్ దినం సందర్భంగా)***



## కొల్లాపూర్ పీఠం కాంగ్రెస్ కైవసం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ మున్సిపాలిటి ఎన్నికలలో కొల్లాపూర్‌చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం 19వార్డులలో ముమ్మరంగా మంత్రి జూపల్లికృష్ణారావు, మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ప్రచారం నిర్వహించడంతో ముందు ఊహించుకున్నట్లుగానే మున్సిపాలిటి ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్‌పార్టీకి 16, బిఆర్ఎస్‌పార్టీకి 03, బిజెపిపార్టీకి0 వచ్చాయి. మెజార్టీస్థానాలు కాంగ్రెస్‌పార్టీకి రావడంతో చైర్మన్‌పీఠం కాంగ్రెస్‌పార్టీకి దక్కింది.





## గద్వాల మున్సిపాలిటీలో భార్యాభర్తల గెలుపు జోరు

**ప్రజాపక్షం/గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు కౌన్సిలర్లుగా ఎన్నికై రికార్డు సృష్టించారు. జిల్లా బిజెపి అధ్యక్షులు రామాంజనేయులు, ఆయన సతీమణి, మున్సిపల్ మాజీ చైర్మన్ కృష్ణవేణి ఇద్దరూ బిజెపి తరపున పోటీ చేసి ఘన విజయం సాధించారు. రామాంజనేయులు 19వ వార్డు నుంచి విజయం సాధించగా కృష్ణవేణి 26వ వార్డు నుంచి గెలుపొందారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన అనుభవం ఉన్న కృష్ణవేణి, జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రామాంజనేయులు ఇద్దరూ ఒకేసారి కౌన్సిల్‌లో అడుగుపెడుతుండటంతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. వీరిద్దరి విజయం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## పెబ్బేరు పుర పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్

**ప్రజాపక్షం/పెబ్బేరు :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన రెండవ మున్సిపల్ ఎన్నికలలో పెబ్బేరు మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకాన్ని ఎగురవేసింది. పెబ్బేరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 12 స్థానాలకు గాను ఏడు స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, ఐదు స్థానాలను భారత రాష్ట్ర సమితి నిలబెట్టుకుంది. ఇటు బిజెపి పార్టీ కానీ అటు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గానీ అసలు తమ ఖాతాలను తెరవలేకపోయాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం పై పెబ్బేరు ఓటర్లు పూర్తి విశ్వాసం ఉంచి కావాల్సిన మెజార్టీని అందించారు. ఎంతో పెబ్బేరు మున్సిపల్ ఓటర్లకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి, పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

## అమరచింతలో విలక్షణమైన మిశ్రమ ఫలితాలు

**ప్రజాపక్షం/అమరచింత :** మున్సిపల్ ఎన్నికల్లో అమరచింత పురపాలకలో ఓటర్ల తీర్పు విలక్షణమైన మిశ్రమ ఫలితాలు వచ్చాయి. శుక్రవారం అమరచింత పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం ఓటింగ్ ముగిసింది. ఈ మిశ్రమ ఫలితాలలో 10 వార్డుల గాను 1,2,3 వార్డులను బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్, సిపిఎం పార్టీలు కూటమిలో భాగంగా 4,5,6 వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. 7వ వార్డును సిపిఎం అభ్యర్థి గెలిచారు. 8,9,10 వార్డులలో బిజెపి అభ్యర్థులు గెలుపొందారు. పట్టణంలో విలక్షణమైన మిశ్రమ ఫలితాలు రావడంతో ఆశ్చర్యకరంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి మూడు, బిఆర్ఎస్ పార్టీకి మూడు, బిజెపి పార్టీకి మూడు, సిపిఎం పార్టీకి ఒకటి సీట్లు రావడం వల్లపుర చైర్మన్ ఎవరికి దక్కుతుందని పట్టణ ప్రజలు వేచి చూస్తున్నారు.

## 8వ వార్డులో లక్కీ విజయం డిప్ప సిస్టంలో గెలిచిన కాంగ్రెస్

**ప్రజాపక్షం/గద్వాల్ :** గద్వాల మున్సిపల్ ఎన్నికల చరిత్రలోనే అత్యంత అరుదైన మరియు ఉత్కంఠభరితమైన సన్నివేశం 8వ వార్డులో చోటుచేసుకుంది. ఓట్ల లెక్కింపులో ఇద్దరు అభ్యర్థులకు సమానమైన ఓట్లు రావడంతో విజేతను డిప్పు (లక్ డ్రా) ద్వారా నిర్ణయించారు. సరిసమానంగా ఓట్లుః 8వ వార్డు కౌంటింగ్ పూర్తయ్యేసరికి ప్రధాన అభ్యర్థులకి ఓట్లు సరిసమానంగా (Tie) వచ్చాయి. దీంతో రీ కౌంటింగ్ చేపట్టినప్పటికీ ఫలితంలో మార్పు లేకపోవడంతో అధికారులు ఉత్కంఠ మధ్య డిప్పు తీశారు.

**లక్కీ విన్నర్ :** ఈ డిప్పు సిస్టంలో అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థి వెంకటమ్మను వరించింది. దీంతో ఆమెను విజేతగా అధికారులు ప్రకటించారు. గెలుపోటమలు మధ్య ఒక్క ఓటు తేడా కూడా లేకుండా సమానంగా రావడంతో, గద్వాల ప్రజలందరూ ఈ ఫలితం వైపు ఆసక్తిగా చూశారు. చివరికి అదృష్టం కాంగ్రెస్ వైపు నిలిచి వెంకటమ్మ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.

## గద్వాల్ మున్సిపాలిటీలో గెలుపొందిన కౌన్సిలర్ల వివరాలు

వార్డుల వారీగా పార్టీల జాబితా

**ప్రజపక్షం/గద్వాల టౌన్ అప్డేట్స్ :** గద్వాల మున్సిపాలిటీ 37 వార్డుల ఫలితాలు..1వ వార్డు బిఆర్ఎస్ దుబ్బన్న, 2వ వార్డు కాంగ్రెస్ లక్ష్మి నరసింహ, 3వ వార్డు కాంగ్రెస్, 4 వ వార్డు కాంగ్రెస్, 5వ వార్డు బిఆర్ఎస్, 6వ వార్డు బీజేపీ, 7వ వార్డు బిఆర్ఎస్, 8వ వార్డు బిఆర్ఎస్, 9వ వార్డు కాంగ్రెస్, 10వ వార్డు కాంగ్రెస్ , 11వ వార్డు కాంగ్రెస్ , 12 వ వార్డు బిఆర్ఎస్, 13వ వార్డు బీజేపీ, 14వ వార్డు కాంగ్రెస్, 15వ వార్డు ఎంఐఎం , 16 వ వార్డు కాంగ్రెస్, 17వ వార్డు బీజేపీ, 18వ వార్డు కాంగ్రెస్ , 19 వ వార్డు బీజేపీ, 20 వ వార్డు బిఆర్ఎస్, 21 వ వార్డు బిఆర్ఎస్, 22 వ వార్డు కాంగ్రెస్, 23 వ వార్డు బిఆర్ఎస్, 24వ వార్డు బిఆర్ఎస్, 25వ వార్డు బిఆర్ఎస్, 26వ వార్డు బీజేపీ ,27 వ వార్డు కాంగ్రెస్, 28వ వార్డు కాంగ్రెస్, 29వ వార్డు ఇండిపెండెంట్ సత్యం ఫుట్ బాల్, 30 వ వార్డు బీజేపీ , 31 వ వార్డు కాంగ్రెస్, 32 వ వార్డు ఇండిపెండెంట్ ముత్యాల లక్ష్మీ , 33 వ వార్డు కాంగ్రెస్, 34వ వార్డు బీజేపీ, 35 వ వార్డు కాంగ్రెస్, 36 వ వార్డు బిఆర్ఎస్, 37వ వార్డు బిఆర్ఎస్. కాంగ్రెస్ ః 15 వార్డు లు గెలుపు, బిఆర్ఎస్ ః 12 వార్డు లు గెలుపు. బీజేపీ ః 07 వార్డు లు గెలుపు, ఇండిపెండెంట్ ః 2 వార్డు లు గెలుపు, ఎంఐఎం ః 1 వార్డు గెలుపు.

# ఉమ్మడి పాలమూరులో కాంగ్రెస్సే విజేత

13 మున్సిపాలిటీలలో విజయకేతనం
3 మున్సిపాలిటీలలో హంగ్
చెరొకటి బిఆర్ఎస్, బిజెపి
మంత్రుల, ఎమ్మెల్యేల కృషి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** కాంగ్రెస్ పార్టీకే ఓటర్లు పట్టం కట్టారు. అధిక మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 19 మున్సిపాలిటీలలో 13 స్థానాల్లో చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. ఐజ మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ గెలుపొందగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, నారాయణపేటలో బిజెపి విజయం పొందింది. మరో మూడు మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. గద్వాల, అలంపూర్, అమరచింతలో ఏ పార్టీ మేజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో ఎంపి, ఎమ్మెల్యే, స్వతంత్రుల ఓటుతో గట్టెక్కే పరిస్థితి ఉంది. కాంగ్రెస్ కు ఊహించని మున్సిపాలిటీ స్థానాలు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ నేతలకు ఊహించని ఫలితాలు రావడంతో ఖంగుతిన్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందించారు. వాకిటి శ్రీహరి నియోజకవర్గంలోని అమరచింత మాత్రం హంగ్‌లోకి వెళ్లిపోయింది. మక్తల్, ఆత్మకూర్ మాత్రం కాంగ్రెస్ ఖాతాలో పడింది. దేవరకద్ర నియోజకవర్గంలో ఉన్న మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. ఇక్కడి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, తన పరిధిలోని దేవరకద్ర, కొత్తకోట, భూత్పూర్ మున్సిపాలిటీలలో చైర్మన్ పదవికి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. వనపర్తి నియోజకవర్గంలోని వనపర్తి, పెద్దేర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇక్కడ ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషితో మేజిక్ ఫిగర్ దాటి రెండు చైర్మన్ పదవులను కాంగ్రెస్ ఖాతాలో జమ చేశారు. కొడంగల్ నియోజకవర్గం లోని కొడంగల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ విజయం దుందుబీ మోగించింది.

కోస్గిలో క్వీన్ స్లీప్ చేసింది, 16 వార్డులకు గాను 16లో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. కొడంగల్ రేవంత్ రెడ్డి అడ్డా అనే పేరును సార్థకం చేశారు. ఇక్కడి ఓటర్లు, నారాయణపేటలో 24 వార్డుల్లో బీజేపీ 11 స్థానాల్లో గెలుపొందింది. ఇక్కడ బీజేపీ ఎంపీ డీకే అరుణ ఓటు తో బీజేపీ గట్టెక్కనుంది. నాగర్ కర్నూల్ లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయ శిఖరాలకు చేరుకుంది. గద్వాల మున్సిపాలిటీ లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జ్ సరిత మధ్య రాజకీయ సమన్వయం లేకపోవడం తో మేజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో ఇక్కడి మున్సిపాలిటీ లో హంగ్ ఏర్పడింది. అలంపూర్ లో 10 మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ తీసుకొని 5 స్థానాల్లో గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్ ఆఫీసియో సభ్యుల ఓటుతో గట్టెక్కాలని ఉన్నా ఇక్కడ బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే విజయుడు, కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఎంపీ మల్లురవి ఉన్నారు. వీరు ఓట్లు వేసినా సమానమైన ఓట్లు ఉంటాయి. ఇది ఫలితం ఎలా ఉంటుందో అని అంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పెద్దగా పోటీ ఇవ్వలేకపోయాయి.

**కార్పొరేషన్‌లో కాంగ్రెస్ హవా**
**మహబూబ్‌నగర్‌లో కొనసాగుతున్న కౌంటింగ్**

మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో ఉంది. 60 డివిజన్ల లో ఇప్పటి వరకు 40 డివిజన్ల ఫలితాలు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ కు 22, బీఆర్ఎస్ కు 9, బీజేపీ కి 6, ఎంఐఎం కు 02, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఇక్కడ మేజిక్ ఫిగర్ 31 డివిజన్ల లో గెలుపొందితే మేయర్ పీఠం కైవసం చేసుకోవచ్చు. ఈ మేజిక్ ఫిగర్ కు 9 స్థానాల దూరం లో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇంకా 20 డివిజన్ల ఎన్నికల ఫలితాలు రావాల్సి ఉంది.

## ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే విజయం

మంత్రి జూపల్లికృష్ణారావు



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాప్రభుత్వపాలనలో ప్రజాసంక్షేమం, అభివృద్ధిపథకాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి బ్రహ్మరథంపట్టారని , ఏఎన్నికలైనా కాంగ్రెస్‌దే విజయమని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఫలితాల నేపథ్యంలో మంత్రి జూపల్లికృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులనుచూసి ప్రజలు పట్టంకట్టారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా అత్యధిక స్థానాలను కాంగ్రెస్‌పార్టీ గెలుచుకున్నదని, కొల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలో కాంగ్రెస్‌పార్టీ ప్రభంజనం సృష్టించిందన్నారు. కొల్లాపూర్‌లో మొత్తం 19స్థానాలు ఉండగా కాంగ్రెస్ 16కైవసం చేసుకుందన్నారు. మున్సిపల్ ఫలితాల ఊపు రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లోను కొనసాగుతుందని అక్కడ కూడా ప్రజలు ఇదే తరహాతీర్పును ఇవ్వబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.

## నర్సరీ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలంలోని పెద్దపోర్ల గ్రామంలోని నర్సరీ పనులను గ్రామ సర్పంచు బోయిన్‌పల్లి కాశమ్మ చేతుల మీదుగా పూజా కార్యక్రమంతో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. అలాగే గ్రామ యువ నాయకులు బోయిన్‌పల్లి నరేష్ కుమార్, వెంకటయ్య, రాము, కాట్రాజ్, శివకుమార్ గౌడ్, ఆనంద్, శివకృష్ణ, సిద్దు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు కొల్లూరు మాధవి, నాగేష్, వార్డు మెంబర్లు బోయిన్‌పల్లి రేష్, మౌలానా, ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి, పాల్గొన్నారు.



## కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి చేరుకుంటారు

సర్పంచ్ పురుగుల యాదయ్య

**ప్రజాపక్షం/వంగూర్ :** విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి చేరుకుంటారని సర్పంచ్ పురుగుల యాదయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఇష్టంతో కష్టపడి చదివినట్లయితే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈవో మురళిమోహనచారితోకలిసి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్త కోడళ్ళ విజయం

నారాయణపేట్ మున్సిపాలిటీలో
బిజెపి 11, కాంగ్రెస్ 07, టిఆర్ఎస్ 02, ఎంఐఎం 02, ఎఐఎఫ్‌బి 01, స్వతంత్ర 01 స్థానాల్లో విజయం







**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కట్టుదిట్టంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ. నారాయణ పేట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల్ గరుకుల పాఠశాల, కళాశాలలో నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు రాజకీయ పార్టీ ప్రతనిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమును తెరచి బ్యాలెట్ బాక్స్ లను నిర్దేశిత కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు తమకు కేటాయించిన వార్డుల వారీగా ఆయా వార్డులకు పోటీ చేయు అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కించారు. అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్స్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు.

కలెక్టర్, తో పాటు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ కౌంటింగ్ హాల్ లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. ప్రతి వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా వచ్చిన బ్యాలెట్ పేపర్లను మొదట 25 చొప్పున కట్టలు కట్టించారు. అనంతరం ఆయా అభ్యర్థుల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, పటిష్ట పోలీసు బందోబస్తు నియమించినట్లు తెలిపారు. మొత్తం మూడు రౌండ్ లలో 24 వార్డుల ఫలితాలను అధికారులు వెల్లడించారు.

# జిల్లాలో కాంగ్రెస్ పార్టీదే హవా

మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్‌వే





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి,కొల్లాపూర్ మున్సిపాలిటిలకు జరిగిన ఎన్నికలలో శుక్రవారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్‌పార్టీహవా స్పష్టంగా కనిపిస్తున్నది. మూడు మున్సిపాలిటిలలో కూడా కాంగ్రెస్‌పార్టీ ఆధిక్యతను సాధించి చైర్మన్ పదవులను కైవసం చేసుకోవడం సులభతరమైంది.

**నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు 18 :**
నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో 24వార్డులు ఉండగా కాంగ్రెస్ పార్టీ 18వార్డులు, బిఆర్ఎస్ 06వార్డులను కైవసం చేసుకున్నాయి. 1వవార్డులో అర్జునయ్య(బిఆర్ఎస్)473 ఓట్ల మెజార్టీతో, 2వవార్డులో తిమ్మాజిపేటపాండు(బిఆర్ఎస్), 82 ఓట్లతో, 3వవార్డులో కవిత 86 ఓట్లతో, 4వవార్డులో శివసంత(కాంగ్రెస్) 419, 5వవార్డులో నర్సింహ్మారెడ్డి (కాంగ్రెస్) 133 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 6వవార్డులో ఎం.శ్రీనివాసులు(కాంగ్రెస్) 80, 7వవార్డులో అనంత అలివేలమ్మ (కాంగ్రెస్) 134, 8వవార్డులో బాదంరమేష్(కాంగ్రెస్) 300, 9వ వార్డులో ఎస్.అలివేల (కాంగ్రెస్), 315, 10వవార్డులో జయప్రకాశాచారి (బిఆర్ఎస్) 50ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 11వవార్డులో అసిఫాభేగం(కాంగ్రెస్) 148, 12వవార్డులో ఎం.జయలక్ష్మి (బిఆర్ఎస్) 2 ఓట్లతో, 13వవార్డులో కొత్త గంగాధర్(బిఆర్ఎస్) 138, 14వవార్డులో నాజిమాబేగం(కాంగ్రెస్) 360, 15వ వార్డులో గోసియాబేగం(కాంగ్రెస్) 307, 16వవార్డులో కూచుకుళ్ల సింధు(కాంగ్రెస్) 12 ఓట్లతో గెలుపొందారు. 17వవార్డులో పి.రాజేశ్వరి(కాంగ్రెస్) 84, 18వవార్డులో పి.చంద్రకళ (కాంగ్రెస్) 195, 19వవార్డులో కె.సునీత(కాంగ్రెస్) 157, 20వవార్డులో పద్మమ్మ(కాంగ్రెస్) 13 ఓట్లతో, 21వవార్డులో పడిగెశంకర్(కాంగ్రెస్), 48 ఓట్లతో, 22వవార్డులో ఏ.మాధవి (కాంగ్రెస్) 240, 23వార్డులో తీగలసునీంద్ర(కాంగ్రెస్) 240, 24వవార్డులో ఎం.నిజాముద్దిన్(కాంగ్రెస్) 310 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగిన హస్తం హవా

నాలుగు మున్సిపాలిటీలు హస్తగతం –
కారుకు ఎదురుగాలి



**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు కాను నాలుగు మున్సిపాలిటీల్లో పూర్తి మెజార్టీ సాధించి కాంగ్రెస్ పార్టీ అస్తగతం చేసుకుంది. ఈ నాలుగు మున్సిపాలిటీలో పూర్తి మెజార్టీ సాధించి చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు మార్గం సుగమం అయింది. వనపర్తి మున్సిపాలిటీలో మొత్తం 33 స్థానాలకు గాను కాంగ్రెస్ కు 20, బిఆర్ఎస్ కు 8, బిజెపికి 2, సిపిఎం కు 1, ఇండిపెండెంట్‌లు ఇద్దరు గెలుపొందారు. కొత్తకోట మున్సిపాలిటీల్లో మొత్తం 15 కౌన్సిల్ స్థానాలకు కాను కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ మూడు, బిజెపి ఒకటి, ఇండిపెండెంట్లు ఒకరు విజయం సాధించి పూర్తి మెజార్టీ కాంగ్రెస్ కు కట్టబెట్టారు. పెబ్బేరు మున్సిపాలిటీలో మొత్తం 12 స్థానాలకు గాను, కాంగ్రెస్ 7, టిఆర్ఎస్ 5 స్థానాలు గెలుపొంది కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ అందించారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో మొత్తం పది స్థానాలు ఉండగా కాంగ్రెస్ కు ఆరు బీఆర్ఎస్ ఒకటి బిజెపి మూడు గెలుపోందాయి. ఈ మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ పార్టీ ఆరు సీట్లు గెలుపొంది పూర్తి మెజార్టీని సాధించింది. అమరచింత మున్సిపాలిటీలో మొత్తం పది స్థానాలు ఉండగా కాంగ్రెస్ కు మూడు, బీఆర్ఎస్ కు మూడు, బిజెపి మూడు, సిపిఎం ఒకటి సాధించి హంగుకు అవకాశం కల్పించాయి. మొత్తానికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆవా కొనసాగినట్లు కనిపిస్తుంది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు సులభంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు.

## మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/గోపాల్‌పేట :** గోపాల్‌పేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరిశీలించారు. సన్నబియ్యంతో వండిన అన్నంతో పాటు, పప్పు కూరగాయలను, రాగిజావను ఆయన చూశారు. విద్యార్థులను తయారు చేసే భోజనం పట్ల అశ్రద్ధ వహించరాదని ఎప్పటికప్పుడు తాజా కూరగాయలతో నాణ్యవంతమైన భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఆయన అధికారులకు, పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో మార్పులను తీసుకువచ్చిందని విద్యా వ్యవస్థను బలోపేతం చేసి తెలంగాణకు బంగారు భవిష్యత్తును అందించేందుకు ముందుకెళుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**పజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని బొల్లారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ పాఠాలు బోధించడం, పాఠశాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 16 మంది విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించారు. వారికి కేటాయించిన పనులను క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తూ తమ ప్రతిభను చాటుకున్నారు. తరగతుల నిర్వహణ, హాజరు నమోదు, పాఠ్యాంశాల బోధన వంటి బాధ్యతలను చక్కగా నిర్వర్తించడం ప్రశంసనీయంగా నిలిచింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నరసింహ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడానికి దోహదపడుతాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి స్వయం పరిపాలన దినోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. యంఈఓ గా ఎన్.బింధు, హెచ్‌యం గా డి.దీప్తి వ్యవహరించారు. జడ్పీలుగా సీఆర్‌పీ నాగరాజు, ఉపాధ్యాయురాలు వరలక్ష్మీ పాల్గొని విద్యార్థుల ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ బొల్లారం హెచ్‌యం రఘు, ఉపాధ్యాయులు రాధిక, వనిత, రామస్వామి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

13వనపర్తి4ఎ

## మున్సిపల్‌లో బిఆర్ఎస్‌దే పై చేయి

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** జోగులాంబ గద్వాల జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ పరిధిలోని 77 వార్డులకు జరిగిన ఎన్నికలు సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 30 మంది గెలుపొంది పైచేయిని సాధించారు. అధికార పార్టీ అయిన కాంగ్రెస్ నుండి 29 మంది అభ్యర్థులు గెలుపొందారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఐజ మున్సిపాలిటీ పరిధిలో 13 మంది, అల్లంపూర్ 5, వడ్డేపల్లి ఒకటి టిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో 11 మంది టిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థుల కంటే టిఆర్ఎస్ అభ్యర్థులు ఒకరు ఎక్కువగా గెలుపొందారు. అనూహ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఫార్వర్డ్ బ్లాక్ నుండి ఎనిమిది మంది అభ్యర్థులు గెలుపొందడం విశేషం. ఇక బిజెపి విషయానికొస్తే అల్లంపూర్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీ పరిధిలో ఒక్కరు గెలుపొందలేదు. గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఏడు స్థానాలను కైవసం.

**చైర్మన్ పీఠం పై ఉత్కంఠత...**గద్వాల మున్సిపల్ చైర్మన్ పీఠం పై ఉత్కంఠత నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నుండి 16,టిఆర్ఎస్ నుండి 11, బిజెపి నుండి 7, ఇండిపెండెంట్లు 2, ఎంఐఎం పార్టీ నుండి ఒక్కరు గెలుపొందారు. టిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్, ఎంఐఎం పార్టీలు ఒకటైతే చైర్మన్ పీఠం బిఆర్ఎస్ కే దక్కే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ ఇండిపెండెంట్ , ఎంఐఎం పార్టీలు ఒకటైతే కాంగ్రెస్ కు చైర్మన్ పీఠం దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చైర్మన్ పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారనే విషయం పై చట్టణ వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో చరిత్ర సృష్టించిన ట్రాన్స్‌జెండర్ సుధాకర్

ప్రజాపక్షం/చిట్యాల : కనివిని ఎరగని రీతిలో ఒక ట్రాన్స్‌జెండర్ మున్సిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసి విజయం సాధించి చరిత్ర సృష్టించిన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. ఐదుగురితో పోటీ పడి ఘన విజయాన్ని సాధించిన సంఘటన ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. చిట్యాల మున్సిపాలిటి పరిధిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలో 1వ వార్డు ఎస్‌సి జనరల్ స్థానానికి కేటాయించబడింది. అదే గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ నాగిళ్ళ సుధాకర్(39) ఈ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. కాగా ఈ స్థానానికి కాంగ్రెస్ బలపర్చిన సిపిఎం అభ్యర్థి జిట్ట నగేష్‌తో పాటుగా, బిఆర్ఎస్ అభ్యర్థి రుద్రవరం యాదయ్య, బిజెపి నుండి రుద్రవరం లింగస్వామి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ అభ్యర్థి నాగిళ్ళ యాదయ్య, బిఎస్‌పి నుండి మేడి నరేష్‌లు ఎన్నికల బరిలోకి దిగారు. హోరా హోరీగా సాగిన పోటీలో ట్రాన్స్‌జెండర్ సుధాకర్ అనూహ్యంగా 102 ఓట్ల మెజార్టీని సాధించి విజయం సాధించడం గమనార్హం. ఓటర్లు ప్రధానమైన పార్టీలను పక్కన పెట్టి ఇండిపెండెంట్‌గా పోటీచేసిన ట్రాన్స్‌జెండర్ వైపు మొగ్గు చూపడం అనే అంశం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. దీనికి గల కారణాలపై ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు.

## ఒక్క ఓటుతో విజయం



ప్రజాపక్షం/మిర్యాలగూడ: మున్సిపల్ ఎన్నికల్లో 18వ వార్డు అభ్యర్థి బూడిద సైదులు బీఆర్ఎస్ అభ్యర్థి వల్లంపల్లి వినోద్‌కుమార్‌పై ఒక్క ఓటు తో గెలిచాడు. ఆ వార్డులో మొత్తం 2241 ఓటర్లు ఉండగా 1711 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో సైదులుకు 837 ఓట్లు రాగా వినోద్‌కు 836 ఓట్లు వచ్చాయి.

**మిర్యాలగూడలో ఇదే అత్యధిక మెజారిటీ**

మిర్యాలగూడలో మొత్తం 48వార్డుల్లో అత్యధిక మెజార్టీ సాధించిన వార్డుగా 29వ వార్డు నిలిచింది. ఈ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జావిద్ సిపిఎం పార్టీ అభ్యర్థి డబ్బికార్ మల్లేష్‌పై 1113 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచాడు. ఈ వార్డులో మొత్తం 2068 ఓట్లు ఉండగా 1655 పోల్ అయ్యాయి. ఇందులో జావిద్‌కు 1363 ఓట్లు రాగా మల్లేష్‌కు 250 ఓట్లు మాత్రమే వచ్చాయి.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఆరు నెలల జైలు శిక్ష

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోని గుజ్జ గ్రామంలో 2020లో ఉప్పలపల్లి యాదయ్యకు అదే గ్రామానికి చెందిన దోడ అనంత రెడ్డి, సింగు సంజీవరెడ్డి, మాదాల రెడ్డి, జలంధర్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్ చారిలతో పొలాలకు వెళ్లే దారి కోసం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ విషయంలో ఉప్పలపల్లి యాదయ్యను కులం పేరుతో దూషించడంతో 2020 సంవత్సరంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ పి.సత్తయ్య విచారణ చేయగా కులం పేరుతో దూషించారని విచారణలో తేలడంతో క్రైమ్ 18/2020 143, 504, ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈరోజు స్పెషల్ సెషన్ కోర్ట్ నల్గొండ అట్రాసిట్ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానాలను విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవమానకర వ్యాఖ్యలు చేసి దౌర్జన్యం పాల్పడినట్లు ఆరోపణ నమోదయ్యాయి. వాంగ్మూలాం సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితులకు జరిమానా చెల్లించనిచో మరో రెండు నెలలు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కేసు విషయంలో సాక్ష్యాలను, కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ అఖిల ప్రతివాదుల వాదనలు విన్నారు. కేసు విషయంలో ఎలాంటి విభేదాలు లేకుండా సహకరించిన ఎస్సై జగన్, కోర్ట్ కానిస్టేబుల్ సత్యనారాయణను డీఎస్పీ అభినందించారు.

## డిసిఎం—ద్విచక్ర వాహనం ఢీ : కానిస్టేబుల్ తయుబ్ మృతి



ప్రజాపక్షం/మునుగోడు : నల్లగొండ మండలం చందనపల్లి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునుగోడు కానిస్టేబుల్ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు పోలీస్ స్టేషన్‌లో గత 14 నెలలుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె తయుబ్ (34) చండూరు మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ దగ్గర విధులు నిర్వహించి తన సొంత గ్రామమైన నకిరేకల్ వెళ్తుండగా మార్గం మధ్యలో చందనపల్లి గ్రామం దగ్గర ప్రమాదవశాస్తూ ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి 108 సహాయంతో నలగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు కానిస్టేబుల్‌కి భార్య మృతుడుకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

## మహిళా అభివృద్ధితోనే గ్రామ ప్రగతి

ఎమ్మెల్యే వీరేశం

ప్రజాపక్షం/నకిరేకల్ : గ్రామాల సమగ్ర అభివృద్ధి మహిళల అభివృద్ధితోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పాలెం, నోముల, చందుపట్ల గ్రామాల్లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య సంఘ భవనాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ, సంఘాల బలోపేతం దిశగా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. మహిళాసంఘాలకు సకల సదుపాయాలతో కూడిన భవనాలు అందుబాటులోకి రావడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆదాయ వనరుల అభివృద్ధి కార్యక్రమాలకు ఇవి కేంద్రాలుగామారనున్నాయన్నారు. ప్రతి గ్రామంలో మహిళా శక్తిని ప్రోత్సహించే చర్యలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పాలెం సర్పంచ్ పోట్టబత్తుల జయమ్మ వెంకటేశం, చందుపట్ల సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి, నోముల సర్పంచ్ కృష్ణవేణి, ఉపసర్పంచులు కోమటి రెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కల్లేపల్లి విజయ్, ఓర్సు మంజుల శ్రీను, ఏపీఎం ప్రభాకర్, సీసీలు గంగాధర పద్మ, బాలు, పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమార్, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ సామ సత్తిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, నాయకులు యాస కరుణాకర్‌రెడ్డి, కుంచం సోమయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# నల్లగొండ జిల్లా మున్సి'పోల్'లో కాంగ్రెస్ జైత్రయాత్ర

162 వార్డుల్లో 106 స్థానాలు కైవసం
కార్పొరేషన్, మున్సిపాలిటీలో స్పష్టమైన ఆధిక్యంలో కాంగ్రెస్
ఒక మేయర్... ఆరు మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతం
ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించని బిఆర్ఎస్..
చేతులెత్తేసిన బిజెపి.. పట్టు బిగించిన ఇండిపెండెంట్లు
కాంగ్రెస్ 106, బిఆర్ఎస్ 36, సిపిఐ 1, బిజెపి 6, ఎంఐఎం 2, ఎఐఎఫ్‌బి 6.. స్వతంత్రులు 6



ప్రజాపక్షం/నల్లగొండ : నల్లగొండ జిల్లాలో జరిగిన మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడగా సిపిఐ పొత్తుతో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. చండూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ ఒకస్థానం గెలిపొందారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు, మిర్యాలగూడ, చిట్యాల, చండూరు, దేవరకొండ, నందికొండ, హాలియా మున్సిపాలిటీలలో 161 వార్డులకు ఫలితాలో కాంగ్రెస్ ఏకగ్రీవం కాగా 106 స్థానాలు దక్కించుకొని దూసుకుపోయింది. సిపిఐ 1, బిఆర్ఎస్ 36 స్థానాలు గెలుచుకోగా, బిజెపి 6 స్థానాలు సాధించింది. ఎంఐఎం 2 స్థానాలు గెలుచుకుంది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ6 స్థానాలు, స్వతంత్రులు 6 స్థానాలు గెలుపొందారు.

నల్లగొండ కార్పొరేషన్‌లో 48 వార్డులకు కాంగ్రెస్ పార్టీ 27 వార్డులు గెలుచుకుని స్పష్టమైన ఆధిక్యం సాధించింది. బిఆర్ఎస్ 9 స్థానాలు, బిజెపి 4 స్థానాలు గెలుచుకోగా, ఎంఐఎం 2, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 4, స్వతంత్రులు 2 స్థానాలు దక్కించుకున్నారు. తోలి కార్పొరేషన్ పగ్గాలు కాంగ్రెస్ చేతికి వెళ్లడం ఖాయమైంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో48 వార్డులో కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయం సాధించింది. మొత్తం 48 వార్డుల్లో 31 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. బిఆర్ఎస్ 14, బిజెపి1, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ1, స్వతంత్రుడు 1 గెలిచారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలకవర్గం ఏర్పడనుంది. అదేవిధంగా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మున్సిపాలిటీలో 10 వార్డులకుగాను కాంగ్రెస్ 6, సిపిఐ1, బిఆర్ఎస్ 3 స్థానాలు గెలుపొందారు. దేవరకొండ మున్సిపాలిటీలో కూడ 48 వార్డులకు కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు కైవసం చేసుకుంది. 48 వార్డుల్లో 11 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. బిఆర్ఎస్ 6, బిజెపి1, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ1, స్వతంత్రులు 2 గెలిచారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని తమ సత్తాను చాటింది. నందికొండ మున్సిపాలిటీలో ఉన్న 12 వార్డులకుగాను 11 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించింది. హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా అందులో పదవ వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 11 వార్డకు ఎన్నికలు జరిగాయి. వీటిలో పది స్థానాలు (4వ వార్డు, మినహా) కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొంది కొన్ని స్థానాలలో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ రాకుండా గెలుపొందడం గమనార్హం.

**కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు**

ఫలితాలు వెలువడిన వెంటనే జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ,దేవరకొండ తదితర పట్టణాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవాలు జరిపారు. ఇదిలా ఉండగా, బిఆర్ఎస్, బిజెపి శ్రేణులు కొన్ని ప్రాంతాల్లో నిరాశ వ్యక్తం చేశాయి. సమస్యలు, అభివృద్ధి వాగ్దానాల ఆధారంగా ఓటర్లు తీర్పు ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇక మేయర్, చైర్మన్ ఎన్నికలపై దృష్టి**

కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై వ్యూహరచన ప్రారంభించనుంది. జిల్లా రాజకీయాల్లో ఈ ఫలితాలు కీలక మలుపుగా భావిస్తున్నారు.

# 'పురపోరు'లో హస్తం హవా

సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కైవసం
తిరుమలగిరిలో కారు వశం



ప్రజాపక్షం/సూర్యాపేట : పురపోరులో హస్తం హవా కొనసాగింది. ఓట్ల లెక్కింపులో ప్రారంభం నుండి ఆ పార్టీ అభ్యర్థులు తమ ఆదిపత్యాన్ని ప్రదర్శించారు. జిల్లాలో మొత్తం 5 పురపాలక సంఘాలు ఉండగా ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కైవసం చేసుకుంది. తిరుమలగిరి మాత్రమే కారు వశం అయ్యింది. శుక్రవారం అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి...

సూర్యాపేట పురపాలక పరిధిలో మొత్తం 48 వార్డులు ఉండగా 31 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా, బిఆర్ఎస్ 11, బిజెపి 1, స్వతంత్ర అభ్యర్థులు 5 స్థానాల్లో గెలుపొందారు. కోదాడ పురపాలకలో మొత్తం 35 వార్డులకు గాను ముందే 3 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా 32 వార్డులకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 24 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, 3 స్థానాల్లో బిఆర్ఎస్, 5 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. హుజూర్‌నగర్ పురపాలకలో 28 వార్డులు ఉండగా 1 వార్డు ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 27 వార్డులకు అధికారులు ఎన్నికలు నిర్వహించగా 18 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు, 4 స్థానాల్లో బిఆర్ఎస్, 3 స్థానాల్లో స్వతంత్రులు, 1 స్థానం సిపిఐ, 1 స్థానం సిపిఎం అభ్యర్థులు విజయం సాధించారు. నేరేడుచర్ల పురపాలక పరిధిలో 15 వార్డులు ఉండగా 9 స్థానాల్లో కాంగ్రెస్, 5 స్థానాల్లో బిఆర్ఎస్, 1 స్థానంలో జనసేన పార్టీ అభ్యర్థి గెలిచారు. తిరుమలగిరి పురపాలక పరిధిలో 15 వార్డులు ఉండగా 10 స్థానాల్లో బిఆర్ఎస్, 5 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్

ఆరు మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తాం: ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/యాదాద్రి : మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' చేస్తున్న అభివృద్ధికి నిదర్శనమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విజయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

**విపక్షాల కుట్రలను తిప్పికొట్టిన ప్రజలు**

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసి వచ్చినా కాంగ్రెస్ ప్రభంజనాన్ని తట్టుకోలేకపోయాయని బీర్ల అయిలయ్య విమర్శించారు. 'ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ప్రజలు మాత్రం అభివృద్ధి వైపే నిలిచారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు ఈ విజయానికి పునాదులు వేశాయి. ముఖ్యంగా మహిళా సంక్షేమానికి మా ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్కు మద్దతు తెలిపారు' అని ఆయన వెల్లడించారు.

**జిల్లా అధ్యక్షునిగా విజయకేతనం**

యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి లభించిన ఆదరణ అమోఘమని, విపక్షాలకు కనీసం పోటీ ఇచ్చే అవకాశం కూడా ప్రజలు కల్పించలేదని ఎద్దేవా చేశారు.

**అభివృద్ధే లక్ష్యం.. తదుపరి లక్ష్యం జెడ్పీటీసీలే..**

మున్సిపాలిటీల అభివృద్ధిపై స్పందిస్తూ.. 'ముఖ్యమంత్రి సహకారంతో భారీగా నిధులు తీసుకువచ్చి, యాదాద్రి భువనగిరి జిల్లాను, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాము. ఇదే ఉత్సాహంతో రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ 90 శాతానికి పైగా స్థానాలను గెలుచుకుంటాం' అని ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయం కోసం కృషి చేసిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపుకు కారకులైన ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రశాంతంగా మున్సిపల్ 'లెక్క'

ప్రజాపక్షం/భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ శుక్రవారం అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిసింది. భువనగిరి మండలం అనాజిపురం గ్రామ శివారులోని దివ్యబాల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించి, ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. భువనగిరి, భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూరు, ఆలేరు మరియు యాదగిరిగుట్ట మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు భారీ బందోబస్తును ఏర్పాటు చేసి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచారు. మున్సిపల్ కౌంటింగ్ సరళిని ఎన్నికల పరిశీలకులతో పాటు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో కృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షించారు. డీఎస్పీ రవికుమార్, భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు ఇతర సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా లెక్కింపు పూర్తి కావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**మున్సిపల్ ఎన్నికల వేళ జిల్లాలో 163 సెక్షన్ అమలు**

జిల్లాలోని భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీల్లో పరోక్ష ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16 వరకు సెక్షన్ 163 (144) అమలులో ఉంటుందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ముగ్గురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదని, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## మన గ్రోమోర్ సెంటర్‌లో ఉద్రిక్తత

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలములోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద శుక్రవారం ఉద్రిక్త నెలకొంది. ఉదయం 10 గంటలకు యూరియా అందు బాటులో ఉంటుందని వ్యవసాయాధికారులు అంతర్జాలాలలో వాట్సప్ పెట్టడంతో వందలాది మంది అన్నదాతలు సెంటర్ వద్ద క్యూ కట్టారు. కంపెనీ యాప్ పెట్టకపోవడంతో అధికారుల తప్పుడు సమాచారం పై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పనులు వదులుకొని పడికాపులు కాసిన ఫలితం లేక పోవడంతో ఆవేదనతో వెనుదిరిగి పోయారు.

**రైతు ఆవేదన...** వట్టిపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల బుచ్చి రెడ్డికి ఆరెకరాల పొలంలో వరి నాటు వేసి నెల రోజులు గడిచిపోయింది. ఇంతవరకు ఒక్క యూరియా బస్తా కూడా దొరకలేదు. కొంతమంది రైతులు ఏ పంట వేయకపోయినప్పటికీ మిర్చి పంట వేశామని తప్పుడు సమాచారం ఇచ్చి యూరియా బస్తులు తీసుకువెళ్లడంతో వరి సాగుచేసిన రైతులకు దొరకటం లేదు.అధికారులు వరి సాగు చేసిన వివరాలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వరి సాగు చేసిన రైతులకు ఇప్పించాలని వేడుకుంటున్నాను.

# సూర్యాపేట మున్సిపాలిటీ 'హస్తం' కైవసం

48వార్డుల్లో 31 స్థానాల్లో విజయం
11 బిఆర్ఎస్, 1 బిజెపి, 5 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థుల గెలుపు



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటి హస్తగతమైంది. ఈనెల 11వ తేదీన అధికారులు ఎన్నికలు జరుగగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులు ఉండగా 31 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 11 బిఆర్ఎస్, 1 బిజెపి, 5 స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులు వివరాలు ఇలా ఉన్నాయి...

**గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థుల వివరాలు...**

1వ వార్డు బానోతు సైదులు, 2వ వార్డు తన్వీర్ హుస్సేన్ సయ్యద్, 6వ వార్డు చిలుముల సునీల్ రెడ్డి, 9వ వార్డు బండారు మంగమ్మ, 10వ వార్డు వెంకటి శేఖర్‌రెడ్డి, 12వ వార్డు కోడి నాగరాజు, 13వ వార్డు భూక్య కౌసల్య, 15వ వార్డు పిల్లల భవాని, 16వ వార్డు షేక్ జహీర్, 17వ వార్డు బైరబోయిన శ్రీదేవి, 18వ వార్డు వూర రామ్మూర్తి, 20వ వార్డు చెంచల మణిలత, 21వ వార్డు బోలగాని వీణ, 22వ వార్డు ఎల్గూరి అలివేలు, 23వ వార్డు వల్దాసు లక్ష్మి, 26వ వార్డు పాలగాని మాధవి, 28వ వార్డు సంద్రపాటి విజయ కుమార్, 29వ వార్డు రాపర్తి భవాని, 30వ వార్డు నామ అరుణ, 31వ వార్డు కొండపల్లి దిలీప్ రెడ్డి, 32వ వార్డు కుంభం రాజేంద్ర ప్రసాద్, 33వ వార్డు నాగుల శ్రీనివాస్, 35వ వార్డు జ్యోతి శ్రీవిద్య, 36వవార్డు షేక్ మన్సూర్‌బీ, 37వవార్డు బైరు శైలేందర్, 40వ వార్డు కొణతం రాజేష్ రెడ్డి, 41వ వార్డు యండి షఫి ఉల్లా, 44వ వార్డు గునగం టి హేమ, 46వ వార్డు మొరిశెట్టి నివేదిత, 47వ వార్డు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, 48వ వార్డు వెలుగు వెంకన్న.

**బిఆర్ఎస్ అభ్యర్థుల వివరాలు...**

3వ వార్డు పడిదల సైదులు, 4వ వార్డు భూక్య జ్యోతి, 5వ వార్డు ధరావత్ విజయ, 7వ వార్డు ఈదా ప్రవీణ్, 8వ వార్డు పోతురాజు ఇందుశ్రీ, 14వ వార్డు గాలి సాయికిరణ్, 34వ వార్డు తహీర్‌బీన్ మన్సూర్, 39వ వార్డు దంతాల సాయిప్రియ, 42వ వార్డు అంగిరేకుల నాగార్జున, 43వ వార్డు బత్తుల ఝాన్సీలక్ష్మి , 45వ వార్డు గండూరి పావని.

**బిజెపి అభ్యర్థి వివరాలు...**


19వ వార్డు పిడమర్తి కీర్తి.

**స్వతంత్ర అభ్యర్థులు...**

11వ వార్డు ఎల్గూరి ఇందిర, 24వ వార్డు మన్నెం అరుణ, 25వ వార్డు కోడి శిరీష, 27వ వార్డు చిరువెళ్ళ లక్ష్మి కాంతమ్మ, 38వ వార్డు గండూరి రమేష్.

# యాదాద్రిలో 'హస్త'గతం..

ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా!
సిపిఐ స్నేహం.. కాంగ్రెస్‌కి లాభం!
ముందస్తు జాగ్రత్త.. క్యాంపునకు అభ్యర్థులు!
చైర్మన్ రేసులో 'కీలక' నేతలు
ఆత్మరక్షణలో బిఆర్ఎస్, బిజెపిలు



ప్రజాపక్షం/యాదాద్రి : పురపాలక పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ తన హవాను చాటుకుంది. విపక్షాల వ్యూహాలను చిత్తు చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా సిపిఐతో జతకట్టడం కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. కమ్యూనిస్టుల మద్దతుతో హస్తం పార్టీ విజయం నల్లేరుపై నడకలా సాగగా.. జిల్లాలో 'కారు' వేగానికి ఓటర్లు బ్రేకులు వేశారు. అయితే, ఫలితాల వెల్లడికి ముందే గెలుపు గుర్రాలను కాపాడుకునేందుకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదగిరిగుట్ట, ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థులను క్యాంపుకు తరలించడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఆరు మున్సిపాలిటీల్లోనూ మ్యాజిక్ ఫిగర్‌ను దాటేయడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. అయితే, గెలిచిన వార్డు సభ్యులను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. ముఖ్యంగా చైర్మన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలో అప్పుడే పోటీ మొదలైంది. సీనియర్లు, యువ నాయకులు ఎవరికి వారు పైచేయి సాధించేందుకు అధిష్టానం వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**కాంగ్రెస్ ఏకపక్ష విజయం..**

జిల్లాలోని భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూరు, పోచంపల్లి మున్సిపాలిటీల్లో మొత్తం 104 వార్డులు ఉండగా.. రెండు వార్డులు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 102 స్థానాల్లో జరిగిన పోరులో కాంగ్రెస్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. కాంగ్రెస్ 64, బీఆర్ఎస్ 19, బిజెపి 12, స్వతంత్రులు 07, సిపిఐ 01, సిపిఎం 01 స్థానాలను కైవసం చేసుకున్నాయి.

**మున్సిపాలిటీల వారిగా వివరాలు ఇలా**

**భువనగిరి మున్సిపాలిటీ (35 వార్డులు):**
కాంగ్రెస్ 22, బీఆర్ఎస్ 4, బిజెపి 4, స్వతంత్రులు (ఇండిపెండెంట్) 5.

**చౌటుప్పల్ మున్సిపాలిటీ (20 వార్డులు):**
కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 3, బిజెపి 3, సిపిఐ(ఎం) 1.

**పోచంపల్లి మున్సిపాలిటీ (13 వార్డులు):**
కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బిజెపి 1, స్వతంత్రులు (ఇండిపెండెంట్) 1.

**యాదగిరిగుట్ట మున్సిపాలిటీ (12 వార్డులు):**
కాంగ్రెస్ 8, బిజెపి 2, బీఆర్ఎస్ 1, సిపిఐ 1.

**మోత్కూర్ మున్సిపాలిటీ (12 వార్డులు):**
కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, స్వతంత్రులు (ఇండిపెండెంట్) 1.

**ఆలేరు మున్సిపాలిటీ (12 వార్డులు):**
కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 3, బిజెపి 2.

**సిపిఐ స్నేహం.. కాంగ్రెస్‌కి లాభం!**

జిల్లాలో సంప్రదాయ ఓటు బ్యాంకు కలిగిన సిపిఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వ్యూహాత్మకంగా ఫలించింది. వామపక్ష ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్ అభ్యర్థులకు పడటంతో మెజారిటీ స్థానాల్లో హస్తం పార్టీ అభ్యర్థులు భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ముఖ్యంగా చౌటుప్పల్, ఆలేరు, మోత్కూరు యాదగిరిగుట్ట వంటి ప్రాంతాల్లో ఈ పొత్తు విజయానికి బలమైన పునాది వేసింది.

**ముందస్తు జాగ్రత్త.. క్యాంపునకు అభ్యర్థులు!**

ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే, ప్రత్యర్థి పార్టీల నుంచి ప్రలోభాలు ఉండవచ్చన్న ముందస్తు అంచనాతో ఆలేరు ఎమ్మెల్యేలు అయిలయ్య, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అప్రమత్తమయ్యారు. ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ పరిధిలోని పార్టీ అభ్యర్థులను రహస్య ప్రాంతానికి తరలించి క్యాంపు నిర్వహించారు. కౌంటింగ్ ముగిసి విజయం సాధించిన తర్వాత ధృవీకరణ పత్రాలు తీసుకోవడం కోసం అభ్యర్థులను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి తిరిగి అక్కడి నుంచి క్యాంపులకు తరలించారు.

**చైర్మన్ రేసులో 'కీలక' నేతలు**

మున్సిపాలిటీలో స్పష్టమైన మెజారిటీ రావడంతో ఇప్పుడు అందరి దృష్టి 'చైర్మన్' పీఠంపై పడింది. భువనగిరిలో తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, పోతంశెట్టి మంజుల వెంకటేష్, గుర్రాల సంతోష్ శ్రీనివాస్, బర్రె పూజిత జహంగీర్, తోటకూర విజయ లక్ష్మి వెంకటేశం, కుక్కదువు పద్మ సోమయ్యలు చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. యాదగిరిగుట్టలో గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, మోత్కూర్‌లో గడ్డం స్వప్న నరసయ్య, మెంట రమణ నగేష్, కురుమిళ్ళ ప్రమీల రాములు, చౌటుప్పల్‌లో కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బత్తుల వాణి విప్లవ కుమార్, మోగుదాల పావని రమేష్‌లు పోటీ పడుతున్నారు. అదేవిధంగా పోచంపల్లిలో తడక వెంకటేశ్వర్లు, ఆలేరులో ఎమ్మెల్యే బీలైలే బంధువు బిజీని బాలమణికి దాదాపు పుర పీఠాలు ఖరారు అయినట్టు తెలుస్తున్నది. చైర్మన్ పదవి తమకే దక్కాలని వారు తమ గాడ్ ఫాదర్ల ద్వారా పైస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో బీఆర్ఎస్, బిజెపిలు ఆత్మరక్షణలో పడ్డాయి. అధికార బలం, పొత్తుల వ్యూహం ముందు విపక్షాల ఎత్తుగడలు పారలేదు. మొత్తానికి యాదాద్రి గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతోంది.

**అధిష్ఠానమే సుప్రీం : బీర్ల ఐలయ్య**

ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటడంతో పురపీఠంపై కన్నేసిన నాయకులు ఎవరికి వారుగా చైర్మన్ పదవి కోసం లాబీయింగ్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సామాజిక సమీకరణల ఆధారంగా చైర్మన్ అభ్యర్థిని అధిష్ఠానమే నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా, చివరికి అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి గెలిచిన అభ్యర్థులందరూ కట్టుబడి ఉండాలని ఆయన ఆదేశించారు. పార్టీ క్రమశిక్షణను గౌరవించి, నిర్ణయించిన అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఉత్కంఠ పోరులో

# యుఎఇ విజయం



### కెనడాకు రెండో ఓటమి!

టి–20 ప్రపంచకప్‌లో యుఎఇ బోణీ కొట్టింది. ఢిల్లీలో నువ్వానేనా అన్నటు సాగిన ఉత్కంఠ పోరులో కెనడాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట జునైద్ సిద్ధిఖీ(535) వికెట్ల వేటతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా.. ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్), సొహైబ్ ఖాన్(51)లు అర్ధ శతకంతో జట్టును గెలిపించారు. ఆఖరి ఓవర్లో సొహైబ్ ఔటైనా.. అర్ఫాన్ సింగిల్ తీయడంతో యుఎఇ డకౌట్‌తో సంబురాలు మొదలయ్యాయి. వరుసగా రెండో ఓటమితో కెనడా సూపర్ 8 అవకాశాల్ని సంక్లిష్టం చేసుకుంది. గ్రూప్ డిలోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కొద్దిలో ఓటమి తప్పించుకుంది. తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో చిత్తు చిత్తుగా ఓడిన అరబ్ జట్టు.. రెండో మ్యాచ్‌లోనూ అతికష్టం మీద గట్టెక్కింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జునైద్ సిద్ధిఖీ(535) పంజా విసరగా కెనడాను 150కే కట్టడి చేసిన యుఎఇ.. ఛేదనలో మాత్రం తడబడింది. ఒకదశలో నాలుగు ప్రధాన వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. మరో వికెట్ పడి ఉంటే ఆ జట్టు ఓటమి ఖాయమయ్యేది. కానీ, ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్), సొహైబ్ ఖాన్(51)లు పట్టుదలతో నిలబడి గెలుపునందించారు.

**66కే నాలుగు వికెట్లు...** కెనడా నిర్దేశించిన 151 పరుగుల ఛేదనలో సహచరులు వెనుదిరిగినా ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ(74 నాటౌట్) క్రీజునంటుకుపోయాడు. కానీ, సాద్ బిన్ జఫర్(314) చెలరేగంతో 66కే నాలుగు వికెట్లు కోల్పోయింది యుఎఇ. ఆ దశలో మరో వికెట్ పడి ఉంటే మ్యాచ్ చేజారేది. అయితే.. సొహైబ్ ఖాన్(51)తో కలిసి ఆర్యన్ష్ ఇన్నింగ్స్ నిర్మించాడు. ప్రత్యర్థి బౌలర్లను విసిగిస్తూ.. బౌండరీలతో స్కోర్ బోర్డును నడిపించారిద్దరూ. ఐదో వికెట్‌కు ఆఖరి ఓవర్లో సొహైబ్ ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. మూడు బంతుల్లో ఒక పరుగు అవసరమవ్వగా.. అర్ఫాన్ సింగిల్ తీసి గెలిపించాడు. ఐదు వికెట్ల తేడాతో నెగ్గిన యుఎఇ పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో జట్టు విజయంలో భాగమైన జునైద్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

## టి20 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్

# జింబాబ్వే సంచలన విజయం




**కొలంబో:** టి–20 వరల్డ్ కప్‌లో సంచలన విజయం నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీస్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి. జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్షా 65, మ్యాక్స్వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్బానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్లో కేవలం 29 రన్స్కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్వెల్, రెన్షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

## చిన్న జట్లకు పెద్ద షాక్..

### వరల్డ్ కప్ మొత్తానికి దూరమైన కీలక ఆటగాళ్లు!



పొట్టి ప్రపంచకప్ లీగ్ దశ మ్యాచ్‌లో ఉత్కంఠ రేపుతున్న వేళ.. పలు జట్లు కీలక ఆటగాళ్లను కోల్పోతున్నాయి. గాయాలు వెంటాడుతుండడంతో ఒక్కొక్కరు టోర్నీ నుంచి వైదొలుగుతున్నారు. బోణీ కోసం నిరీక్షిస్తున్న ఐర్లాండ్.. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ సేవల్ని కోల్పోనుంది. లీగ్ దశ తొలి మ్యాచ్‌లో గాయపడిన స్టిర్లింగ్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఆస్ట్రేలియాపై సంచలన విజయంతో సూపర్ 8 రేసులో నిలిచిన.. జింబాబ్వేకు సీనియర్ ఆటగాడు బ్రెండన్ టేబెండన్ అందుబాటులో ఉండడం లేదు. భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న పురుషుల టి–20 ప్రపంచకప్ నుంచి పలువురు ఆటగాళ్లు అనూహ్యంగా నిష్క్రమిస్తున్నారు. ఇప్పటికే భారత పేసర్ హర్షిత్ రానా.. శ్రీలంక క్రికెటర్లు ఇషాన్ మలింగ, వనిందు హసరంగలు గాయాలతో వైదొలగగా.. మరో ఇద్దరూ టోర్నీకి దూరమయ్యారు. ఐర్లాండ్ కెప్టెన్ పాల్‌స్టిర్లింగ్, జింబాబ్వే వెటరన్ ప్లేయర్ బ్రెండన్ టేబెండన్ సైతం ఇంటి బాట పట్టారు. ఫిబ్రవరి 11న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా స్టిర్లింగ్ గాయపడ్డాడు. స్కానింగ్ పరీక్షల్లో అతడి ఎడమ మోకాలి లిగమెంట్ దెబ్బతిన్నట్టు గుర్తించారు. దాంతో.. స్టిర్లింగ్ వరల్డ్‌కప్ మొత్తానికి దూరమవుతున్నాడు. సుదీర్ఘ నిషేధం తర్వాత జింబాబ్వే జట్టులోకి వచ్చిన రిటైర్ట్ హర్డా 40 ఏళ్ల ప్రస్థానం కూడా ముగిసింది. లీగ్ దశలో ఒమన్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా అతడు కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. స్కానింగ్ పరీక్షలు జరపగా.. కోలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. శుక్రవారం ఆస్ట్రేలియాతో టాస్‌కు ముందు కెప్టెన్ సికిందర్ రజా మాట్లాడుతూ.. ఇంకా కోలుకోలేదని, అతడు మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని చెప్పాడు.


## సైన్స్

# గతంలోకి అడుగు!



టైమ్ మిషన్లను, గతంలోకి వెళ్లి రావడాలను కథల్లో చదివాం.. సినిమాల్లో చూశాం.. కానీ, అలాంటి ప్రయోగమే జరిగిందని, శాస్త్రవేత్తలు ఒక సెక కాలం వెనక్కు వెళ్లగలిగారని వార్తలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఇది పూర్తి అసత్యం కాకపోయినప్పటికీ, అత్యధిక శాతం అభూత కల్పన. ఈ ప్రయోగానికి సంబంధించి, 'కాలంలో వెనక్కి వెళ్లడం' అనే మాటను శాస్త్రీయంగా చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఇది సినిమాల్లో చూపించే టైమ్ మెషిన్ లాంటి భావన కాదు, నిజంగా మనుషులు లేదా వస్తువులు గతానికి ప్రయాణించడం కూడా కాదు. ఇది కేవలం క్వాంటం స్థాయిలో ఒక వ్యవస్థ స్థితిని మునుపటిలా తిరిగి పునరుద్ధరించడం మాత్రమే. ఇటీవల శాస్త్రవేత్తలు ఒక ఆసక్తికరమైన ప్రయోగాన్ని నిర్వహించారు. వారు క్వాంటం కంప్యూటర్‌ను ఉపయోగించి ఒక కణం లేదా చిన్న క్వాంటం వ్యవస్థలో జరిగిన మార్పులను పూర్తిగా రివర్స్ చేసి, దాన్ని సుమారు ఒక సెకను క్రితం ఉన్న స్థితికి తీసుకువచ్చారు. ఇది నిజంగా కాలాన్ని వెనక్కి తిప్పడం కాదు. కానీ ఆ వ్యవస్థ కాలక్రమంలో ఎలా మారిందో, ఆ మార్పులన్నింటినీ గణితపరంగా రద్దు చేసి, ప్రారంభ స్థితిని తిరిగి పొందారు. ఇది ఎలా సాధ్యమయ్యిందంటే, క్వాంటం కంప్యూటర్లలో ఉపయోగించే క్విబిట్స్‌ను అత్యంత ఖచ్చితంగా నియంత్రించగలగడం వల్ల. సాధారణంగా క్వాంటం వ్యవస్థలు కాలంతో పాటు బాహ్య ప్రభావాల వల్ల చెడిపోతాయి. దీనిని డీకోహిరెన్స్ అంటారు. ఈ ప్రయోగంలో శాస్త్రవేత్తలు ఒక ప్రత్యేకమైన అల్గోరిథమ్‌ను రూపొందించి, క్విబిట్స్ ముందుకు ఎలా పరిణామం చెందా యో, అదే క్రమాన్ని అచ్చంగా వెనక్కి నడిపించా రు. అంటే వ్యవస్థ చేసిన ప్రతి చిన్న మార్పును ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ, దానిని గత స్థితికి తీసుకువచ్చారు. మన రోజువారీ ప్రపంచానికి వర్తించే క్లాసికల్ ఫిజిక్స్‌లో ఇది అసాధ్యం. ఒకసారి గ్లాస్ పగిలితే, అది సహజంగా తిరిగి కలిసిపోదు. కానీ క్వాంటం మెకానిక్స్‌లో కణాలు సంభావ్యత తరంగాలుగా ప్రవర్తిస్తాయి. ఆ స్థాయిలో ఉపయోగించే సమీకరణాలు చాలావరకు టైమ్‌రివర్సిబుల్‌గా ఉంటాయి, అంటే గణితపరంగా వెనక్కి నడిపించవచ్చు. ఇక్కడ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, కాలాన్ని తిరగరాయలేదు, విశ్వాన్ని వెనక్కి తిప్పలేదు. కేవలం ఒక చిన్న క్వాంటం వ్యవస్థలో జరిగిన పరిణామాన్ని నియంత్రించి రద్దు చేశారు. అయినా దీని ప్రాముఖ్యత తక్కువ కాదు. భవిష్యత్ క్వాంటం కంప్యూటర్లలో జరిగే తప్పులను సరిచేయడానికి, బలహీనమైన క్విబిట్స్‌ను స్థిరంగా ఉంచడానికి, మరింత ఖచ్చితమైన గణనలను సాధించడానికి ఇది కీలకంగా మారవచ్చు. అంతేకాదు, కాలం మనకు ఎందుకు ఒకే దిశలో ప్రవహిస్తున్నట్లు అనిపిస్తుంది, కానీ క్వాంటం ప్రపంచంలో ఎందుకు భిన్నంగా ప్రవర్తించగలుగుతుంది అనే లోతైన ప్రశ్నలకు కూడా ఇది సంకేతాలు ఇస్తోంది.

## భూమిని మించిన గురుత్వాకర్షణ



చైనా అభివృద్ధి చేసిన హైపర్‌గ్రావిటీ సెంట్రిఫ్యూజ్ విప్లవం ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగంలో ఒక కీలక మలుపుగా పేర్కొంటున్నారు. 2025 చివరి, 2026 ప్రారంభంలో హంగ్జౌ నగరంలో ఏర్పాటు చేసిన సెంట్రిఫ్యూగల్ హైపర్‌గ్రావిటీ అండ్ ఇంటర్‌డిసిప్లినరీ ఎక్స్‌పెరిమెంట్ ఫెసిలిటీ (సిహెచ్‌ఐఇఎఫ్–ఛీఫ్) కేంద్రం, భూమి గురుత్వాకర్షణను ప్రయోగశాలలోనే వేల రెట్లు పెంచి అధ్యయనం చేయగలిగిన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది ఇప్పటివరకు ప్రపంచంలో ఎక్కడా లేని స్థాయిలో శక్తివంతమైన సదుపాయం. సాధారణంగా భూమిపై మనం అనుభవించే గురుత్వాకర్షణను 1జి అని పిలుస్తారు. కానీ ఛీఫ్‌లో ఉన్న భారీ సెంట్రిఫ్యూజ్ యంత్రం దాదాపు 2,000 రెట్లు ఎక్కువ గురుత్వ శక్తిని (2000జి) సృష్టించగలదు. అంటే, జూపిటర్ వంటి భారీ గ్రహాల లోతైన అంతర్గత భాగాల్లో లేదా భూమి అంతర్భాగంలో ఉండే తీవ్ర ఒత్తిడి, బరువు పరిస్థితులను చిన్న ప్రయోగశాలలోనే అనుకరించడం సాధ్యమవుతుంది. ఇది సమయం, స్థలాన్ని సంకోచించడం లాంటి శాస్త్రీయ అవకాశం కల్పిస్తుంది.సాధారణంగా దశాబ్దాలు పట్టే ప్రక్రియలను కొన్ని నిమిషాల్లో లేదా గంటల్లో పరిశీలించవచ్చు. ఈ కేంద్రంలో రెండు ముఖ్య దశలు ఉన్నాయి. మొదటి దశ ఛీఫ్1300, ఇది సుమారు 300 గ్రావిటీల శక్తితో 20 టన్నుల లోడ్‌ను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంది. ఇది ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద హైపర్‌గ్రావిటీ సెంట్రిఫ్యూజ్‌గా గుర్తింపు పొందింది.

## విశ్వంతో మెదడుకు సంబంధం!



మెదడు విశ్వంతో అనుసంధానమై ఉంటుందా? రెంటికీ సంబంధం ఉందా? క్వాంటమ్ సిద్ధాంతంలో అవును అనే సమాధానం చెప్పాలి. క్వాంటమ్ స్కేల్‌లో మెదడువిశ్వం లింక్పరిశోధకులు మానవ మెదడు, విశ్వం మధ్య క్వాంటమ్ స్థాయిలో సంబంధం ఉండవచ్చని ప్రతిపాదించారు. న్యూరల్ మైక్రోస్ట్రక్చర్‌ల్లో కనుగొన్న ప్యాటర్న్‌లు స్పేస్, సబ్‌ఆటామిక్ కణాల్లో కనిపించే క్వాంటమ్ భావాలతో సమానంగా ఉన్నాయి. ఇది మెదడును కేవలం బయాలజికల్ మెషిన్‌గా కాకుండా, క్వాంటమ్ ఫిజిక్స్ ప్రభావిత వ్యవస్థగా చూపిస్తుంది. మన ఆలోచనలు కేవలం ఎలక్ట్రికల్ సిగ్నల్స్ కాకుండా, నక్షత్రాలు, గెలాక్సీలు, స్పేస్‌టైమ్‌ను ఆకారం చేసే చట్టాలను ప్రతిబింబించే లోతైన ప్రక్రియలు కావచ్చని తాజా ప్రతిపాదన పేర్కొంటున్నది. డెకేడ్లుగా న్యూరాన్ ఫైరింగ్‌తో చెందిన చైతన్యం ఊహ ఇక్కడ సరిపోతుంది. క్వాంటమ్ స్థాయిలో మెదడు రియాలిటీతో సంభాషిస్తే, చైతన్యం, ప్రత్యక్షభావం, సృజనాత్మకత వివరణకు సహాయపడుతుంది. ఈ పరిశోధన మెదడు ఆరోగ్యం, కృత్రిమ మేధ (ఎఐ), న్యూరాలజికల్ డిసార్డర్స్‌కు కొత్త విధానాలను పరిచయం చేస్తున్నది. మెదడు కాస్మిక్ సిస్టమ్స్‌ను ప్రతిబింబిస్తుందని తెలిస్తే, సహజ చట్టాలతో సామరస్యంగా పనిచేసే టెక్నాలజీలు వస్తాయి. మనం విశ్వాన్ని కేవలం చూడటమే కాకుండా, దానితో లోతుగా కుదుర్చబడి ఉన్నామనే ఈ ఆలోచన మనలను కొత్తగా చూడమని ఆహ్వానిస్తుంది.

# మునిసి'పోల్'లో సిపిఐ అభ్యర్థుల విజయం





### ఖమ్మంలో నాలుగు స్థానాల్లో సిపిఐ అభ్యర్థుల విజయకేతనం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో మూడు స్థానాల్లో, వైరా మున్సిపాలిటీలోని 15వ వార్డులో సిపిఐ విజయం సాధించాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నుంచి నల్లమోతు శైలజ విజయం సాధించారు. ఇక్కడ రెండుసార్లు రీకౌంటింగ్ నిర్వహించి అధికార పార్టీ సిపిఐ అభ్యర్థి విజయాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించారు. రీ కౌంటింగ్ నిర్వహించిన ప్రతిసారి సిపిఐ అభ్యర్థికి ఓట్లు పెరుగుతూ రావడం గమనార్హం. ఏదులాపురం మున్సిపాలిటీలోని 32, 30, 28 వార్డుల్లో సిపిఐ విజయం సాధించింది. 28వ వార్డు నుంచి దండి రంగారావు, 32వ వార్డు నుంచి ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, 30వ వార్డు నుంచి యువ న్యాయవాది, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కుమార్తె దండి శ్రీజ విజయం సాధించారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

### ఉత్కంఠ పోరులో సిపిఐ అభ్యర్థిని నల్లమోతు శైలజ..

**వైరా :** వైరా మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ ఫలితం ఉత్కంఠభరితంగా సాగింది. సిపిఐ అభ్యర్థిని నల్లమోతు శైలజ కాంగ్రెస్ అభ్యర్థిని రాంపూడి రాజ్యలక్ష్మి పై తొలుత 13 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఓట్లలో వ్యత్యాసం ఉందని అనడంతో మరోసారి ఓట్లు లెక్కించగా సిపిఐకి మరో రెండు ఓట్లు పెరిగాయి. దీంతో సిపిఐ 15 ఓట్లతో మెజారిటీ వచ్చింది. అయితే సిపిఐ అభ్యర్థిని నల్లమోతు శైలజ గెలుపు ప్రకటించకుండా ఉత్కంఠతకు తెరలేపారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా నాయకులు గోవిందరావు, ఎర్ర బాబు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, దొండపాటి రమేష్, యామాల గోపాలరావు, టిఆర్ఎస్ నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలో జరుగుతున్న పరిణామాలను బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు సాంబశివ రావు దృష్టికి తీసుకుపోవడంతో పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు కూనంనేని వివరించారు. అనంతరం కొద్దిసేపటికే అధికారులు నల్లమోతు శైలజ 18 ఓట్ల మెజారిటీతో గెలిచిందని ప్రకటించారు. దీంతో సిపిఐ, సిపిఎం, బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

### 228 ఓట్ల మెజార్టీతో సిపిఐ అభ్యర్థి గెలుపు

**హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు సిపిఐ అభ్యర్థిగా చెన్నగాని సైదులుగౌడ్ 228 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి పార్టీలపై ఘన విజయం సాధించారు. సాధారణ సిపిఐ కార్యకర్తగా వివిధ భాగాలలో వివిధ హోదాలలో పనిచేస్తున్న చెన్నగాని సైదులు గౌడ్ ప్రజలతో ఉన్న అనుబంధంతో అత్యధిక మెజార్టీతో గెలిచి సత్తా చాటారు. చెన్నగాని సైదులుకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

### చండూరు మున్సిపాలిటీ 4వ వార్డులో సిపిఐ అభ్యర్థి జెల్ల ధనమ్మ శ్రీనివాస్

**చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో వెలుబడిన ఫలితాలలో 4వ వార్డులో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని జెల్ల ధనమ్మ శ్రీనివాస్ 136 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వార్డులో మొత్తం 1259 ఓట్లు ఉండగా 4 అభ్యర్థులు పోటీ చేయగా సిపిఐ, బిఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. సిపిఐ అభ్యర్థిని జెల్ల ధనమ్మ 625 ఓట్లు సాధించారు. ఈ సందర్భంగా జెల్ల ధనమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు కౌన్సిలర్ టికెట్ ఇచ్చి గెలిపించిన సిపిఐ, కాంగ్రెస్ నాయకులకు, ఓట్లు వేసి గెలిపించిన వార్డు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

### కోదాడ మునిసిపాలిటీలో...

**కోదాడ :** సూర్యాపేట జిల్లా కోదాడ మునిసిపాలిటీ ఫలితాల్లో రెండో వార్డులో సిపిఐ అభ్యర్థి రాయపూడి కాటమరాజు విజయం సాధించారు. ప్రత్యర్థి బిఆర్ఎస్ అభ్యర్థి బోడ చంద్రమోహన్‌పై 88 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వార్డులో మొత్తం 1603 ఓట్లు పోల్‌కాగా కాటమరాజుకు 812 వచ్చాయి. ఈసందర్భంగా కాటమరాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ఓటర్లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. తన విజయానికి కారణమైన సిపిఐ, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

### యాదగిరిగుట్ట 12వ వార్డులో..

**యాదాద్రి :** యాద్రాద్రి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీ ఫలితాల్లో 12వ వార్డులో పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి బబ్బూరి శ్రీధర్ విజయం సాధించారు.

### క్యాతనపల్లిలో నలుగురు సిపిఐ అభ్యర్థులు

**రామకృష్ణాపూర్ :** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ, బిఆర్ఎస్ పొత్తు విజయకేతనం ఎగురవేసింది. మొత్తం 22 వార్డులకు బిఆర్ఎస్ 15 వార్డుల్లో పోటీ చేసి 10 స్థానాల్లో విజయం సాధించగా, 7 వార్డుల్లో పోటీ చేసిన సిపిఐ 4 స్థానాలను కైవసం చేసుకుంది. సిపిఐ తరపున విజయం సాధించిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. 1వ వార్డు నుంచి కౌడగొని సాంబయ్య, 6వ వార్డు నుంచి శంకరయ్య, 8వ వార్డు నుంచి మీనుగు మునీ, 22వ వార్డు నుంచి మిట్టపల్లి సరిత గెలుపొందారు.

### భూపాలపల్లి 24వ వార్డులో వేముల జ్యోతి శ్రీకాంత్

**భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీలో 24 వార్డు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన వేముల జ్యోతి శ్రీకాంత్ ఘనవిజయం సాధించారు. వేముల జ్యోతి శ్రీకాంత్ ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిగా, సిపిఐ జిల్లా సమితి సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా వేముల జ్యోతి శ్రీకాంతులను పార్టీ నాయకులు అభినందించారు.

### మానుకోటలో మూడు స్థానాల్లో...

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు. 33వ వార్డులో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజయం సాధించగా 18వ వార్డులో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ గెలుపొందారు. 25వ వార్డులో నర్రా సంధ్య శ్రావణ్ గెలుపొందారు. కౌటింగ్ అనంతరం సిపిఐ కార్యాలయం వీరభవన్ నుంచి సిపిఐ కార్యకర్తలు గెలుపొందిన అభ్యర్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.అజయ్ సారథి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని, సిపిఐ అభ్యర్దులను గెలిపించి ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ మానుకోట అభివృద్దిలో సిపిఐ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పెరుగుకుమార్, నర్రా శ్రావణ్, మామిండ్ల సాంబలక్ష్మి , చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, బానోత్ లింగ్యానాయక్, గార రవిచంద్ర బోస్,వరిపెల్లి వెంకన్న, కేదాసు రమేష్, అజ్మిర వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి పోరులో సత్తా చాటిన సిపిఐ



**ప్రజాపక్షం/ఖమ్మం:** ఏదులాపురం మున్సిపాలిటీలో ఒంటరి పోరుతో సిపిఐ సత్తా చాటింది. బలమైన పునాది కలిగిన ఈ ప్రాంతంలో సిపిఐని ఓడించేందుకు ప్రయత్నించారు. గతంలో ఏదులాపురం గ్రామ పంచాయతీ సిపిఐకి పెట్టని కోటగా ఉంది. ఏదులాపురం పంచాయతీతో పాటు సిపిఐఎం నేత తమ్మినేని వీరభద్రం స్వగ్రామం తెల్దారుపల్లి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా స్వగ్రామం ముత్తగూడెంతో పాటు పలు గ్రామాలను కలిపి మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. ఏదులాపురం పాత పంచాయతీ పరిధిలోని ఐదు స్థానాల్లో సిపిఐ పోటీ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీతో జరిపిన చర్చల్లో పాత పంచాయతీ పరిధిలోని స్థానాల్లో సిపిఐకి అవకాశం కల్పించాలని కోరింది. కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేసినట్లే చేసి ఒంటరిని చేసి సిపిఐని దెబ్బతీయాలని ప్రయత్నించింది. సిపిఐ ఒంటరిగా బరిలోకి దిగి ఐదింటిలో మూడు స్థానాల్లో విజయం సాధించింది. సిపిఐకి చెందిన దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ విజయం సాధించగా మరికొన్నింటిలో పోరాడి ఓటమి చెందింది. మూడు మినహా మిగిలిన స్థానాల్లో సిపిఐ ఓటమికి అపవిత్ర పొత్తులే కారణమయ్యాయి. ముత్తగూడెం పరిధిలోని 20, 21 వార్డుల్లో సిపిఐఎం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేసి సిపిఐ అభ్యర్థులను ఓడించాయి. సిపిఐఎం బిఆర్ఎస్‌తో పొత్తులో ఉన్నప్పటికీ తెల్దారుపల్లిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతునిచ్చి ఒక వార్డును ఏకగ్రీవం చేసింది. ముత్తగూడెంలో బహిరంగంగానే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఇక్కడ బిఆర్ఎస్ మిగిలిన చోట్ల కాంగ్రెస్‌తో పోటీపడిన సిపిఐ పోటీచేసిన ప్రత్యక్షంగానో పరోక్షంగానో కాంగ్రెస్ పార్టీకి సహకరించింది. ఒంటరిగా బరిలోకి దిగిన సిపిఐ మూడు పార్టీలను ఏదులాపురం మునిసిపాలిటీలో ఢీకొని సత్తా చాటింది.

# చండూరును అభివృద్ధి చేసి చూపుతాం

### విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీని హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. చండూరు మున్సిపాలిటీని కాంగ్రెస్, సిపిఐ కూటమి కైవసం చేసుకోవడంతో శుక్రవారం చండూరు పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీ అనంతరం ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్, సిపిఐ కూటమిపై నమ్మకంతో 10వార్డులో 7 వార్డులలో కాంగ్రెస్, సిపిఐ మిత్రపక్షాల కూటమి అభ్యర్థులను గెలిపించినందుకు పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న 3 సంవత్సరాల కాలంలో చండూరు పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి చూపించే బాధ్యత నాదే అన్నారు. చండూరులో అనేక సమస్యలు ఉన్నాయని సమస్యలే ఎజెండా మున్సిపాలిటీ మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. చండూరు పట్టణాన్ని కడుపులో పెట్టుకుంటానని గెలిచిన ఏడుగురు వార్డు కౌన్సిలర్ల తరుపున మాటిస్తున్నానంటూ ఎవరికి కష్టం వచ్చిన మీలో కుటుంబ సభ్యుడు ఉంటానని హామీ ఇచ్చారు. చండూరు పట్టణంలో ఇండ్లు లేని పేదవారిని గుర్తించి ప్రతి వార్డుకు 50మంది చొప్పున ఇండ్లు కట్టిస్తానన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో సిపిఐ, కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించిన చండూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా సాగితే నియోజకవర్గంలో తిరుగుండదన్నారు. చండూరు మున్సిపాలిటీలో నాల్గవ వార్డు సిపిఐ కౌన్సిలర్‌గా జెల్ల ధనమ్మశ్రీనివాస్‌ను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు డిండి, ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు, శివన్నగూడెం రిజర్వాయర్‌ను పూర్తి చేయించి రైతాంగానికి సాగు, తాగు నీరు అందిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో పరస్పర సహకారంతో సాగుతూ అభివృద్ధి చేస్తామన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో డిసిసిబి మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కోడి శ్రీనివాసులు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, కోడి గిరిబాబు, కోడి వెంకన్న, నూతనంగా గెలిచిన వార్డు కౌన్సిలర్లు, సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
14-02-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD



## సిపిఐ సభ్యత్వ నమోదు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** శతాబ్ది ఉత్సవాలు చేసుకొన్న విప్లవ పార్టీ సిపిఐ ఎప్పటి మాదిరిగానే ప్రజా పోరాటాలతో ప్రజల వెన్నంటి ఉంటుందని సిపిఐ శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేందర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దమ్మ కాలనీలో ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులందరూ పార్టీ నిర్మాణానికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, పుట్ట మనమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి పురపాలిక విజేతల్లో ముగ్గురూ లతలే



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :**మేడ్చల్ జిల్లాలో జరిగిన మూడుచింతలపల్లి పురపాలిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసిన మహిళా అభ్యర్థుల్లో ముగ్గురూ లత పేరిటే ఉండటం ఆసక్తికరంగా మారిం ది. 8వ వార్డు కౌన్సిలర్‌గా దోసకాయల లత, 9వ వార్డు కౌన్సిలర్‌గా పెద్దిరెడ్డి శ్రీలత, 21వ వార్డు కౌన్సిలర్‌గా రాజిగెళ్ల లతలు ఎన్నికయ్యారు. ఐదేళ్ల పాటు కొనసాగే ఈ పురపాలిక సమావేశాల్లో ఒకే పేరుతో ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు రికార్డు సృష్టించనున్నారు.



## మూడుచింతలపల్లిలో బిఆర్‌ఎస్ మెజారిటీ

* హంగ్ దిశగా ఎల్లంపేట, ఆలియాబాద్ మున్సిపాలిటీలు
* విజేతలకు ధృవీకరణ పత్రాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పురపాలిక సంఘ ఎన్నికల ప్రక్రియ చివరి అంకంగా మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు సంబంధించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ శుక్రవారం ఎన్నికల కౌటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ ఎన్నికల్లో మూడుచింతలపల్లి పురపాలికని బిఆర్‌ఎస్ పార్టీ 24 వార్డులకు గాను 14 స్థానాలను దక్కించుకొని స్పష్టమైన మెజారిటీతో తిరుగులేని ఆధిక్యం సాధించింది. మిగిలిన ఎల్లంపేట, ఆలియాబాద్ పురపాలికల్లో మాత్రం ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాక పోవటంతో ఇతరుల సహకారంతో హంగ్ దిశగా చైర్మన్ స్థానాన్ని పొందటానికి ఎవరికి వారు యత్నిస్తున్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో కాంగ్రెస్ 9, బిఆర్‌ఎస్ 14, బిజెపి ఒక స్థానం, ఎల్లంపేట మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో కాంగ్రెస్ 8, బిఆర్‌ఎస్ 12, బిజెపి 4, ఆలియాబాద్ మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ 8, బిఆర్‌ఎస్ 7, బిఎస్పీ నుండి ఒకరు, సంతంత్ర అభ్యర్థి ఒకరు గెలుపొందారని, వారికి విజేతలుగా ధృవీకరణ పత్రాలను అందచేసామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.

## ఇది ప్రజా విజయం... నీరజ బాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:**మున్సిపల్ ఎన్నికల్లో వరుసగా కౌన్సిలర్‌గా విజయం సాధించిన నీరజ బాల్‌రెడ్డి మరోసారి హ్యాట్రిక్ సాదించారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నీరజ బాల్‌రెడ్డి తమ సమీప బిజెపి అభ్యర్థిపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. అంతకు ముందు బిఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా రెండు మార్లు విజయం సాధించిన నీరజ బాల్‌రెడ్డి వరుసగా ఈ సారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మూడోసారి విజయం సాధించిన హ్యాట్రిక్ విజయాన్ని సొంత చేసుకున్నారు. కాగా మరో కౌన్సిలర్ అబ్దుల్ రజాక్ వరుసగా మూడోసారి విజయం సాధించిన హ్యాట్రింక్ కోట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రజా విజయమన్నారు. తమపై ఎంతో నమ్మకంతో మూడోసారి కౌన్సిలర్‌గా గెలిపించడం పట్ల వార్డు ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటి చైర్మన్ టి.వెంకటేష్ శర్మ దంపతులు తొలిరోజు నిర్వహించిన గణపతి పూజతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. యాగశాల ప్రవేశం, అఖండ జ్యోతి ప్రతిష్టాపన తదితర పూజలు జరిగాయి. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వారికి నిర్వహించిన క్రీడా పోటీలు భక్తులను అలరించాయి. ఈ నెల 18 వరకు ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన ఏర్పాటు చేసే విధంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రభుత్వ శాఖాధికారులతోపాటు ఆలయ నిర్వాహకులను దిశానిర్దేశం చేసారు.



# పోలీస్ స్టేషన్‌లో సజ్జనార్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జిఐఎ)లోని పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని జనరల్ డైరీ, రిసెప్షన్ రిజిస్టర్లు, పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లు, విచారణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పనితీరు ను సమీక్షించిన అనంతరం, సమర్థత, సమన్వయాన్ని పెంచేందుకు సిబ్బందికి కమిషనర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బాధితుల నుండి వచ్చే ప్రతి పిటిషన్‌పై విచారణాధికారు లు సమగ్ర నివేదికలు రూపొందించాలని, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన కేసుల్లో వేగం గా స్పందించేందుకు వీలుగా, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాల ఎస్‌హెచ్‌ఒల తాజా సంప్రదింపు వివరాలను స్టేషన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా మరియు సంబంధిత నేరాలను అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, పక్కా సమాచారంతో నిందితులను పట్టుకోవాల ని స్పష్టం చేశారు. విమానాశ్రయంలో మద్యం మత్తులో హల్చల్ చేసేవారు, మహిళా ప్రయాణికుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటువంటి వ్యక్తులను 'బ్లాక్ లిస్ట్'లో పెట్టేందుకు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో శంషాబాద్ డిసిపి బి.రాజేష్, ఎసిపి శ్రీకాంత్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ కనకయ్య సంపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట, ఆలియాబాద్ మున్సిపాలిటీల్లో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ యత్నాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ పక్క తన అధికారాన్ని పోగొట్టుకొన్న బిఆర్‌ఎస్ పార్టీలు పోటాపోటీగా దక్కించుకొనేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేసినప్పటికి 1మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి పురపాలికను బిఆర్‌ఎస్ స్పష్టమైన మెజారిటీతో కైవసం చేసుకోగా ఎల్లంపేట, ఆలియాబాద్ మున్సిపాలిటీల్లో ఏ ఒక్క పార్టీకి చైర్మన్ స్థానం దక్కించుకొనే విధంగా మెజారిటీ స్థానాలు రాకపోవటంతో ఇతరుల కల్సి హంగ్ దిశగా మారటం ఆసక్తికరంగా మారింది. సరైన పోటీ ఇవ్వలేక పోతుందను కొన్న బిజెపి మూడు మున్సిపాలిటీల్లోనూ చాప కింద నీరులా తయారై అభ్యర్థులు గెలుపొందటం విశ్లేషకులను ఆశ్చర్యచకితులను చేసింది. ఎల్లంపేట మున్సిపాలిటీల్లో అయితే 24 స్థానాల్లో అత్యధికంగా బిఆర్‌ఎస్ 12, కాంగ్రెస్ 8 స్థానాలు దక్కించుకోగా మిగిలిన నాలుగు స్థానాలు దక్కించుకొన్న బిజెపి కింగ్ మేకర్‌లా తయారైంది. ఇక్కడ స్పష్టమైన మెజారిటీ రావటానికి బిఆర్‌ఎస్ పార్టీకి ఒక్క సీటు తగ్గి పోవటంతో గమనార్హం. ఆలియాబాద్ మున్సిపాలిటీల్లోని 20 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ, బిఆర్‌ఎస్ 7 స్థానాలను దక్కించుకోగా బిజెపి 3, ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందగా ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాక పోవటం హంగ్ ఏర్పడిన పరిస్థితులు నెలకొన్నాయి.

**చైర్మన్ స్థానం ఎవరిస్తే ఆ పార్టీకే మద్దతు అంటున్న స్వతంత్ర అభ్యర్థి**

ఆలియాబాద్ మున్సిపాలిటి ఫలితాల్లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవటంతో



18వ వార్డులో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి గాదె వెంకటేశ్ కీలకంగా మారారు. అతడి మద్దతు కోసం ఓ పక్క బిఆర్‌ఎస్, మరో పక్క కాంగ్రెస్ పార్టీలు యత్నించటంతో తనకు చైర్మన్ స్థానాన్ని ఇచ్చేందుకు ఏ పార్టీ ముందుకు వస్తే ఆ పార్టీకే మద్దతిస్తానంటూ మెలిక పెట్టటం ఆసక్తికరంగా మారింది. కేటాయించే కౌటింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మద్దతుతో చైర్మన్ స్థానాన్ని కైవసం కీలకంగా మారటంతో డిమాండ్ ఏర్పడింది.

**కౌటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత**

ఆలియాబాద్ పీఠాన్ని దక్కించుకొనేందుకు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు విజేతల్లో కీలకంగా మారిన స్వతంత్ర అభ్యర్థి వెంకటేష్‌ను తమ వెంట తీసుకొని వెళ్లేందుకు యత్నాలు చేపట్టటంతో కౌంటింగ్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

కౌటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు వెంకటేష్‌ను లోపలికి వెళ్లనీయకుం డా బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అడ్డుకొంటున్న విషయాన్ని తెల్సుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని అదనపు బలగాలను మోహరించి తమ వెంట కౌంటింగ్ కేంద్రం లోపలికి తీసుకొని వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు.

## వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ హవా



**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లాలోని నాలుగు మున్సిపల్స్‌లో కొడంగల్ 12కు 10స్థానాలు బిఆర్‌ఎస్1, ఎంఐఎం1 గెలిచారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కాంగ్రెస్, పరిగి మున్సిపల్ 18కి కాంగ్రెస్ 8, బిఆర్‌ఎస్ 8, ఇండిపెండెంట్ 2 గెలవడంతో వీరు కీలకంగా మారారు. వికారాబాద్ లో మొత్తం 34, కాంగ్రెస్ 17, బిఆర్‌ఎస్ 11, ఎంఐఎం 1, బిజెపి నాలుగు గెలుపొందారు. చైర్మన్ అభ్యర్థిగా స్పీకర్ కుమార్తె అనన్య పదవి స్వీకరించడం జరుగుతుంది. తాండూర్‌లో మొత్తం వార్డు లు 36 కాంగ్రెస్ 19, బిఆర్‌ఎస్ 12, బిజెపి3, ఎంఐఎం1, ఇండిపెండెంట్1 గెలుపొందారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పరిగి మున్సిపల్‌లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సమానంగా ఉన్నాయి. వికారాబాద్‌లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు బిఆర్‌ఎస్ అభ్యర్థులు గట్టిపోటీ ఇవ్వడం జరిగింది. తాండూర్‌లో అధికారపార్టీతో ఢీ అంటే ఢీ అని నిలిచిన బిఆర్‌ఎస్, కొడంగల్‌లో మాత్రమే కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యంలో నిలిచారు. జిల్లాలో 100వార్డులకు గాను అధికార కాంగ్రెస్‌పార్టీ 54వార్డులు, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ 32వార్డులు, బిజెపి 7, ఎంఐఎం 3, ఇతరులు నాలుగు గెలిచారు.

## కెఎల్‌హెచ్‌లో ఘనంగా కళా ఉత్సవ్–2026 వేడుకలు

రెండు రోజులపాటు సాగిన సాంస్కృతిక మహోత్సవం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కెఎల్ హెచ్ హైదరాబాద్ క్యాంపస్‌లో ఈ నెల 12, 13వ తేదీలలో జాతీయ స్థాయి సాంస్కృతిక మహోత్సవాన్ని కళా ఉత్సవ్–2026 పేరుతో అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో 'వేర్ ట్రెడిషన్ మీట్స్ క్రియేటివిటీ' అనే థీమ్‌తో ఈ వేడుకలలో విద్యార్థుల ప్రతిభా పాటవాలు వెలుగులోకి తీసుకువచ్చాయి. కళా ఉత్సవ్ తొలి రోజు తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖకు చెందిన నేహా సింగ్, వారి బృందం ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీతం, నృత్యం, కళలు, సాహిత్యం, జర్నలిజం, లూమినార్ షార్ట్ ఫిల్మ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థులు ప్రతి విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా టీం ఫన్ మోజీ వినోదాత్మక ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ గాయకుడు సింగర్ పవన్ కళ్యాణ్ సంగీత ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఫ్యాషన్ షో, ఇంటర్ క్యాంపస్ సాంస్కృతిక ప్రదర్శనలు, అధికారిక బ్రోచర్ విడుదల కార్యక్రమాలతో పాటు బ్యాండ్ ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.

**ఫిబ్రవరి13 – గ్రాండ్ ఫినాలే**

కళా ఉత్సవ్‌లో భాగంగా రెండవ రోజు ప్రముఖ అతిథులుగా అర్జున్ సర్జా, ఐశ్వర్య అర్జున్, నిహాంత్రి రెడ్డిలు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కెఎల్ హెచ్ మ్యూజిక్ క్లబ్‌ల ప్రత్యేక ప్రదర్శనలు, లైవ్ ఆర్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. కెఎల్‌హెచ్ యూనివర్సిటీ అధికారిక గీతం విడుదల చేశారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

గ్రాండ్ డిజెనైట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేయబడ్డాయి. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ప్రత్యేక నగదు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం లక్షల రూపాయల విలువైన బహుమతులు పాల్గొన్న విద్యార్థులకు అందించారు. విద్యార్థుల భాగస్వామ్యంతో మహోత్సవంలో కెఎల్‌హెచ్ బాచుపల్లి, అజీజ్‌నగర్, గ్లోబల్ బిజినెస్ స్కూల్ క్యాంపసులతో పాటు ఇతర కళాశాలల నుండి కూడా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఈ వేడుకను ఆస్వాదించారు. కార్యక్రమ నిర్వహణ బృందం ఎంతో సమర్థవంతంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు.

కెఎల్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ హవీష్ మాట్లాడుతూ, కళా ఉత్సవ్ విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక అని అన్నారు. విద్యతో పాటు సంస్కృతి, విలువలు, నాయకత్వం కలిసినపుడే సమగ్ర వ్యక్తిత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఈ మహోత్సవాన్ని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో కళా ఉత్సవ్ చైర్ పర్సన్, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, కన్వీన ర్ ప్రేమ్, అధ్యాపకులు, విద్యార్థి వాలంటీర్లు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించా రు.

## ఇది సబ్బండ వర్గాల విజయం : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:**మున్సిపల్ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలను కట్టబెట్టారని, ఇది సబ్బండ వర్గాల విజయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూరు మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మీడియా పాయింట్‌లో విలేకర్లతో మాట్లాడారు. తాండూరు ప్రజల విజయమని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు గుర్తించారని అన్నా రు. తాండూరు పట్టణంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో తాండూరు అభివృద్ధిలో ముందుకు తీసుక పోతామని తెలిపారు. ఈ విజయంతో మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసి చూపిస్తామని తెలిపారు. ప్రజలు బిఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చేప్పారని, వారు సాధించిన ఫలితాలలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కృషి ఏమీ లేదని, అది డాక్టర్ సంపత్‌కుమార్ కృషి ఫలితమన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తమరావు, విజయం సాధించిన కౌన్సిలర్‌లు నీరజ బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.




## భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత, స్పష్టత ఉండాలి : కలెక్టర్ హరిచందన

**ప్రజాపక్షం /హైదరాబాద్ సిటీ :** ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత, స్పష్టత ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన చెప్పారు. ఈ దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎలివేటెడ్ కారిడార్ భూ నిర్వాసితుల అభిప్రాయాలను ఆమె తెలుసుకున్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుండి షామీర్‌పేట ఒఆర్‌ఆర్ జంక్షన్ వరకు 18.70 కిలోమీటర్లు కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారని చెప్పారు. దీనికోసం హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్యారడైజ్ నుంచి లోతుకుంట వరకు 11.70 కిలోమీటర్ల భూసేకరణ విషయంలో కలెక్టర్ ఈ సూచనలు చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్ తగ్గింపు, కనెక్టవిటీ పెరుగుదల, పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ ఎంతో ముఖ్యమన్నారు. ఈ ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు పరిహారం విషయంలో ప్రభుత్వ విధివిధానాలను ఆమె తెలియచేశారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో భూసేకరణ కమిటీ సభ్యులతో పాటు భూసేకరణ అధికారి అపర్ణ, హెచ్‌ఎండిఎ భూసేకరణ అధికారి అర్చన, రోడ్లు భవనాలు, సంబంధిత శాఖల అధికారులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ దరఖాస్తు తేదీ పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** మైనార్టీ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన చివరి తేదీని ఈ నెల 21వరకు పొడగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎస్‌సి, ఇంటర్ విద్యార్హతలతో మొత్తం 26 కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన యువతీ, యువకులు ఆధార్‌కార్డు, అర్హత ధృవీకరణ పత్రం, రెండు ఫోటోలు, ఆదాయ ధృవీకరణ పత్రం కాపీలతో నాంపల్లిలోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన తెలిపారు.

## జగద్గిరిగుట్ట ప్రజలే నాబలం

కార్పొరేటర్ కొలుకుల జగన్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్ట ప్రజలే నా బలం, బలంగం అని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ తన భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మా తల్లిదండ్రులు కొలుకుల (బండి) సత్యనారాయణ, కొలుకుల లక్ష్మి లు నాకు జన్మనిస్తే, జగద్గిరిగుట్ట పురప్రజలు రాజకీయంగా నాకు పునర్జన్మ ఇచ్చార ని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మూడు పర్యాయాలు హాట్రిక్ కార్పొరేటర్‌గా గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ వేంకటేశ్వరస్వామి, శివయ్య దీవెనలతో జగద్గిరిగుట్ట ప్రజల కుటుంబ సభ్యుడిగా సేవలందించే భాగ్యం కలిగిందని అన్నారు. రాజకీయంగా ఎన్నో సవాళ్లు, ఆటుపోట్లను ఎదుర్కొంటూ డివిజన్ ప్రజలే తన బలం, బలగమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతూ విశిష్ట సేవలందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు కొలుకుల జగన్ వెల్లడించారు.




## తాండూరు మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

19కౌన్సిలర్ స్థానాలు కాంగ్రెస్ వశం, 12స్థానాలు బిఆర్‌ఎస్ విజయం

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. తాండూరు మున్సిపల్‌లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా చైర్మన్ పీఠాన్ని హస్త గతం చేసుకోబోతుంది. ఈసారి జరిగిన ఎన్నికల్లో జోరు పెంచిన కారు మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోవడంలో బోల్తా పడింది. శుక్రవారం తాండూరు పట్టణంలోని సెంట్‌మార్క్స్ జూబ్లీ స్కూల్‌లో ఓట్ల లెక్కింపును పట్టిన అధికారులు ఫలితాలను వెల్లడించారు. తాండూరు మున్సిపల్‌లో 36 వార్డులకు గాను 19కౌన్సిలల్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా, బిఆర్‌ఎస్ పార్టీ 12 కౌన్సిలర్ స్థానాలను, బిజెపి 3కౌన్సిలర్ స్థానాలను, ఎంఐఎం పార్టీ ఒక స్థానాన్ని, ఇండిపెండెంట్ ఒక స్థానంలో విజయం సాధించారు. కాగా మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 19కౌన్సిలర్ స్థానాలలో విజయం సాధించి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని హస్తంగతం చేసుకుంది. అంతకు ముందు కౌన్సిలర్‌గా విజయం సాధించిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు. 12వార్డులకు ఒక రౌండ్ చొప్పున మూడు రౌండ్‌లలో ఓట్ల లెక్కింపును చేపట్టిన అధికారులు రౌండ్‌ల వారీగా విజయం సాధించిన అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. మొదటి రౌండ్‌లో బిఆర్‌ఎస్ పార్టీ 6వార్డు స్థానాలలో విజయం సాధించింది. కాగా కాంగ్రెస్ పార్టీ 5స్థానాలకే పరిమితమైంది. రెండు, మూడు రౌండ్‌లలో బిఆర్‌ఎస్ పార్టీ వెనుకబడి పోయింది. కాంగ్రెస్ పార్టీ తమ దూడుకును పెంచిన 19స్థానాలకు కైసవం చేసుకుంది. సాయిపూర్‌లోని నాలుగు వార్డులకు గాను మూడు వార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి క్లీన్ షీప్ చేసింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాకర్తలు సంబురాలు జరుపుకున్నారు.



## ముగిసిన ఎన్నికల కౌటింగ్

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ముగియడంలో ఎన్నికలు నిర్వహించిన అధికారులకు, పోలీస్‌అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఎన్నికల కౌటింగ్ సెంటర్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి సంఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ , మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాభిరామ్ జయంతి వేడుక



ప్రజాపక్షం/త్యాగరాయగానసభ: పట్టాభిరామ్ 76వ జయంతి వేడుకలు త్యాగరాయ గాన సభలో జరిగాయి. వంశీ ఆర్ట్ థియేటర్స్ వంశీ రామ రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెజీషియన్ బీ గురుబ్రహ్మ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ పూర్వ సభాపతి సిరికొండ మధుసూదనాచారి, డా.వోలేటి పార్వతీశం, సీనియర్ పత్రికా సంపాదకులు కే.రామచంద్రమూర్తి, రేలంగి నర్సింహారావు, జయ పట్టాభిరామ్ పాల్గొన్నారు.

## గాయని అనురాధకు సన్మానం



ప్రజాపక్షం/త్యాగరాయగానసభ: సంధ్యా సరాగాల పల్లవి... ఇది మల్లెల వేళయని.... శ్రీ కళ జరిగిన సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకున్నది. వేడుకలో భాగంగా గాయని అనురాధను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని భాగ్యలక్ష్మి నిర్వహించగా... సిటీ సివిల్ కోర్ట్స్ సూపరింటెండెంట్ అంజని కుమారి, శారద, వినయ్ కుమార్, శ్రీనివాస్, కళ్యాణి ఆత్మీయ అతిథులుగా విచ్చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఘంటసాల స్మృతిలో వేడుక జరిగింది. గాయని,గాయకులు కామేశ్వరి, సరస్వతి, స్వాతి, రాజ్యలక్ష్మి, సరోజ, మధు, నాగేందర్, అనిల్ కుమార్, జనహర్, బాబు, శ్రీనివాస్ పాటలు పాడి ఆకట్టుకున్నారు. సంగీత విభావరికి ఉదయ్ కుమార్ సాంకేతిక సహకారం అందించారు.

## శివరాత్రి పురస్కారాలు అందజేత



ప్రజాపక్షం/తెలుగు వర్సిటీ: శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలుగు యూనివర్సిటీలో నాట్యోత్సవం నిర్వహించారు. త్రినేత్రం శివ రాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. రుద్రరాజు పద్మరాజు, అంజనీ కుమారి, శివ, నరసింహం, రాగ రంజని అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాట్య గురువులు రాగ రంజని రంజిత, ఆచార్య సాయి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## సిఎఫ్ఓ జూ సందర్శన



ప్రజాపక్షం/బహదూర్‌పురా : ప్రధాన అటవీ సంరక్షణ అధికారి(వైల్డ్ లైఫ్) వినయ్ కుమార్ గురువారం జూపార్క్‌ను సందర్శించారు. జూపార్క్ డైరెక్టర్ డా.సునీల్ ఎస్.హిరేమత్, క్యూరేటర్ జె.వసంత తదితరులు వినయ్ కుమార్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్యూరేటర్ వసంత ఆయనకు రోజువారీ కార్యకలాపాలు, నూతన కార్యక్రమాలు, జంతు మార్పిడి కార్యక్రమాలు, జంతు దత్తత పథకం తదితరాల గురించి వివరించారు.

## బంచ్ కేబుల్ ఏర్పాటు



ప్రజాపక్షం/కంటోన్మెంట్: న్యూ బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ బజార్ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను విద్యుత్ అధికారులు తొలగించారు. విద్యుత్ తీగల సమస్యను డీఈ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లడంతో టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులు స్పందించి బంచ్ కేబుల్ ఏర్పాటు చేశారని కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ...ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను విద్యుత్ అధికారులు తొలగించినందుకు బస్తీవాసుల తరఫున డీఈకి కృతజ్ఞతలు తెలిపారు. జంపన ప్రతాప్ వెంట జేపీ యువసేన ప్రతినిధులు షకీల్, ఆజం, నజీర్ ఉన్నారు.

## కంటోన్మెంట్‌ను జిహెచ్ఎంసిలో విలీనం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ కుసుకుల జనార్ధన్‌రెడ్డి



ప్రజాపక్షం/కంటోన్మెంట్: జిహెచ్ఎంసిలోకి కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని విలీనం చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని కాంగ్రెస్ అఖిల భారతీయ సేవాదళ్ (ట్రెజరర్, మాజీ ఎమ్మెల్సీ, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు కుసుకుల జనార్దన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ .... సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని మూడు భాగాలుగా చేసి పాలనా సౌలభ్యం కల్పించారని.. అదేవిధంగా కంటోన్మెంట్ ను కూడా జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు కృషి చేయాలని కోరారు. త్వరలో సీఎంను కలిసి కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలను వివరించనున్నట్లు కుసుకుల తెలిపారు. మీడియా సమావేశంలో యుగంధర్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఫలితాల్లో హోరా హోరీ!

### షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి హస్తగతం
### ఇబ్రహీంపట్నం, ఆమనగల్‌లో కారుదే హవా
### మొయినాబాద్‌లో హంగ్.. స్వతంత్రులే కింగ్ మేకర్లు..

ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్,ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌ల మధ్య హోరాహోరీ అన్నట్లుగా వెళ్ల డైయ్యాయి. వివిధ మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఫలితాలు నువ్వానేనా అన్నట్లుగా వచ్చి ఆయా అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించాయి. జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ సంపూర్ణ మెజార్టీ సాధించగా, ఆమనగల్,ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలను ప్రతిపక్ష బిఆర్‌స్ కైవసం చేసుకుంది. కాగా మొయినాబాద్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాలేదు. ఇక్కడ హంగ్ అనివార్యమైంది. మొత్తం 26 వార్డుల్లో పది కాంగ్రెస్ గెలుచుకోగా, ఏడు బిఆర్‌ఎస్, మరో నాలుగు స్థానాల్లో బిజెపి గెలుచుకుంది. ఇక్కడ చైర్మన్ పీఠం అధికార పార్టీకి దక్కాలంటే మరో నాలుగు స్థానాలు తప్పని సరి. కాగా స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందిన ఇద్దరు కాంగ్రెస్ రెబల్స్ పోటీ చేసిన వరున్నారు. వీరు అధికార పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం లేకపోలేదు. చైర్మన్ పీఠం దక్కాలంటే అదనంగా మరో ఇద్దరి మద్దతు తప్పని సరైంది. బిజెపి రెబల్స్‌గా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు ఎవరికి మద్దతు ఇవ్వనున్నారనేదే ఇక్కడ అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

### గట్టిపోటీ ఇచ్చిన బిఆర్‌ఎస్

జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో 126 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించగా మొత్తం 437 మంది బరిలో నిలిచారు. వీరిలో అధికార కాంగ్రెస్ పార్టీ 126 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టగా, కేవలం 54 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహా దామోదరం రాజనరసింహ్మా, వాకటి శ్రీహరి, సీతక్క సహా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపిలు అభ్యర్థుల తరపున ప్రచారం చేసినా ఆశించిన స్థానాలు గెలుచుకోలేకపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లకు భారీగా తాయిలాలు అందజేసినా.. ఆశించిన ఫలితం దక్కలేదు. ఇక ప్రతిపక్ష బిఆర్‌ఎస్ మొత్తం 122 స్థానాల్లో పార్టీ అభ్యర్థుల ను నిలబెట్టింది. ఏకంగా 47 మందిని గెలిపించుకుంది. మిగిలిన చోట్ల అధికార కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఇచ్చింది. ఇబ్రహీంపట్నంలో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థి సైతం చివరికి బిఆర్‌ఎస్‌లో చేరడం విశేషం. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, పట్టణాల్లో తమకు పట్టు ఉంది. ప్రజలు తమకే పట్టం కడతారని, ప్రగాల్బాలు పలికే బిజెపి 109 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పార్టీ ముఖ్య నేతలు అభ్యర్థుల తరపున ప్రచారం చేసినా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. కేవలం 16 స్థానాలతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. అంతేకాదు ఆమ నగల్ సిట్టింగ్ చైర్మన్ స్థానాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది. దేశమంతా వికసిస్తున్న కమలం జిల్లాలో మాత్రం రోజు రోజుకు మరింత వాడిపోతుండటం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది.

**మున్సిపాలిటీల్లో ఫలితాలు ఇలా...**

| మున్సిపాలిటీ | వార్డులు | కాంగ్రెస్ | బిఆర్ఎస్ | బిజెపి | స్వతంత్రులు |
|---|---|---|---|---|---|
| ఆమనగల్లు | 15 | 01 | 08 | 06 | |
| ఇబ్రహీంపట్నం | 24 | 08 | 13 | 02 | 01 |
| షాద్‌నగర్ | 28 | 15 | 11 | 01 | 01 |
| శంకర్‌పల్లి | 15 | 09 | 04 | 02 | |
| మొయినాబాద్ | 26 | 10 | 07 | 04 | 05 |
| చేవెళ్ల | 18 | 11 | 04 | 03 | |
| మొత్తం | 126 | 54 | 47 | 16 | 9 |

### అధికారపార్టీ క్యాంపులో ఇద్దరు స్వతంత్రులు

మొయినాబాద్ మున్సిపాలిటీలో 26 వార్డులు ఉండగా, వీటిలో పది స్థానాలను అధికార కాంగ్రెస్ గెలుచుకుంది. ప్రతిపక్ష బిఆర్‌ఎస్ ఏడు స్థానాల్లో విజయం సాధించగా, బిజెపి నాలుగు స్థానాల్లో విజయం సాధించింది. స్వతంత్రులు ఐదు చోట్ల గెలుపొందారు. చైర్మన్ పీఠం దక్కాలంటే మ్యాజిక్ ఫిగర్ 13 స్థానాలు దాటాలి. కాగా కాంగ్రెస్‌కు పది స్థానాలు మాత్రమే దక్కాయి. స్వతంత్రుల్లో కాంగ్రెస్ రెబల్స్ ఇద్దరు, బిజెపి రెబల్స్ మరో ముగ్గురు ఉన్నారు. ఎలాగైనా చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను దక్కించుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తుంది. ఆ మేరకు ఇప్పటికే గెలుపొందిన అభ్యర్థులను అదే ప్రాంతంలోని ఓ మాజీ ఎంపి ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన క్యాంపుకు తరలించినట్లు తెలిసింది. ఈ క్యాంపులో ఇద్దరు స్వతంత్రులు ఉన్నట్లు, ఒక స్వతంత్ర అభ్యర్థికి వైస్ చైర్మన్ పదవిని ఆఫర్ చేయగా,మిగిలిన అభ్యర్థులకు భారీ మొత్తంలో నగదు ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

## కౌంటింగ్ ప్రక్రియ పరిశీలన




ప్రజాపక్షం/రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ పరిశీలించారు. సమీకృత జిల్లా కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జిల్లాలో చేపట్టిన కౌంటింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్ పర్యవేక్షించారు.

## ప్రశాంతంగా మున్సిపల్ ఫలితాలు

షాద్‌నగర్ డిసిపి సిహెచ్ శిరీష



ప్రజాపక్షం/షాద్‌నగర్: మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రశాంతంగా జరిగాయని షాద్‌నగర్ డిసిపి సిహెచ్ శిరీష తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్కంఠభరితంగా మున్సిపల్ ఓట్ల లెక్కింపు

### అధికార కాంగ్రెస్ పార్టీకి 15స్థానాలు, బిఆర్ఎస్‌కు 11స్థానాలు
### స్వతంత్ర అభ్యర్థి ఒకరు, బిజెపి ఒకరు



ప్రజాపక్షం/షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28వార్డులకు ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీని అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. వార్డుల్లో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఇంటింటికి వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు.

### మున్సిపాలిటీలో విజయం సాధించిన అభ్యర్థులు వీరే...

షాద్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుంచి 15మంది అభ్యర్థులు విజయం సాధించగా బిఆర్‌ఎస్ నుంచి 11మంది అభ్యర్థులు, స్వతంత్రులు ఒకరు, బిజెపి నుండి ఒకరు విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ నుండి 2వ వార్డులో బచ్చలి నరేష్, 5వ వార్డులో సింగపాక శిరీష, 6వ వార్డులో రాజునాయక్, 7వ వార్డులో కొప్పునూరి ప్రవీణ్, 10వ వార్డులో నడికుడ శ్రావణి, 12వ వార్డులో దిలీప్, 13వార్డులో రిజ్వానభేగం, 14వ వార్డులో అందె మోహన్, 15వ వార్డులో మరియా భేగం సాదిక్, 17వ వార్డులో నాజియా భేగం సర్వర్‌పాషా, 18వ వార్డులో జమాల్పూర్ సంతోషిబాయి చందులాల్, 23వ వార్డులో అగ్గనూరి బస్వం, 24వ వార్డులో అగ్గనూరి విశాల విశ్వం, 25వ వార్డులో చాకలి పెంటయ్య, 27వ వార్డులో మురళిమోహన్ అప్పిలు విజయం సాధించారు. బిఆర్‌ఎస్ నుండి మొదటి వార్డులో గౌస్‌జానీ, మూడవ వార్డులో నందారం అశోక్, 4వ వార్డులో చల్లా రాణి పాండురంగారెడ్డి, 11వ వార్డులో పిల్లి శారదశేఖర్, 16వ వార్డులో ఒగ్గు జయలక్ష్మి కిశోర్, 19వ వార్డులో హరిఫ్‌బేగం అడ్డు, 20వార్డులో పినమోని గోపాల్, 21వ వార్డులో జిటి వసంత శ్రీనివాస్, 22వ వార్డులో నడికుడ అనిత రఘునాథ్ యాదవ్, 26వ వార్డులో ఎస్‌పి శివ, 28వ వార్డులో చేగూరి లక్ష్మి ప్రసన్న వేణులు విజయం సాధించారు. భారతీయ జనతా పార్టీ నుండి ప్యాట అశోక్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థిగా బిఎస్ సుధీర్ విజయం సాధించారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు షాద్‌నగర్ ఎన్నికల అధికారిని సునీతారెడ్డి సర్టిఫికెట్లను అందజేశారు.

## బిఆర్ఎస్-13, కాంగ్రెస్ 8, బిజెపి-2, స్వతంత్ర-1

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులకు గాను 25993 ఓటర్లు ఉండగా అందులో 20216 ఓట్లు పోలయ్యాయి, 24వార్డులలో 48 పోలింగ్ స్టేషన్లలో 83 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలో ఉన్నా శ్రీఇందు ఇంజీనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌటింగ్ కేంద్రంలో 12టేబుళ్ళు, రెండు రౌండ్లు ఓట్ల లెక్కింపు కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య కొనసాగింది. గెలుపొందిన వార్డుల వారిగా అభ్యర్థులు 1వ వార్డు బిజెపి అభ్యర్థి ముత్యాల శ్యామలభాస్కర్, 2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నీళ్ల భానుబాబు, 3వ వార్డు స్వతంత్ర అభ్యర్థి దాసరి మురళి క్రిష్ణ, 4వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి కొంద్రు ప్రవీన్‌కుమార్, 5వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి జెర్కోని మమతరాజు, 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అమినా బేగం,7వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి, 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వర్థ్య రాందాస్, 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి దారు రాఘవేందర్, 10వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి దొంతరమోని భార్గవిరాజు, 11వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి కొంద్రు శ్రీలతరాంబాబు, 12వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి కొండిగారి త్రిలోక్‌కుమార్, 13వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఇందూర్ శ్రీనివాస్, 14వ వారు కాంగ్రెస్ అభ్యర్థి ఎదుళ్ళవిజయ లక్ష్మి జంగారెడ్డి, 15వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి క్యామ శంకర్,16వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి అల్వాల జ్యోతి వెంకట్‌రెడ్డి, 17వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మడుపు లక్ష్మమ్మ, 18వ వార్డు బిజెపి అభ్యర్థి సిద్దం భానుప్రియ, 19వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ఆకుల యాదగిరి , 20వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి మంద జయ, 21వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి చిలుక బుగ్గరాములు, 22వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కప్పరి స్రవంతి చందు, 23వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి నీలం శ్వేతబాలు, 24వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గూడూరి గిరిలు గెలుపోందారు. 24 వార్డులలో బిఆర్ఎస్ 13, అధికార కాంగ్రెస్ పార్టి 8, బిజెపి2, స్వతంత్ర అభ్యర్థి 1 చొప్పున గెలుపొందారు. కౌన్సిలర్లుగా విజయం సాధించిన అభ్యర్థులకు పత్రాలు అందచేశారు. కౌటింగ్ కేంద్రాన్ని మున్సిపల్ ఎన్నికల అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, అదనపు కల్లెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు.

## చేవెళ్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం



ప్రజాపక్షం/షాబాద్: చేవెళ్ల మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. చేవెళ్ల మున్సిపాలిటీలో 18 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ 11, బిఆర్ఎస్ 4, బిజెపి 3 అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించారు. చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి దేవర సమత వెంకట్‌రెడ్డికి ఎన్నిక పత్రం మున్సిల్ కమిషనర్ వెంకటేశం అందజేశారు. చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామని దేవర సమత వెంకట్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రజల సేవ చేసుకునే అవకాశం ఇచ్చిన ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే చర్యలు

ప్రజాపక్షం/తుర్కయంజాల్: ఆహారం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చర్యలు తప్పవని శానిటేషన్ ఇన్స్పెక్టర్ వనిత అన్నారు. ఆదిపట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని తాజా హోటల్ పై శుక్రవారం శానిటేషన్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడులలో హోటల్ వంటగది తీవ్రమైన అపరిశుభ్రత, పాడైపోయిన ఆహార పదార్థాలు ఉండడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహారం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై, ప్లాస్టిక్ కవర్లు వాడకంతో హోటల్ యజమానికి శానిటేషన్ ఇన్స్పెక్టర్ కవిత రూ. 5000 జరినామ విధించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్ ల పై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీని గెలిపించింది

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ప్రజా పాలన ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపించాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ కౌన్సిలర్లను సన్మానించి అభినంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతోపాటు ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, పరిగి రోడ్డు విస్తరణతోపాటు చౌరస్తాను విస్తరించి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పెట్టి ఓట్లు వేసి భారీ మెజార్టీతో కౌన్సిలర్లను గెలిపించినందుకు ఓటర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## కుష్టు వ్యాధి నివారణకు కృషిచేయాలి : డిఎంహెచ్ఓ




ప్రజాపక్షం/రంగారెడ్డి: కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె లలితా దేవి అన్నారు. శుక్రవారం పెద్ద అంబర్ పేట్ శాంతినగర్‌లోని లెప్రసి కాలనీలో డిఎంహెచ్ఓ లలితాదేవి, డిఎల్ ఒ డాక్టర్ పాపారావు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా చేపట్టిన కుష్టు వ్యాధి నివారణ ముగింపు కార్యక్రమం లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టి వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్స నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాధి బారిన పడిన వ్యక్తులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. అవసరమైన వారికి కావలసిన ఎంసిఆర్ చెప్పులు. సెల్ఫ్‌కేర్ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌పిపి ప్రెసిడెంట్ రమేష్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మిప్రసన్న, డాక్టర్ ప్రియాంక, ఇతర లధికారులు సిహెచ్ఓ సులోచన, లక్ష్మినారాయణ, శాంతిరాజు, మసూద్, సుదర్శన్, లింగ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు ఆశాలు, శాంతినగర్ లెప్రసీ కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో చేయూత

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : బస్తీ దవాఖానకు వాటర్ ప్యూరిఫైర్, అంగన్‌వాడీ కేంద్రానికి రైస్ కుక్కర్‌లను చందానగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్ల చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజ లను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన ఆహారం అందించానికి తన వంతు సహాయంగా బస్తీ దవఖానకు వచ్చే రోగులకు, సిబ్బందికి స్వచ్ఛమైన నీరు అందించడానికి, అంగాన్‌వాడీలో పిల్లల పోషణకు అంగాన్‌వాడీ కేంద్రానికి రైస్ కుక్కర్‌లను అందజేశామని, సేవా కార్యక్రమాలు చేపట్టడానికి చేయూత అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన సిబ్బంది, అంగాన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



12
ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
14-02-2026
www.prajapaksham.in

అల్లు శిరీష్ వివాహ వేడుకలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అరవింద్ నివాసంలో సంప్రదాయబద్ధంగా పసుపు దంచుడు కార్యక్రమం నిర్వహించారు. తన ప్రేయసి నయనికతో మార్చి 6, 2026న శిరీష్ వివాహం జరగనుంది. అదే రోజు అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహ వార్షికోత్సవం కావడం విశేషం. వై

రీల్

## నాగబంధం' టీజర్ కోసం మహేష్ బాబు రెడీ



విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా మూవీ 'నాగబంధం' ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 15న మహా శివరాత్రి శుభ సందర్భంగా ఉదయం 11:11 గంటలకు టీజర్ విడుదల కానుంది. అయితే ఈ టీజర్ ను హీరో మహేష్ బాబు ఆవిష్కరిస్తారని నిర్మాతల్లో ఒకరైన నిశిత నాగిరెడ్డి చెప్పారు. ఇటీవల రిషబ్ సాహ్నిని అఫ్షన్ పాలకుడు అబ్దాలి పాత్రలో పరిచయం చేసింది. 1750లో సెట్ చేయబడిన ఈ చిత్రం నాగబంధం సంప్రదాయంతో ముడిపడి ఉన్న పురాతన రహస్యాలను అద్భుతంగా చూపించబోతుంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తుండగా, జగపతి బాబు, జయప్రకాష్, మురళి శర్మ, బి.ఎస్. అవినాష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, ఆర్సి ప్రణవ్ ఎడిటింగ్, అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. .ఈ చిత్రానికి నిర్మాతలు: కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి, సంగీతం: అభే, జునైద్ కుమార్ అందిస్తున్నారు.

సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అ శ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సిని మా వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళం లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాను డిస్ట్రిబ్యూట ర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీవిష్ణు, డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, మేర్లపాక గాంధీ, నందినీరెడ్డి, అభిలాష్ రెడ్డి, ప్రొడ్యూసర్ స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు.డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ యూవీ ప్రొడ్యూసర్స్ నాకు మంచి మిత్రులు. ఎమోషన ల్ రైడ్ లా ఉంది. సంతోష్ శోభన్, మానస పర్ఫెక్ట్ పెయిర్ లా అ నిపించారు. సంతోష్ కు మంచి హీరోకు కావాల్సిన అన్ని క్వాలిటీస్ ఉన్నాయి. కావాల్సింది ఒక సూపర్ డూపర్ హిట్. అది ఈ నెల 14న ఈ సినిమాతో వచ్చేస్తుంది. వాలెంటైన్ డే స్లాట్ కి ప ర్ఫెక్ట్ టైమ్ చిత్రమిది అని అన్నా రు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ కపుల్ ఫ్రెండ్లీ మూవీ ఒక యంగ్, ఫ్రెష్ లవ్ డ్రామా. మేమంతా మనసు పె ట్టి వర్క్ చేశాం. మా అజయ్ వల్లే ఇక్కడ ఉన్నాం. మా సినిమాకు ఆదిత్య బ్యూటిఫుల్ మ్యూజిక్ చేశారు. మిత్ర క్యారెక్టర్ ప్రేక్షకులు ఎంతగా కనెక్ట్ అవుతారో చూడాలని ఆత్రుతగా ఉంది. ఈ సినిమా చేస్తున్నప్పుడు మేమంతా ఒక ఫ్యామిలీ అనే ఫీల్ కలిగింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో నటుడు రాజీవ్ కనకాల, డైరెక్టర్ మేర్లపాక గాంధీ, డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్, డైరెక్టర్ నందినీరెడ్డి , ప్రొడ్యూసర్ స్వప్న దత్ , మ్యూజిక్ డైరెక్టర్ ఆదిత్య రవీంద్రన్ ,హీరో సంతోష్ శోభన్, హీరో శ్రీవిష్ణు పాల్గొన్నారు.

## కపుల్ ఫ్రెండ్లీ' ప్రీ రిలీజ్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి



## ఆగస్టు 21న 'ది ప్యారడైజ్'



నాని హీరోగా తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. హైదరాబాదలో చిత్రీకరణ జోరుగా సాగుతుండగా, నిర్మాత ఇప్పుడే విడుదల తేదీని కూడా ప్రకటించారు.'ది ప్యారడైజ్' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుందని అధికారికంగా ప్రకటించారు. ఈ రిలీజ్ డేట్ సినిమాకు వరుసగా మూడు వారాల పండుగలు కలిసిరానున్నాయి. మొదటి వారంలో ఓనం, మిలాద్ఉన్‌నబీ పండుగలు మధ్యలో రావడ ం, రెండో వీకెండ్‌లో రాఖీ బం ధన్, మూడో వారంలో జన్మాష్టమి ఉండటం వల్ల ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద బిగ్ అడ్వాంటేజ్ ఉండబోతుందని నిర్మాత భావిస్తున్నారు. ప్రస్తుతం చిత్రంలోని హైలైట్లలో ఒకటైన నాని ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణలో బిజీగా ఉంది. వందలాది డ్యాన్సర్‌లతో భారీ సెట్‌లో తె రకెక్కుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ హై వోల్టేజ్ మాస్ ట్యూన్ అందించగా, నాని ఎనర్జీకి సరిపోయేలా రూ పొందిస్తున్నారు. కోరియోగ్రాఫర్ సుధన్ మాస్టర్ భారీ విజువల్స్‌లో ఈ సాంగ్‌ను తీర్చిదిద్దుతున్నారు.ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు వంటి స్టార్ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, నవీన్ నూలి ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఎనిమిది భాషల్లో పాన్‌వరల్ విడుదల కానుంది.

## విశ్వక్ సేన్‌తో సమస్యలేమీ లేవు

### హీరో అర్జున్

యాక్షన్ కింగ్ అర్జున్ దర్శకత్వంలో నిరంజన్, ఐశ్వర్య అర్జున్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద అర్జున్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ మూవీతో ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా స్పెషల్ పాత్ర లో కనిపించనున్నారు . ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు అర్జున్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను ఇంతకు ముందు ప్రతీ సినిమాని రెం డు, మూడు భాషల్లోనే చేశాను. ఇది యూనివర్స ల్ కాన్సెప్ట్. ఇదొక ఫీల్ గుడ్ సబ్జెక్ట్.



అన్ని భాషల్లో వర్కౌట్ అవుతుంది. అందు కే సీత పయనం సినిమాను నాలుగు భాషల్లో సినిమాని రిలీజ్ చేస్తున్నాను.నా ఫ్యామిలీతోనే సినిమా తీయడంతో నాకు బడ్జెట్ మీద ఓ పట్టు ఉంటుంది. ఎక్కడ ఎంత ఖర్చు పెట్టాలి.. అనే విషయాన్ని నా చేతుల్లోనే పెట్టుకోగలను. నాకు ఆ కంఫర్ట్ లెవెల్ ఎక్కువగా ఉంటుంది. నాకు సి నిమా పరిశ్రమ ఎంతో ఇచ్చింది. తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతగానో ప్రేమిస్తుంటారు. అందు కే ఐశ్వర్యని ఇక్కడి నుంచే లాంచ్ చేయాలని అనుకున్నాను. కొడుకులే కాదు, కూతుర్లు కూడా వారసులే. అసలు అలా బేధం చూపకూడదు. వాళ్ల వాళ్ల అభిరుచులకు తగ్గట్టు మనం సపోర్ట్ చేయా లి. మా అమ్మాయికి నటన పట్ల ఆసక్తి ఉంది. అందుకే సినిమాల్లోకి తీసుకు వచ్చాను. ముందు నేను కథను రెడీ చేసుకున్నాను. తరువాత విశ్వక్ సేన్ అనుకున్నాం. కొన్ని సందర్భాల్లో మనం అనుకున్నట్టుగా జరగవు. కథలో ఒక్క సీన్ కూడా మార్చలేదు. ఆ స్థానంలోకి నిరంజన్ వచ్చాడు. విశ్వక్ సేన్‌తో సమస్యలేమీ లేవు. అన్నీ పరిష్కరించుకున్నాం. జీవితం ఒక సర్కిల్ లాంటిది.

## 'మెన్షన్ హౌస్ మల్లేష్' టీజర్ విడుదల



శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయి కామాక్షి హీరోయిన్స్. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలై న ఈ సినిమా ఫస్ట్ లుక్, ఫస్ట్ సింగిల్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మార్చి 6న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ వేడుకకు విశ్వక్ సేన్, డైరెక్టర్ తరుణ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ శ్రీనాథ్ చాలా సున్నితమైన మనిషి. ఈ నగరానికి ఏమైంది రిపీట్‌లో కూడా అద్భుతంగా చేశాడు. తప్పకుండా తను అందరినీ అలరిస్తాడు. ఈ సినిమాలో అందరూ అద్భుతంగా చేశారు అని అన్నారు. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఇలాంటి రూ టెడ్ కథలు తగ్గాయి. ఇప్పుడు రావడం చా లా ఆనందంగా ఉంది. అందరి పర్ఫార్మెన్స్‌లు చాలా బాగున్నాయి. శ్రీనాథ్ టైం వచ్చిందని అనిపిస్తోంది. ఈ సినిమాకి అన్ని కుదిరాయి అనిపిస్తోంది. మార్చి 6న తప్పకుండా ఈ సినిమా చూడండి అని తెలిపారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, రమణ, పాల్గొన్నారు.

## చిరంజీవి ఇంట్లో నామకరణం సందడి



మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో పండుగా వాతావరణం నెలకొంది. రామ్ చరణ్ ఉపాసన దంపతులకు ఇటీవల కవల పిల్లలు పు ట్టిన విషయం తెలిసిందే. ఈ చిన్నారులకు శుక్రవారం నామకర ణం చేశారు. దీంతో సందడి నెలకొంది. రామ్ చరణ్ , ఉపాసన కుటుంబ సభ్యులు ఈ నామకరణ వేడుకకు హాజరయ్యారు. కవల పిల్లల్లో ఒకరు అబ్బాయి, ఇంకొకరు అమ్మాయి పుట్టారు. అయితే అబ్బాయికి శివరాం కొణిదెల, అమ్మాయికి అన్విరాదేవి అని నామకరణం చేశారు.

## దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్‌లో తొలి చిత్రం 'మార్కండేయ'

యంగ్ టాలెంట్ ను ఎంకరేజ్ చేసేందుకు ప్రముఖ నిర్మాత దిల్ రాజు 'దిల్ రాజు డ్రీమ్స్' అనే బ్యానర్ స్థాపించారు. ఈ బ్యానర్ లో తొలి ప్రయత్నంగా యంగ్ హీరో విక్రాంత్ తో 'మార్కండేయ' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న విక్రాంత్ కెరీర్ కు దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్ ప్లస్ కానుంది. హైదరాబాద్ లో 'మార్కండేయ' మూవీ టైటిల్ గ్లింప్స్ గ్రాండ్ గా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 23 ఏళ్లలో 60 చిత్రాలు కంప్లీట్ చేసిన మా ఎస్వీసీ సంస్థకు దిల్ రాజు డ్రీమ్స్ అనేది మరో విభాగం. మేము స్టార్స్ తో 10 సినిమాలు చేస్తే అందులో 2 మూవీస్ ఆదరణ పొందలేదు. మిడ్ రేంజ్ హీరోలు, స్మాల్ ఫిలింస్ తో 70 శాతం విజయాలు అందుకున్నాం. నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు తెలిసీ తెలియక పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాను. ఆ తర్వాత పెళ్లిపందిరి సినిమా మమ్మల్ని నిలబెట్టింది. విక్రాంత్ హీరోగా చేసిన మొదటి సినిమాకు కూడా పెద్ద మొత్తంలో డబ్బు నష్టపోయాడు. ఆ తర్వాత సంతాన ప్రాప్తిరస్తు అనే సినిమాను మధుర శ్రీధర్ రెడ్డితో కలిసి చేసి లాభాలు చూశాడు. రెండో సినిమాకే తను జాగ్రత్తపడటం నేర్చుకున్నాడు. ఈ మార్కండేయ మూవీ కోసం విక్రాంత్ నన్ను అప్రోచ్ అయ్యాడు. అతనికి బిజినెస్ లు ఉన్నాయి. అవన్నీ సక్సెస్ ఫుల్ గా రన్ అవుతున్నాయి. హీరోగా కూడా సక్సెస్ కావాలనే తపన విక్రాంత్ లో కనిపించింది. మార్కండేయ మూవీలోని కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని మా దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్ లో మొదటి చిత్రంగా చేశాం. సీజీ వర్క్ ఎక్కువగా ఉన్న చిత్రమిది. ఈ సినిమాను వచ్చే ఏడాది మహాశివరాత్రికి విడుదల చేస్తాం. ఈ మూవీ గ్లింప్స్ చూసి అందరి నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.



## టెట్ కనీస ఉత్తీర్ణత మార్కులను తగ్గించాలి

### ఎస్‌టి టియస్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పరీక్షల్లో కనీస ఉత్తీర్ణత మార్కులు అధికంగా ఉండటం వల్ల సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు ఉత్తీర్ణత విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు టియస్) రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావులకు వినతిపత్రాలు అందజేశారు. పాఠశాలల్లో సుదీర్ఘ కాలంగా, సమర్థవంతంగా బోధన చేస్తున్న ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల సేవా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, ఉత్తీర్ణత మార్కులు తగ్గించాలని వారు కోరారు. బీహార్ రాష్ట్రంలో టెట్ ఉత్తీర్ణత మార్కులను గణనీయంగా తగ్గించారని, జనరల్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు వరుసగా 50, 45.5, 40 శాతంగా ఉన్నాయని గుర్తు చేశారు. ఒక వేళ తెలంగాణ రాష్ట్రంలో సవరణ సాధ్యం కానట్లయితే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సేవా కాలం ఆధారంగా సంవత్సరానికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 20 మార్కుల వరకు అదనపు వెయిటేజ్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీని వల్ల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## విదేశాల్లో ఉద్యోగాలు చేపట్టేటప్పుడు...

# 'నేపాలీయులూ.. జర జాగ్రత్త'

### దేశ పౌరులకు న్యూఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయం అప్పీల్

**షిల్లాంగ్ :** గత వారం మేఘాలయలోని అక్రమ బొగ్గుగనిలో సంభవించిన పేలుడులో హిమాలయదేశమైన నేపాల్‌కు చెందిన 9మంది కార్మికులు మరణించిన నేపథ్యంలో న్యూఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయం అప్రమత్తమైంది. విదేశీ ఉద్యోగాలు చేపట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని తమ దేశ పౌరులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు నేపాల్ రాయబార కార్యాలయం శుక్రవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో అప్పీల్ చేసింది. ఫిబ్రవరి 5న తూర్పు జైంటియా హిల్స్ జిల్లాలోని బొగ్గుగనిలో సంభవించిన పేలుడులో 31మంది మరణించారని పేర్కొంటూ, బాధితులో ఉన్న 9మంది నేపాలీయుల కుటుంబాలకు ఆ దేశ రాయబార కార్యాలయం ప్రగాఢ సానుభూతిని తెలిపింది. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించింది. ఈ సంఘటనలో గాయపడ్డ మరో ఏడుగురు నేపాల్ జాతీయులు ఒక స్థానిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. గాయపడినవారికి చికిత్స, ఇతర అంశాలు, మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు పరిహారం వంటి అంశాలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, స్థానిక పరిపాలన, పోలీసులతో రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నదని, సమన్వయం చేసున్నదని ఆ ప్రకటన తెలియజేసింది. మేఘాలయ బొగ్గుగనిలో పేలుడుకు సంబంధించిన సమాచారం లేదా సహాయం కోరుకునే కుటుంబాలు హెల్ప్‌లైన్ ద్వారా రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది. బొగ్గుగనిని చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించిన నేపథ్యంలో గమనించిన రాయబార కార్యాలయం అనధికార పని ప్రదేశాలలో ప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ సర్వీసులు, ఇతర సౌకర్యాలను పొందడం కష్టతరం అవుతుందని ప్రకటనలో తన దేశ పౌరులకు తెలిపింది. ఏదైనా ఉద్యోగంలో ప్రవేశించడానికి ముందు ఉద్యోగ సంస్థ, జీతం, సేవ, సౌకర్యాల గురించి తగినంత సమగ్రసమాచారం పొందాక అవసరమైన అధికారిక ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం మాత్రే ఉద్యోగాలను చేపట్టాలని రాయబార కార్యాలయం తన పౌరులను అభ్యర్థించింది. పౌరులు అపరిచితులు, మధ్యవర్తుల బారినపడొద్దని సూచించింది.



## ఆర్‌టిసి జెఎసి 'చలో సెక్రటేరియట్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తి, అసహనాలతో ఉన్నారని ఆర్‌టిసి జెఎసి నేతలు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జెఎసి సమావేశం శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ వి.బాబు, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు హాజరై 'ఛలో సెక్రటేరియట్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 24 న జెఎసి తలపెట్టిన 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం విజయవంతం కావడానికి కార్మికవర్గమంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డిపోలలో పని చేస్తున్న కార్మికులందరూ యూనియన్లకతీతంగా పాల్గొనాలని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో పని చేస్తున్న కార్మికవర్గమంతా కదిలి వచ్చి 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎన్.కమలాకర్ గౌడ్, బి.యాదయ్య, కె.రామిరెడ్డి, సి.ఎన్.కృష్ణ, జి.రాములు, బుద్ధ విశాల్, బి.శ్రీనివాస్ గౌడ్, సిహెచ్.రాం చందర్, బి.జ్యోతి, కరుణ, స్వప్న, ఆర్.ఎన్.రెడ్డి, ధనుంజయ్, ఎం.ఎస్.నారాయణ, బి.పాపయ్య, ముత్యాలు, రవినాథ్, గోపు శ్రీనివాస్, డేనియల్, ఎం.ఎం.ఖాన్, యాదయ్య, మజహర్ హుస్సేన్, నిరంజన్, వెంకటయ్య, ఎండి.రషీద్, గంగయ్య, శ్రీనివాస్, లక్ష్మ య్య, జగన్నాథం, కాంతా రావు తదితరులు పాల్గొన్నారు.

## 'వాలెంటైన్స్ డే' సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త




ప్రజాపక్షం/హైదరాబాద్: వాలెంటైన్స్ డే నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలు పెరిగే అవకాశముందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ప్రజలను అప్రమత్తం చేసింది. ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నకిలీ డేటింగ్ ప్రొఫైల్స్, గిఫ్ట్–ఫ్లవర్ డెలివరీ ఆఫర్లు, డిస్కౌంట్ లింకుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ హెచ్చరించారు. ఈ లింకులు వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా, ఈమెయిల్ ద్వారా పంపిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ముందుగా నకిలీ సోషల్ మీడియా, డేటింగ్ ఖాతాల ద్వారా పరిచయం పెంచుకుని, భావోద్వేగ నమ్మకాన్ని ఏర్పరచుకుంటారన్నారు. అనంతరం అత్యవసర పరిస్థితులు, గిఫ్ట్ చార్జీలు లేదా వ్యక్తిగత అవసరాల పేరుతో డబ్బు అడుగుతారని, కొన్నిసార్లు వాలెంటైన్స్ గిఫ్టులు, జ్యూవెలరీ ఆఫర్లు, ఈవెంట్ టికెట్లు పేరుతో పంపిన లింకులు నకిలీ చెల్లింపు పేజీలకు తీసుకెళ్లి డబ్బు దోచుకుంటారని, ప్రమాదకర యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యేలా చేస్తారాన్నరు. 2025లో తెలంగాణలో ప్రేమ, మ్యాట్రిమోనియల్ మోసాలకు సంబంధించిన 384 కేసులు నమోదై రూ.12.65 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు శిఖాగోయల్ వెల్లడించారు. ఆన్‌లైన్ బెదిరింపు కేసులు 1,231 నమోదై రూ.3.20 కోట్లకు పైగా నష్టం జరిగింది. సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ వేధింపుల కేసులు 3,100 దాటడం ఆందోళనకరమని పేర్కొన్నారు. 2026 ప్రారంభం నుంచే ఇలాంటి మోసాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అజ్ఞాత లింకులు క్లిక్ చేయడం, ఒటిపిలు లేదా బ్యాంకింగ్ వివరాలు పంచుకోవడం వల్ల ఆర్థిక నష్టం, ఐడెంటిటీ దోపిడీ, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్ జరుగవచ్చని హెచ్చరించారు. ప్రమాదకర యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారం, కాంటాక్టులు, బ్యాంకు వివరాలు కూడా దొంగిలించే అవకాశం ఉందని చెప్పారు.

### ఫిర్యాదు కోసం 1930కు కాల్ చేయాలి..

మోసానికి గురైతే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని శిఖాగోయల్ సూచించారు. తొందరగా ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## అంతర్ జిల్లా డిప్యూటేషన్‌కు ప్రభుత్వం అనుమతి

### పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్థానికత కోల్పోయి దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 223మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు సంవత్సరాల పాటు అంతర్ జిల్లా డిప్యూటేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన జిఒ 317 కారణంగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై వారితో సీతక్క సమావేశమయ్యారు.జిఒ 317 వల్ల జరిగిన నష్టాలను కేబినెట్ సబ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సబ్ కమిటీ సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ 190ని జారీ చేసింది. ఖాళీలు ఉన్న ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా డిప్యూటేషన్లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పరిపాలన బలోపేతం చేయడం, సిబ్బందికి న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దుతూ, పారదర్శకంగా, న్యాయబద్ధంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులకు గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలుకానున్నాయని ఆమె తెలిపారు.

**రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘాల హర్షం...**

రెండేళ్ల పాటు జిల్లా డిప్యూటేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘాలు హర్షం వ్యక్తం చేసింది. తమ సమస్యలను సానుకూలంగా పరిగణించి వేగంగా పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరంగా పనిచేస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్న పంచాయతీ కార్యదర్శులకు ఈ నిర్ణయం ఎంతో ఊరట కలిగించిందని వారు తెలిపారు.

## ఇద్దరి పౌరసత్వం రద్దుకు

# ఇజ్రాయెల్ ప్రయత్నం

**రామల్లా:** దేశంలో ఇద్దరి పౌరసత్వం రద్దుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నది. ఉగ్రవాద నేరాలకు దోషులుగా తేలిన వీరి పౌరసత్వాన్ని రద్దు చేయాలని కోర్టును కోరింది. నిర్దిష్ట హింసాత్మక నేరాలకు పాల్పడిన పాలస్తీనా పౌరులను దేశనిర్బంధం చేయడానికి అనుమతించే చట్టాన్ని అమలు చేసే దిశగా ఇది తొలి పరీక్షగా భావిస్తున్నారు. ప్రధానమంత్రి బెంజమిన్ నేతన్యాహూ దాఖలు చేసిన కోర్టు పత్రాలలో, నేరాల తీవ్రతతో పాటు దోషులు పాలస్తీనా అథారిటీ నిధి నుండి చెల్లింపులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకే, పౌరసత్వ రద్దుకు, నిర్బంధానికి అనుమతించాలని కోర్టులో ఇజ్రాయెల్ ప్రభుత్వం వాదించింది. ఇజ్రాయెల్‌లోని ప్రతి ఐదుగురు పౌరుల్లో ఒకరు పాలస్తీనీయులే కావడం విశేషం. ఈ చట్టం ఆమోదించినప్పుడు, ఇది యూదు, పాలస్తీనా పౌరులను వేర్వేరు ప్రమాణాలతో చూడటానికి దారితీస్తుందని విమర్శలు వచ్చాయి. మానవహక్కుల సంస్థలు, పాలస్తీనా అథారిటీ చెల్లింపుల ఆధారంగా చట్టాన్ని అమలు చేయడం వంశవివక్షకు దారితీస్తుందని పేర్కొన్నాయి. నేతన్యాహూ ఆ నిధి హింసాత్మక చర్యలకు ప్రోత్సాహం ఇస్తుందని వాదిస్తుండగా, పాలస్తీనా అధికారులు దాన్ని ఇజ్రాయెల్ నిర్బంధంలో ఉన్న కుటుంబాలకు సామాజిక భద్రతగా సమర్థిస్తున్నారు. కోర్టు దాఖలాలో తూర్పు జెరూసలేంకు చెందిన 48 ఏళ్ల మొహమ్మద్ హమాద్‌పై ఉగ్రవాద చర్యలు, వాటికి సంబంధించిన నిధులు స్వీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతను 2002లో కాల్పులు, ఆయుధాల అక్రమ రవాణా కేసుల్లో శిక్షకు గురై రెండు దశాబ్దాలకు పైగా జైలు శిక్ష అనుభవించాడు. 2023 చట్టం ప్రకారం దేశానికి విశ్వాసభంగం చేసినట్లుగా పరిగణించే ఉగ్రవాద చర్యలకు పాల్పడిన పౌరులు లేదా శాశ్వత నివాసితుల పౌరసత్వాన్ని రద్దు చేయవచ్చు. అయితే, జైలు శిక్ష పూర్తిచేసిన వ్యక్తుల పౌరసత్వాన్ని తొలగించడం న్యాయపరమైన ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని న్యాయవాదులు అంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com